




నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి ...
ఉత్తరాంధ్ర
విశాఖపట్నం, శ్రీకాకుళం
విజయనగరం
గురువారం 16-01-2026 పేజీలు : 19


## భక్తి శ్రద్ధలతో భోగి

2 లో



➢ సంప్రదాయం, సంస్కృతి,ఐక్యతకు అద్దం పట్టిన పండుగ

➢ ఆత్మనిర్భర్ సంక్రాంతితో ఏయూ లో ఉత్సవ శోభ ➢ మూడు రోజులు ఘనంగా నిర్వహించిన మాజీ ఎంపీ జేవీఎల్ నర్సింహులు





2వ పేజీలో

## అప్పన్న కొండపై భోగి వెలుగులు

⇨ సింహగిరి పై పోటెత్తిన భక్తుల తాకిడి ⇨ గోవిందా నామస్మరణతో మరుమోగిన అప్పన్న సన్నది ⇨ అపూర్వ ఆధ్యాత్మిక-సాంస్కృతిక శోభతో సంక్రాంతి సంబరాలు

## ట్రాఫిక్ దిగ్బంధం లో ఆనందపురం..

⇨ ట్రాఫిక్ రద్దీ తో అనుక్షణం బేజారు ⇨ నిత్యం పహారా ఉండాల్సిందే!

⇨ కొద్దిపాటి నిర్లక్ష్యహించిన పెను సవాలే! ⇨ ట్రాఫిక్ పోలీసులకు నిత్యం నరకయాతన! ⇨ నియంత్రణకు పరిష్కారం మార్గం ఎప్పుడో....

⇨ సిపి దృష్టి సారించాలని ప్రజలు విజ్ఞప్తి

3వ పేజీలో



## మాంజాపై నగర పోలీసుల ఉక్కుపాదం..

- ప్రజల ప్రాణాలు లక్ష్యంగా ప్రత్యేక డ్రైవ్ లు
- నిబంధనలు అత్రికమిస్తే చర్యలు తప్పవు

సీపీ.. శంఖబత్ర బాగ్చి



3వ పేజీలో

## సంక్రాంతి పండుగ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక..








3వ పేజీలో

# భోగి మంటల వెలుగులో విశాఖ

(విశాఖపట్నం : మేజర్ న్యూస్)

విశాఖ లో భోగి కాంతులతో నగరం తెల్లవారుజాము నుండే మేల్కొంది. వీధివీధిన భోగి మంటలు వెలిగాయి. అవి కేవలం మంటలు కాదు పాతదాన్ని వీడుతూ కొత్త ఆశలను ఆహ్వానించే ఆనంద జ్వాలలు. సంక్రాంతి పండుగకు నాంది పలికే భోగిని నగర ప్రజలు సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. కాలనీలు, గ్రామాలు అన్న తేడా లేకుండా నగరమంతా పండుగ సందడితో మార్మోగింది. కుటుంబ సభ్యులు, బంధువులు మంటల చుట్టూ చేరి పాత వస్తువులను అగ్నికి ఆహుతి ఇస్తూ, గతాన్ని వెనక్కి నెట్టేశారు. పిల్లల నవ్వులు, పెద్దల ఆశీర్వాదాలు విశాఖ ఉదయానికి ప్రత్యేక శోభను తెచ్చాయి. ఇళ్ల ముందు మహిళలు వేసిన రంగురంగుల ముగ్గులు పండుగ కళను



రెట్టింపు చేశాయి. భోగి పళ్ళ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పూలు, పండ్లు, నాణేలతో చిన్నారులను ఆశీర్వదించగా, వారి ముఖాల్లో పండుగ ఆనందం స్పష్టంగా కనిపించింది. ఇళ్లలో సంప్రదాయ వంటకాల సువాసనలు పరచుకుని పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మార్చాయి. భోగి సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తుల జపధ్వనులు, గంటల మ్రోగులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దేవుని దర్శనం చేసుకున్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహనతో పలుచోట్ల ప్రజలు పరిమితంగా భోగి మంటలు నిర్వహించారు. ప్లాస్టిక్ వంటి హానికర వస్తువులను కాల్చకుండా జాగ్రత్తలు పాటిస్తూ, సంప్రదాయం–పర్యావరణ సమతుల్యతకు విశాఖ ప్రజలు చక్కటి ఉదాహరణగా నిలిచారు. మొత్తంగా భోగి పండగ విశాఖలో ఐక్యత, ఆనందం, సంప్రదాయాల విలువను మరోసారి గుర్తు చేసింది

### ఆత్మనిర్భర్ సంక్రాంతితో విశాఖ ఉత్సవ శోభ

విశాఖ ఏయూ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్‌లో మూడు రోజుల సంప్రదాయ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ జీవన సౌందర్యాన్ని ప్రతిబింబించేలా విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్‌లో 'ఆత్మనిర్భర్ సంక్రాంతి' వేడుకలు నిర్వహించారు. భారతీయ స్వదేశీ భావజాలాన్ని చాటిచెప్పే విధంగా ఏర్పాటు చేసిన ఈ మూడు రోజుల వేడుకలు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. బిజెపి నేత జీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో జనవరి 13 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ జేవీఎల్ నర్సింహులు మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ భారతీయ జీవన విధానానికి ప్రతీక అని, గ్రామీణ సంస్కృతి, కుటుంబ విలువలను గుర్తుచేసే మహత్తర పండుగగా అభివర్ణించారు. వేడుకల ప్రాంగణం అంతటా పల్లె వాతావరణం ఉట్టిపడేలా ఏర్పాట్లు చేశారు. భోగి మంటలు, రంగురంగుల రంగవల్లికలు, హరిదాసుల కీర్తనలు, కోలాటం, సంప్రదాయ ఆటపాటలు పండుగ శోభను రెట్టింపు చేశాయి. పెద్దలతో పాటు చిన్నారులు కూడా ఆటపాటల్లో పాల్గొని సంక్రాంతి ఆనందాన్ని ఆస్వాదించారు. 'ఆత్మనిర్భర్ణ (స్వదేశీ) థీమ్‌తో నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో దేశీయ ఉత్పత్తులు, సంప్రదాయ వృత్తుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామీణ జీవన విధానాన్ని కళ్లముందుకు తీసుకొచ్చేలా చేసిన ఏర్పాటు సందర్శకులను మంత్రముగ్ధులను చేసింది. స్థానిక ప్రజాప్రతినిధులు, బిజెపి నేతలు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రవేశాన్ని అందరికీ ఉచితంగా కల్పించడంతో కుటుంబాలతో కలిసి ప్రజలు భారీగా తరలివచ్చారు. మొత్తంగా 'ఆత్మనిర్భర్ సంక్రాంతి' వేడుకలు విశాఖ నగరంలో పండుగ వాతావరణాన్ని నింపుతూ, తెలుగు సంప్రదాయాల గొప్పతనాన్ని మరోసారి గుర్తు చేశాయి.

# అప్పన్న కొండపై భోగి వెలుగులు..



**సింహాచలం, జనవరి 14, మేజర్‌న్యూస్:** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచే శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం, సింహాచలం భోగి పర్వదినం సందర్భంగా అపూర్వ వైభవంతో భక్తులను ఆకట్టుకుంది. ధనుర్మాస పుణ్యకాలంలో సంక్రాంతి పర్వదినానికి నాంది పలికే భోగి వేడుకలు సింహగిరిని భక్తి--భావంతో పరవశింపజేశాయి. వేకువజాము నుంచే సింహగిరిపై భక్తుల ప్రవాహం వెల్లువలా ఉప్పొంగింది. ఆలయ ప్రాంగణమంతా "గోవిందా గోవిందా" అనే నామస్మరణతో మార్మోగింది. స్వామివారి సన్నిధిలో భక్తుల హృదయాల్లో భక్తి జ్వాలలు వెలిగాయి. భోగి పర్వదినం సందర్భంగా శాస్త్రోక్తంగా భోగి మంటలను నిర్వహించారు. ధనుర్మాస చలిని, అజ్ఞానాంధకారాన్ని తొలగించే ప్రతీకగా స్థానాచార్యులు డాక్టర్ టి.పి. రాజగోపాల్ ఆధ్వర్యంలో, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యుల పర్యవేక్షణలో భోగి మంటలు సంప్రదాయబద్ధంగా వెలిగించారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. సుజాత స్వయంగా భోగి మంటలను వెలిగించి స్వామివారి అనుగ్రహాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో సింగం రాధ, ఏఈఓ కె. తిరుమలేశ్వరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పల్లె వైభవంగా మారిన సింహగిరి

పట్టణ వాసులకు పల్లెటూరి మాధుర్యాన్ని పరిచయం చేసేలా ఆలయ అధికారులు చేసిన ఏర్పాట్లు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. వరి కుప్పలు, గడ్డి మేటలు, చెరకు గడలు, పూరి గుడిసెలు, ఎడ్ల బండ్లు, కుమ్మరి కళా ప్రదర్శనలు, గంగిరెద్దుల విన్యాసాలు, తప్పెటగుళ్ల మోతలు, జంగమ దేవరల దీవెనలు, హరిదాసుల కీర్తనలు – ఇవన్నీ కలసి సింహగిరిని అచ్చమైన పల్లెటూరిగా మలిచాయి.

రంగురంగుల రంగవల్లికలు, ముత్యాల ముగ్గులతో ఆలయ ప్రాంగణం వైకుంఠాన్ని తలపించింది. చిన్నారులకు భోగి పళ్ళు పోయడం, వారి సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

### సామాన్య భక్తుడే వీఐపీ" సేవా భావానికి నిదర్శనం

భక్తుల రద్దీ దృష్ట్యా సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈవో ఎన్. సుజాత ప్రత్యేక చర్యలు చేపట్టారు. వీఐపీలకు సైతం నీలాద్రి గుమ్మం నుంచే దర్శనానికి అనుమతి ఇస్తూ, క్యూలైన్లలో ఉన్న సాధారణ భక్తులకు వేగవంతమైన దర్శనం కల్పించారు. క్యూలైన్లలో మంచినీటి సదుపాయాలు, అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ భక్తుల ప్రశంసలను అందుకున్నాయి. నిత్య అన్నదానం -- పండుగ రుచులతో భక్తుల తృప్తిదర్శనం అనంతరం స్వామివారి నిత్య అన్నదానంలో భాగంగా భోగి పండుగ ప్రత్యేక వంటకాలు -- బూరెలు, పులిహోర, రుచికరమైన కూరలతో కూడిన అన్నప్రసాదాన్ని భక్తులకు వడ్డించారు. భక్తులు ఆనందంగా స్వీకరించి తృప్తిగా వెనుదిరిగారు.

### ట్రాఫిక్ నియంత్రణలో పోలీసుల సమర్థ నిర్వహణ

భక్తుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణలో గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ సన్యాసినాయుడు, ట్రాఫిక్ సీఐ సురేష్ తమ సిబ్బందితో కలిసి విశేష కృషి చేశారు. ఘాట్ రోడ్డులోనూ, ఆలయ పరిసరాల్లోనూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. మొత్తంగా భోగి పర్వదినం నాడు సింహగిరిపై నెలకొన్న ఆధ్యాత్మిక--సాంస్కృతిక వైభవం భక్తులకు ఒక అపూర్వమైన, మరపురాని అనుభూతిని అందించింది. సింహాద్రి అప్పన్న కృపతో భక్తుల హృదయాల్లో భక్తి జ్యోతి మరింత ప్రకాశించింది.



## పశ్చిమ టిడిపి కార్యాలయంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



**గోపాలపట్నం, జనవరి 14, మేజర్‌న్యూస్:** విశాఖ పశ్చిమ నియోజకవర్గం కార్యాలయం,గోపాలపట్నం నందు ప్రభుత్వ విప్ గణబాబు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. మేడ్ ఫర్ ఈచ్‌అదర్ కంపిటిషన్ లో గెలిపొందిన ఉత్తమ జంటకు 50,000 రూపాయల గిఫ్ట్ వోచర్ బహుమతి ప్రదానం చేసారు. మహిళలకు ముగ్గులు పోటీలు,పిండివంటలు పోటీలు నిర్వహించి గెలిపొందిన వారికీ గిఫ్ట్ వోచర్స్ అందించడం జరిగింది. మరియు సంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల నూత్యాలు, హరిదాసు పద్యాలు నిర్వహించడం జరిగినది నిన్న జరిగిన రోప్ గేమ్ లో గెలిచినా టీమ్ ను అభినంధించి బహుమతి ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ గణబాబు మాట్లాడుతూ ప్రజలకు సంక్రాతి శుభాకాంక్షలు తెలుపుతూ నియోజకవర్గం లో సంక్రాతి సంబరాలు జరుపుకోవాడం సంతోషకరమని అదేవిదంగా పోటీలో పాల్గొని గెలుపొందిన సభ్యులకి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి ప్రభుత్వ విప్ వేపాడ చీరంజీవి రావు, సిఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ డీసీసీబీ చెర్మన్ కోన తాతారావు ప్రభుత్వ విప్ గణబాబు తనయుడు టీడీపీ యువనేత మౌర్య సింహ కుటుంబ సభ్యులు,జనసేన నియోజకవర్గ నాయకురాలు అంగా దుర్గ ప్రశాంతి గారు టీడీపీ కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్,శరగడం రాజశేఖర్,కూటమి నేతలు, కార్యకర్తలు,మహిళా నేతలు,అధిక సంఖ్యలో ప్రజలు మొదలగున్నవారు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా మొదలైన భోగి, సంక్రాంతి, కనుమ సంబరాలు





**పద్మనాభం, జనవరి 14, మేజర్‌న్యూస్:** పద్మనాభం మండలం కృష్ణాపురం పంచాయతీలు గత కొన్నేళ్లగా అత్యంత వైభవశీగా భోగి, సంక్రాంతి, కనుమ పండగలను గ్రామస్తులు అంతా ఏకమై గ్రామంలో ఉన్న యువకులు, ఉద్యోగస్తులు,ఇతరులు వారి యొక్క ఆర్థిక నిధులు ఏర్పాటు చేసుకొని, ఎవరు వీలు బట్టి వాళ్ళు ఈ సంక్రాంతి సంబరాలకు తమ వంతుగా సహాయ సహకారాలను అందిస్తూ ఉంటారు. గ్రామంలోని యువత ఈ విధంగా ఏర్పాటు చేసిన నిధితో సంక్రాంతికి వారం రోజులు ముందు నుంచే గ్రామంలో పండగ వాతావరణం నెలకొనేలా ఏర్పాటులు చేయడం మొదలుపెడతారు. సరిగ్గా భోగి రోజు నుంచి భోగిమంటలతో ఆరంభమై వివిధ సాంస్కృతి కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు, వివిధ ఆటలు,పాటల కార్యక్రమాలు వంటివి ఏర్పాటు చేస్తారు. ఈ గ్రామం నుంచి సుధీర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగం చేస్తున్న యువత మరియు కుటుంబ సభ్యులు, గ్రామంలో ఎటువంటి వర్ణ, వర్గ,రాజకీయ విభేదాలు లేకుండా గ్రామస్తులు అంతా ఏకమై ఒకే చోట చేరుకొని భోగి మంటలను వేసి, అనంతరం సాంప్రదాయక దుస్తులు ధరించి, పిండి వంటలు ఇతరేతర కార్యక్రమాలతో ఆనందాన్ని వ్యక్తం చేస్తారు. ముఖ్యంగా సంక్రాంతి పండగ కొరకు ప్రత్యేకంగా పండగ వాతావరణం తలపించేలా ఒక సెట్ వేసి యువత అంతా అక్కడికి చేరుకోగానే అందరికీ కూడా పండగ వాతావరణం లోకి వెళ్లినంత ఆనందాన్ని వచ్చినట్లుగా ఈ సెట్టలను ఏర్పాటు చేస్తారు. మూడు రోజులు జరిగే సంబరాలలో చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ కూడా ఆటపాటల్లో మునిగి తేలుతారు. ఈ కార్యక్రమాలని స్థానిక యువత మరియు ఆ గ్రామంలోని ఉద్యోగస్తుల ఆధ్వర్యంలో గ్రామ పెద్దల సమక్షంలో ఎంతో ఘనంగా నిర్వహిస్తూ ఉంటారు.

## భోగి మంటలో లేబర్ కోడ్స్ పత్రాలు


# దగ్ధం చేసిన సిఐటీయూ నేతలు

### కోడ్స్ కు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12 సమ్మె సిఐటీయు నేతలు వెల్లడి



**మధురవాడ, జనవరి 14, మేజర్‌న్యూస్:** కార్మికుల పట్ల బీజేపీ అనుసరిస్తున్న విధానాలు అత్యంత దుర్మార్గం అని సిఐటియు జోన్ అధ్యక్షులు డి అప్పలరాజు అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ ను వ్యతిరేకిస్తూ భోగి మంటల్లో కోడ్స్ నమూనా పత్రాలను దగ్ధం చేస్తూ వినూత్నంగా బుధవారం శ్రీ కృష్ణ నగర్ లో ద్రోణంరాజు కళ్యాణ మండపం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డి అప్పలరాజు మాట్లాడుతూ శతాబ్ద సంవత్సరాల కాలం నుండి పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను రద్దు చేసి లేబర్ కోడ్స్ తీసుకొచ్చి బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేసిందని తెలిపారు. కార్మికులను బానిసలుగా మార్చే ఈ కోడ్స్ ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12వ తారీకున దేశవ్యాప్త సమ్మెకు అఖిల పక్ష, కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని తెలియజేశారు. ఈ సమ్మెలో ప్రజానీకం అంతా పాల్గొని పోరాడాలి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్ రామప్పడు,బి రాంబాబు,పోతురాజు,బి లక్ష్మి,ఎస్ రాజు,సుజాత వి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మాంజాపై నగర పోలీసుల ఉక్కుపాదం..



**(విశాఖ క్రైం : మేజర్ న్యూస్)**

సంక్రాంతి పండుగ నేపథ్యంలో మానవ ప్రాణాలకు ముప్పు కలిగిస్తూ, పక్షిజాలానికి మరియు పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తున్న నిషేధిత మాంజా నైలాన్ చైనీస్ గాలిపటం దారం వినియోగాన్ని అరికట్టేందుకు విశాఖ నగర పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నగరవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌ను విస్తృతంగా నిర్వహించారు.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో నగర పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బందితో పాటు టాస్క్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు. సమన్వయంతో చేపట్టిన తనిఖీల్లో సుమారు 650 చైనీస్ మాంజా రోల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత మాంజా విక్రయాలు, కలిగి ఉండటం, వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు స్పష్టం చేశారు.మాంజా కారణంగా గతంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఈ చర్యలు ప్రజల నుంచి హర్షాతిరేకాలు పొందాయి. ద్విచక్ర వాహనదారులు, చిన్నారులు, పక్షులు తీవ్ర గాయాలకు గురయ్యే ప్రమాదం ఉండటంతో పాటు, విద్యుత్ అంతరాయాలు కూడా ఏర్పడుతున్నాయని పోలీసులు గుర్తు చేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ, "సంక్రాంతి పండుగను ఆనందంగా, కానీ బాధ్యతాయుతంగా జరుపుకోవాలి. నిషేధిత మాంజాను ఉపయోగించడం ద్వారా ఇతరుల ప్రాణాలకు ప్రమాదం కలిగించడమే కాకుండా ప్రకృతికి కూడా నష్టం జరుగుతుంది. ప్రజలు స్వచ్ఛందంగా సహకరించి చట్టాన్ని గౌరవించాలి" అని విజ్ఞప్తి చేశారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి డ్రైవ్‌లు కొనసాగుతాయని, నిషేధిత మాంజా విక్రయాలు లేదా వినియోగం గుర్తించినట్లయితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర పోలీసులు హెచ్చరించారు. మొత్తంగా ఈ ప్రత్యేక డ్రైవ్ ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణపై నగర పోలీసుల నిబద్ధతకు మరో నిదర్శనంగా నిలిచింది.

# ట్రాఫిక్ దిగ్బంధం లో ఆనందపురం..

**ఆనందపురం, జనవరి 14, మేజర్‌న్యూస్:** ఆనందపురం జంక్షన్ ట్రాఫిక్ పోలీసులకు ప్రధాన సమస్యగా మారింది. నిత్యం వేల సంఖ్యల వాహనాలు ఆనందపురం మీదగా అటు విజయనగరం శ్రీకాకుళం పెందుర్తి పరిసర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఆనందపురం జంక్షన్ లో నిత్యం ట్రాఫిక్ వలయంగా మారుతుందని పలువురు చెబుతున్నారు ట్రాఫిక్ పోలీసులు నిరంతరం చెమటోడ్చినప్పటికీ కూడా ప్రయాణికులకు కష్టాలు తీరలేదని వాదనైతే బలంగా వినిపిస్తుంది. దానికి తోడు రోడ్డుపైనే వ్యాపారస్తులు పువ్వులు పట్టుకొని వెళుతున్న వాహనాలను అడ్డగించి క్రయవిక్రయాలు జరపడం వల్ల , ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని తెలుస్తుంది పోలీసులు ఎంత వారిస్తున్నప్పటికీ వ్యాపారాలు తీరు మారడం లేదని చెబుతున్నారు. పండగ వేలు అయితే ఈ ట్రాఫిక్ అయిదింతలు గట్టిగా తయారవుతుంది. రాత్రింబవలు పోలీసులకు కత్తి మీద స్వాము అనే చెప్పవచ్చు. పోలీసులు ఎంత చాకచక్యంగా ట్రాఫిక్ ను నియంత్రించినప్పటికీ రద్దీ మాత్రం అవుతూనే ఉందని, దానికి తోడు మహాత్మా గాంధీ డైలీ పువ్వులు మార్కెట్ పక్కనే ఉండడం రోడ్డుపైనే వాహనాలు పార్కింగ్, వ్యాపారాలు కొనసాగుతూనే ఉన్నాయి, సింహాద్వారం పక్కనే ఉన్న మార్కెట్ ను ఉపయోగంలో తీసుకున్నట్లయితే కొంతమేర ట్రాఫిక్ సమస్యకు ఉపశమనం కలగొచ్చని నిపుణులు తెలుపుతున్నారు. అలాగే ట్రాఫిక్ సమస్య నియంత్రణ కొరకు నూతన మార్గాన్ని అన్వేషించాలని నూతన నాలుగు లైన్ల రింగ్ రోడ్డును ఏర్పాటు చేసినట్లయితే ట్రాఫిక్ సమస్య నియంత్రంచవచ్చు. ఏదేమైనప్పటికీ పూర్తిస్థాయి ట్రాఫిక్ పరిష్కార మార్గం అన్వేషించాలంటే ట్రాఫిక్ పోలీసులకు ఇబ్బందులు కలక్కుండా చేయాలన్న నూతన ఫ్లైవర్



పనులు మొదలు పెట్టాలని ప్రజలు చెబుతున్నారు.

### హైవే ప్రణాళిక అట్రా ప్లాప్..!

జాతీయ రహదారి సంస్థ ప్రణాళిక అట్రా ప్లాప్ కావడంతో నేడు ఆనందపురం జంక్షన్ కు ట్రాఫిక్ గండం పట్టుకుంది. రహదాలు సరైన మార్గం చూపకపోవడంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో పోలీసులకు పెను సవాల్ గా మారింది.జంక్షన్ లో సర్కిల్ చుట్టూ సరైన మార్గం లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలతో తాండవం చేస్తుంది.నేషనల్ హైవే అథరిటీ ప్లాన్ లో భవిష్యత్ దృష్ట్యా మార్గం దారులు ఇవ్వకపోవడం తో నేడు ప్రజలు ఇబ్బందులు కు కారణమైంది.పండగ సమస్య లో రద్దీ తో పోలీసులు అటూ వాహనదారులు అవస్థలు పడుతున్నారు.దీనికి సరైన ప్రణాళిక లేకపోవడమే కారణమని స్థానికంగా చెబుతున్నారు.ఇప్పటికైనా నగర పోలీసు కమిషనర్ దృష్టి సారించి ట్రాఫిక్ సమస్యల నుండి విముక్తి కల్పించాలని వాహనదారులతో పాటు స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# సంక్రాంతి పండుగ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక..

**(విశాఖ సిటీ : మేజర్ న్యూస్)**



ధనుర్మాసంలో మంచు కురుస్తుంది.. వీధులు చల్లగా ఉంటాయి.. ముగ్గులతో అందంగా ఉంటాయి.. పంటలు పండుతాయి.. పండుగలూ మొదలవుతాయి..ప్రతి ఏడాది పండుగలు సంక్రాంతితో మొదలవుతాయి. అందుకే సంక్రాంతిని సంవత్సరంలో తొలి పండుగగా చెబుతారు.ఏడాది మొత్తం కష్టపడి పండించిన పంటలు ఇళ్లకు చేరే సమయం.. గంగిరెద్దుల ఆటలతో, హరిదాసులు సంకీర్తనలతో, చిన్నారులు.. అమ్మాయిలు గొబ్బి పాటలతో, కొత్త అల్లుళ్ళ సందళ్ళతో ఊరంతా సందడిగా మారే రోజు సంక్రాంతి.. రైతుల పండుగ.. జానపదుల పండుగ.. శ్రమ జీవుల పండుగ...జంతువులలో సైతం దివ్యత్వాన్ని ప్రతిబింబించే పండుగ.. పిల్లలకు గాలి పటాల పండుగ.దక్షిణాదిన శుభకార్యాలన్నీ సంక్రాంతి తరువాతనే ఆరంభిస్తారు. సంక్రాంతికి నెల రోజుల ముందే సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశిస్తాడు. అప్పటి నుంచి పండుగ నెల ప్రారంభమవుతుంది. రంగు రంగు ముగ్గులతో ధనుర్మాసానికి స్వాగతం పలుకుతారు ఆడవాళ్లు.నెల రోజులపాటు ఇంటి లోగిళ్లు ముగ్గులతో కళకళలాడుతాయి. మన పెద్దవాళ్లు ఎన్నో ఆరోగ్య సూత్రాలతో తరతరాల నుంచీ ఈ ఆచారాలను పాటిస్తున్నారు.శీతాకాలంలో చలి ప్రభావానికి కందరాలు పట్టేసే అవకాశం ఉంది. తెల్లవారు జామునే లేచి ముగ్గులు వేస్తే బద్ధకం పోతుంది.వాటికోసం కోసం నడుము వంచడం.అటూ కదలడం వల్ల కండరాలకు కూడా మంచి వ్యాయామం దొరుకుతుంది.ధనుర్మాసం నెలరోజుల పాటు వైష్ణవాలయాలో ప్రతిరోజూ తెల్లవారు జామున తిరుప్పావై వైభవంగా జరుగుతుంది. ఆలయాల్లో దేవునికి కట్టెపొంగలి ప్రసాదంగా నివేదిస్తారు. దీని వెనుక కూడా ఆరోగ్య సూత్రం ఇమిడివుంది. శీతాకాలం చలి ప్రభావానికి మిరియాలతో చేసిన వట్టిపొంగలి మంచి విరుగుడుగా పనిజేస్తుందట.హిందువుల సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలైన పండుగల్లో సంక్రాంతి పండుగే ప్రధానం. సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకర రాశిలోకి ప్రవేశించే రోజును మకర సంక్రాంతి అంటారు. భోగభాగ్యాలతో, సిరిసంపదలను కురిపిస్తూ.. కొత్తకాంతులను విరజిమ్ముతూ.. కొత్త ధాన్యాలతో.. సంక్రాంతి లక్ష్మి ప్రవేశిస్తుందని కవులు వర్ణిస్తారు. పిల్లలూ.. పెద్దలూ.. ఇంటిల్లిపాదీ ఎంతో శోభాయమానంగా జరుపుకుంటారు. ఈ పండుగను మూడు రోజులు జరుపుకోవడం ఆనవాయితీ.జీవింతంలో ఇప్పటి వరకు అనుభవించిన అన్ని పీడలు తొలగి.. భోగితో వైభోగం మొదలవుతుంది అంటారు. ఆ రోజు పెద్దలు, పిల్లలు అందరు వేకువజామునే నిద్ర లేచి కొన్ని రోజులుగా సేకరించిన ఆవు పిడకలు.. ఎండు కట్టెలు.. వేసి భోగిమంటను వేస్తారు. కొన్ని రాష్ట్రాలలో పనికిరాని పాత సామానుతో మంట వేసే ఆచారం కూడా ఉంది. అంతేకాదు ఈ భోగి మంటల్లో ఇంట్లో పనికిరాని పాత వస్తువులు చేస్తే భోగిపీడ పోతుందని నమ్ముతారు. కుటుంబమంతా ఈ భోగిమంట చుట్టూ చేరి చలి కాచుకుంటూ పాటలు పాడతారు.కొన్ని ప్రాంతాలలో డప్పు వాయిస్తూ పాటలు పాడతారు. ఇలా భోగిపీడను వదిలించుకోవడం అనాదిగా వస్తున్న ఆచారం. తర్వాత తలంటు స్నానం చేసి, కొత్త బట్టలు ధరించి తీపి తింటారు.గారెలు, బూరెలు, పులిహోర, అరిసెలు, జంతికలు, పప్పుబిళ్లలు వంటి రకరకాల పిండి వంటలు చేసుకుని బంధుమిత్రులతో కలిసి భోజనం చేస్తారు. ఆనవాయితీ ఉన్నవారు తమ తమ ఇళ్లల్లో గౌరీ దేవీ రూపంలో గొబ్బెమ్మలను పెట్టి పాటలు పాడి పూజ చేసి ముత్తైదువులకు తాంబూలం ఇస్తారు.భోగిరోజు 12 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న చిన్న పిల్లలకు రేగు పండ్లు, బొరుగులు, చిల్లర నాణాలు వంటివి కలిపి భోగిపళ్ల పోస్తారు.అలా చేస్తే దృష్టి దోషాలు పోతాయని నమ్ముతారు. భోగిరోజు సాయంత్రం వైష్ణవాలయాలలో శ్రీ గోదాదేవి... రంగనాథుల కళ్యాణం అత్యంత వైభవంగా జరుపుతారు. ఇక సంక్రాంతి పండుగ అంటే వెలుగును ఆహ్వానించడం అని అర్థం. సూర్యుడు ధనుస్సు రాశి నుంచి మకరరాశిలోకి ప్రవేశించిన రోజు మకర సంక్రాంతి. ఈ రోజున పవిత్ర పుణ్య దినంగా బావిస్తారు. ఇలాంటి పుణ్య ఘడియలు ఆషాడశుద్ధ ఏకాదశి వరకు ఉంటాయి. సంక్రాంతి రోజు కొత్త కుండలో పాలు పొంగించి,కొత్త బియ్యం, కొత్త బెల్లంతో పొంగలి వండుతారు. ఇదే రోజు హరిహరసుతు తనయుడు.. కేరళలో వేంచేసిన.. ధర్మశాస్తుడు.. అయ్యప్పస్వామి జ్యోతి రూపంలో భక్తులకు దర్శనమిస్తాడని పురాణాల ద్వారా తెలుస్తుంది. మకరరాశికి అధిపతి శని. అందుకే మకర సంక్రాంతి రోజున శనికి ప్రీతికరమైన నల్ల నువ్వులు బెల్లంతో చేసిన లడ్డూలు గుమ్మడికాయలు దానం చేస్తారు. ఇలా చేస్తే ఆరోగ్యం. సిరిసంపదలు వృద్ధి చెందుతాయని విశ్వాసం. ఈ రోజున ఏ దైవాన్ని పూజించినా, యజ్ఞం చేసినా విశేష ఫలితం ఉంటుందంటారు. ఈ రోజున పితృదేవతల ప్రీతి కోసం తర్పణాలు వదులుతారు. అంతేకాదు ఈ రోజు మరణిస్తే స్వర్గప్రాప్తి కలుగుతుందని విశ్వసిస్తారు.మూడవరోజును కనుమ పండుగగా జరుపుతారు. ఇది కర్షకుల పండుగ. ఈ రోజు పాడిపంటలను, పశుసంపదలను లక్ష్మీస్వరూపంగా పూజిస్తారు.ఈ పండుగ రోజున ఆడపడుచులు పసుపుకుంకుమలు ఇచ్చి పుచ్చుకుంటారు. సంవత్సరమంతా రైతులకు చేదోడువాదోడుగా ఉండే పశువులను కృతజ్ఞతాపూర్వకంగా ఈ రోజున అలంకరించి పూజిస్తారు. పశువుల కొమ్ములకు రంగులు వేసి అలంకరిస్తారు. గంగిరెద్దుల వాళ్లు ఇల్లిల్లూ తిరుగుతూ ఎద్దుల అందరికి ఆశీర్వాదాలు ఇస్తూ ఆడి పాడి అలరిస్తారు. సంక్రాంతికి వారు సంపాదించేది. సంవత్సరమంతా వస్తుందని చెబుతారు. కొన్ని ప్రాంతాలలో ప్రభలను ఊరేగిస్తారు. కలియుగ వైకుంఠం తిరుపతిలో శ్రీవారి పార్వేట ఉత్సవం కనుమ రోజు ఎంతో కన్నుల పండుగగా జరుగుతుంది. ముక్కనుమ పండుగను మూడు రోజులు జరిపి నాలుగో రోజు ఆనందాల నుంచి ఆధ్యాత్మికంలోకి వస్తారు. చాలా ఊళ్లలో గ్రామ దేవతలకు నైవేద్యాలు పెట్టి సంబరాలు జరుపుతారు. రంగు రంగు ముగ్గులకు స్వస్తి పలికి రథం ముగ్గులను ఇళ్లముందు వేసి పండుగను వీడ్కోలు పలు కుతారు. చెన్నై లో దీనిని తిరుగుడు పండగ అంటారు. ఆ రోజు ఎవరూ ఇంట్లో ఉండరు. పగలంతా బయట తిరిగి, రాత్రి సమయానికి ఇల్లు చేరుతారు. ఈ ఆచారం తెలుగునాట కొన్ని ఊర్లలో మాత్రమే కనబడుతుంది. సంక్రాంతికి తెలుగు వాళ్లు కోళ్లతో పందేలు వేసి సంబరాలు చేస్తారు. మకర సంక్రాంతిని తెలుగు వాళ్లు సంక్రాంతి అని, తమిళనాడు లో 'పొంగల్' అని, బెంగాల్ లో తిల ప్రా "సంక్రాంతి అని, పంజాబ్ లో 'లోహిడి' అని, మహారాష్ట్రలో 'సిటీ' సంక్రాతి అది వివిధ ప్రాంతాలలో వివిధ పేర్లతో పిలుస్తారు. కొన్ని ప్రాంతాలలో ఎడ్ల పందేలు జరుపుతారు. మరికొన్ని ప్రాంతాలలో ఈ రోజున పితృదేవతల పేరిట వస్త్రదానం చేస్తారు.




## వైభవంగా భోగి పండుగ



**చీపురుపల్లి జనవరి 14 మేజర్ న్యూస్ :** చీపురుపల్లి భోగి పండుగ వేడుకలు బుధవారం తెల్లవారుజామున ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంతో పాటు గ్రామాల్లో యువత, పెద్దలు కలిసి భోగి మంటలు వేసి వేడుకలు నిర్వహించారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ నివాసం వద్ద, మాజీ ఎమ్మెల్యే గద్దె బాబురావు నివాసం వద్ద, స్థానిక దేవాంగుల వీధిలో జడ్పీటీసీ నివాసం అవరణలో ఘనంగా భోగి పండుగ వేడుకలు నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యులు వలిరెడ్డి శిరీష, వైసీపీ జిల్లా నాయకులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, యువత వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు వలిరెడ్డి రవీంద్ర నాయుడు, పద్మ, ప్రభాత్ కుమార్, చంద్రశేఖర్ గుప్త, నారాయణశెట్టి సోమేశ్, అశోక్, పి.సన్యాసి, పోలినాయుడు, అప్పారావు, సంతు పాల్గొన్నారు.

## ఘనంగా సంక్రాంతి సంబరాలు

- జెడ్పీ చైర్‌పర్సన్ నివాసంలో భోగీ
- సంక్రాంతి పండుగ వేడుకలు



**విజయనగరం టౌన్, జనవరి 14, మేజర్ న్యూస్ :** మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గుర్తు చేస్తూ భోగీ-సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎడ్ల బండి, నాగలి, మట్టి పాత్రలు, ధాన్యం రాశులు, రంగురంగుల హరివిల్లు ముగ్గులు, పలు రకాల పిండివంటలు, చిన్నారుల కోలాటాలు, గంగిరెద్దులు, హరిదాసుల సందడి నడుమ భోగీ కార్యక్రమం కనుల పండుగగా సాగింది. భోగీ మరియు సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని విజయనగరం నగరంలోని వసంత విహార్‌లో ఉన్న తమ నివాసంలో ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఘనంగా పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి మజ్జి పుష్పాంజలి, అల్లుడు నెల్లిమర్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ప్రదీప్ నాయుడు, కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ, కుటుంబ సభ్యులు, బంధువులు మరియు ఆత్మీయులు పాల్గొన్నారు. భోగీ పండుగ సందర్భంగా సంప్రదాయబద్ధంగా భోగీ మంటలు వేసి తిలకిస్తూ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఇంటి ప్రాంగణం సంప్రదాయ పండుగ వాతావరణంతో కళకళలాడింది.

# ఆవాస్ ఇళ్ల మంజూరులో హైటెక్ మోసం.!

- అనర్హులకు ఇల్లు మంజూరు - అర్హులకు మొండిచేయి.! - ఎఒన్ ఆధారిత యాప్ బూచి చూపి కళ్ళ బొల్లి కబుర్లు.!
- మంజూరుకు పురాతన ఇళ్లకు జియో ట్యాగింగ్.! - అవినీతి కోరల్లో చిక్కుకున్న గృహ నిర్మాణం.!
- మంజూరి అయిన ఇళ్లపై ఆరోపణల పరంపర.!



**మెరకముడిదాం జనవరి 14 మేజర్ న్యూస్ :** మెరకముడిదాం మండలంలో ఎన్నడూ లేని విధంగా" ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం"కింద ఇల్లు మంజూరులో ఆ శాఖ అధికారులు హైటెక్ మోసానికి తెరలేపి, అవినీతి కి పాల్పడుతున్నట్లు పక్కా ఆధారాలతో కూడిన ఆరోపణలు గుప్పుమంటున్నాయి. మండలంలో ఇళ్ల మంజూరు అన్నది ఒకప్పుడు పారదర్శకంగా జరిగేది. ఇప్పుడు కాగడా పెట్టి వెతికినా ఆ ఆనవాళ్లు కనబడడం లేదు. ఇప్పుడు ఇళ్ల మంజూరు ఒక ప్రహసనంగా మారిపోయింది. ఏ గ్రామం లో చూసినా, ఎవరి నోట విన్నా! ఇదే మాట. "ఆవాస్ యోజన" పేరుతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మంజూరు కానున్న ఇళ్లలో గృహ నిర్మాణ శాఖ అధికారులు హైటెక్ మోసానికి తెరలేపి ఇళ్ల మంజూరు లో చేతి వాటం చూపిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అడ్డ దారిలో ఇళ్ల మంజూరు చేస్తే తప్ప లాభాపేక్ష ఉండదని అనుకున్నారేమో! లేదా! ఒత్తిళ్లు కు తలొగ్గి అలా చేస్తున్నారో తెలియదు కానీ సదరు గృహ నిర్మాణ శాఖ అధికారులు పాత ఇళ్లకు జియో ట్యాగింగ్ చేసి మంజూరు ఉత్తర్వులు ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నారని ఆరోపణలు పక్కాగా వస్తున్నాయి. ఉదాహరణగా చెప్పాలంటే " మేజర్ న్యూసు కు అందిన సమాచారం మేరకు ఒక గ్రామంలో 120 ఇళ్లకు పైగా జియో ట్యాగింగ్ చేసారు. అందులో 80 వరకూ పాత ఇళ్లకే జియో ట్యాగింగ్ చేసినట్లు తెలిసింది. మండలంలో అన్ని గ్రామాల్లో ఇలానే ఉంది. అర్హులైన వారి ఇళ మంజూరు కొరకు జియో ట్యాగింగ్ చేయుటకు ఎ ఒన్ ఆధారిత యాప్ సహకరించడం లేదని కళ్ళ బొల్లి కబుర్లు చెబుతున్న సదరు గృహనిర్మాణ అధికారులు దొంగ ఇళ్లకు జియో ట్యాగింగ్ చేసినప్పుడు ఎ ఒన్ ఆధారిత యాప్ ఎలా సహకరిస్తుందో సెలవివ్వాలని బాధిత గృహ నిర్మాణ లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇల్లు మంజూరు కొరకు జియో ట్యాగింగ్ చేసిన ఇళ్లలో పది సంవత్సరముల కిందట నిర్మించిన కాలనీలు, వైయస్సార్ గవర్నమెంట్ లో నిర్మించిన కాలనీలుతో పాటు ఐదారు సంవత్సరములు కిందట స్వంతంగా లబ్ధిదారులు నిర్మించుకున్న ఇల్లు కూడా ఉన్నట్లు అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు తెలియ వచ్చింది. మండలం మొత్తంగా సుమారు 1500 మంది ఇళ్ల మంజూరుకు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా, అందులో సగానికి సగం బోగస్ ఇళ్లేనని పబ్లిక్ టాక్ గా వినిపిస్తోంది. గృహ నిర్మాణశాఖ అధికారులు తమకు నచ్చిన, తాము మెచ్చిన సుమారు1050 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు కు ఇప్పటికే లైన్ క్లియర్ చేసినట్లు సమాచారం. ఇందులో సగానికి సగం బోగస్ ఇల్లే ఉన్నాయన్నది పచ్చి నిజం. .నిజానికి చెప్పాలంటే అధికారులు రిజెక్ట్ చేసిన 450 ఇల్లే అర్హత ఉన్నవి. అయినా ఈ 450 ఇళ్లకు అర్థం లేని కారణాలు చూపుతూ, ఎ ఒన్ ఆధారిత యాప్ పై నెపం నెట్టేస్తూ, ఆ యాప్ సహకరించడం లేదంటూ, కుంటి సాకులు చెబుతూ రిజెక్ట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు మంజూరు కు రెడీ చేసిన 1050 ఇళ్లలో 500 వరకూ ఇదివరకు ఏదో స్కీం లో అయిపోయిన ఇల్లు. వీటితో పాటు, పాత ఇల్లు కూడా ఉన్నట్లు ఆధారాలతో కూడిన ఆరోపణల పరంపర కొనసాగుతోంది. అర్హత కలిగిన 450 మంది లబ్ధిదారుల ఇళ్ల మంజూరుకు కుంటి సాకులు అధికారులు చెప్పడంలో దాని అర్థం, పరమార్థం వెనుక ఇతరులు ప్రమేయం ఉందన్న బహిరంగ విమర్శలు వస్తున్నాయి. అదేంటని అడిగితే అబ్బే అలాంటిదేమీ లేదు. ఇదంతా " ఎ ఒన్ ఆధారిత యాప్ పనేనని ఆ యాప్ నే వీరిని రిజెక్ట్ చేస్తోందని కళ్ళ, బొల్లి కబుర్లు చెబుతూ కాలయాపనం చేస్తున్నారు. ఇక్కడ పని చేస్తున్న గృహ నిర్మాణశాఖ ఉద్యోగులు మొదట నుండీ వివాస్పదంగానే ఉంది. ఇది వరలో తప్పుడు ఇళ్లకు బిల్లులు చెల్లించి ఇప్పటి వరకూ ఈ మండలంలో ఇద్దరు ఏ ఈ లు , ముగ్గురు వర్క్ ఇన్స్పెక్టర్లు ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. అయినా ఇప్పటికీ ఈ మండలంలో పని చేస్తున్న గృహ నిర్మాణ ఉద్యోగుల్లో మార్పులేదంటే గర్వించదగ్గ విషయం. ఏది ఏమైనా రిజెక్ట్ చేసిన అర్హులైన సుమారు 450 ఇళ్లను మంజూరు చేయకుండా మీన మేషాలు లెక్కిస్తున్నారు. తర్వాత గలిగిన వారి అందరికీ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా పాత ఇళ్ల మీద మంజూరు ఉత్తర్వులు ఇచ్చి బిల్లులు చెల్లించాలని గృహనిర్మాణ శాఖ అధికారులు చూస్తే దోషులుగా మిగలక తప్పదని అర్హత కలిగిన ఇళ్ల లబ్ధిదారులు హెచ్చరిస్తున్నారు.

# పండగ శోభ కొత్తదనాన్ని తెచ్చింది

## సంబరాల్లో పాల్గొని ఆర్థిక ప్రోత్సాహకాలను అందజేసిన ఎమ్మెల్యే మాధవి





**పూసపాటి రేగ (మేజర్ న్యూస్) :** నియోజకవర్గంలో జనసేన పార్టీ నిర్వహించిన పల్లె పండగలో కార్యక్రమంలో సంక్రాంతి సంబరాలు నూతనోత్సాహాన్ని నింపాయని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మండలంలోని కందివలసలో నిర్వహించిన రంగవల్లుల పోటీలతో పాటు వస్త్రాల పంపిణీ కార్యక్రమానికి భోగి పర్వదినమైన బుధవారం జనసేన నాయకుడు లోకం ప్రసాద్ తో కలిసి ఎమ్మెల్యే మాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు నిర్వహించడంతో ఆ పోటీలకు యువత భారీ ఎత్తున పాల్గొని గెలుపొందున జట్లు తమ ఆనందానికి హద్దే లేవని, తాజాగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో పంచాయతీల్లో పేదలకు వస్త్రాల పంపిణీ కార్యక్రమం కూడా నిర్వహించడం గొప్ప ఆనందకర విషయం అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ దే సెట్టు గణేష్ తో కలిసి ఎమ్మెల్యే మాధవి పేదలకు వస్త్రాలను పంపిణీ చేయడంతో పాటు రంగవల్లులు పోటీల్లో గెలుపొందిన నారీమణులకు ఆర్థిక ప్రోత్సాహకాలను ఎమ్మెల్యే మాధవి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం సర్పంచు గణేష్ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే మాధవి దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జమరాజు, ఉప సర్పంచ్ ఓటు సత్తిబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## నాయుడువలసలో 200 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ



**రామభద్రపురం (మేజర్ న్యూస్) :** నాయుడువలస గ్రామంలో 200 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ నడిమింటి లక్ష్మీ సత్యం నాయుడులు దంపతుల ఆధ్వర్యంలో వారి ఆర్థికసహకారం తో 2.5 లక్షల రూపాయల విలువైన 200 చీరలను జిల్లా రోటరీ అధ్యక్షులు, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె సి రాజు ముఖ్య అధితిగా పాల్గొని చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జె సి రాజు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పేద, బడుగు, బలహీన వర్గ మహిళలకు 2.5 లక్షల వ్యయంతో సంక్రాంతి సందర్భంగా నూతన దుస్తులు అందించటం వారి ఉదారతను తెలియచేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం..

**- పీపీపీ విధానం విడనాడే వరకు ఉద్యమిద్దాం - పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్సిపి నిరసన**



**నరసన్నపేట, జనవరి 14, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేయాలని వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి నేతలంతా భోగి మంటలలో కూటమి పిపిపి విధానాన్ని వ్యతిరేకిస్తూ కాగితాలను వేశారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ వేళ భోగి మంటల్లో ప్రభుత్వ ప్రైవేటీకరణ ఉత్తర్వుల కాపీలను దగ్ధం చేసి నిరసన తెలిపినట్లు చెప్పారు.ఎన్నికల ముందు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కృష్ణదాస్ విమర్శించారు. నిరుద్యోగ భృతి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి పథకాల ఊసే లేదని దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను అటకెక్కించి, నిత్యావసరాల ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో అవినీతి, అక్రమ మద్యం అమ్మకాలు పెరిగిపోయాయని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలోకి నాయకులు ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని నాయకులు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్, ఇచ్చాపురం సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర జజుజ మెంబెర్ పిరియ సాయిరాజు పాల్గొన్నారు. వారితో పాటు యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య, ధర్మాన రామమనోహర్ నాయుడు జిల్లాలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# అచ్చతెలుగు ఆహార్యం.. హస్తినలో రామ్మోహనం..



**శ్రీకాకుళం, జనవరి 14, మేజర్‌న్యూస్:** డిల్లీ లోని కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో జరిగిన పొంగల్ సంబరాల్లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ గా మారారు. తెలుగుదనం ఉట్టిపడేలా పంచెకట్టులో దర్శనం ఇచ్చిన రామ్మోహన్ నాయుడు ను చూసి ప్రధాని మోదీ తో సహా అందరూ చాలా బాగుంది అంటూ మెచ్చుకున్నారు. దక్షిణాది రాష్ట్రాల సంస్కృతిని ప్రతిబింబించేలా డిల్లీలోని కేంద్ర మంత్రి మురుగన్ నివాసంలో బుధవారం నాడు పండగ వేడుకలు జరిగాయి. తెలుగు, తమిళ సంప్రదాయాలను మిళితం చేస్తూ.. ఆనాటి ఆచార వ్యవహారాలను గుర్తు చేస్తూ ఆద్యంతం ఆసక్తికరంగా కార్యక్రమం సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాని మోదీ హాజరవ్వగా.. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు.. తన సహచర మంత్రులు, ఎంపీలతో కలసి వేడుకల్లో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా దక్షిణాది పండుగ సంక్రాంతి వేడుకల్లో భాగస్వామ్యం అయినందుకు ప్రధాని మోదీని రామ్మోహన్ నాయుడు సత్కరించారు. అయితే ఎప్పుడూ కోట్ జాకెట్ డ్రెస్సింగ్ విధానాన్ని అవలంభించే రామ్మోహన్ నాయుడు.. అందుకు భిన్నంగా తెలుగుదనం ఉట్టిపడేలా పంచెకట్టు, ధోవతి వేసుకుని ఈ యువ కేంద్ర మంత్రి దర్శనం ఇచ్చారు. వినూత్నంగా కనిపిస్తున్న రామ్మోహన్ నాయుడును మోదీతో సహా అక్కడున్న వారు చాలా బాగుంది అంటూ మెచ్చుకున్నారు.

# ఎన్నికల హామీలు అమలు చేయని మేనిఫెస్టో ఎందుకు...

**- మేనిఫెస్టోను భోగిమంటల్లో దగ్ధం చేసిన ఏఐవైఎఫ్ నాయకత్వం...**



**నరసన్నపేట, జనవరి 14, మేజర్‌న్యూస్:** కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో విడుదల చేసిన మేనిఫెస్టోలో ఉన్న నిరుద్యోగ యువత సమస్య పరిష్కారాలు, నిరుద్యోగ భృతిని అమలు చేయకపోవడం సిగ్గుచేటని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాస్ లు అన్నారు. నరసన్నపేట నియోజకవర్గం కేంద్రంలో మేనిఫెస్టో ప్రతులను దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలులో భాగంగా యువతకు 20 లక్షల ఉపాధి అవకాశాలు కల్పిస్తామని లేదా నిరుద్యోగ భృతి నెలకు 3000 రూపాయలు ఇస్తామని చెప్పి ఇంతవరకు అమలు చేయలేదని అన్నారు. ప్రతి సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగ యువతను ఆదుకుంటామని చెప్పిన కూటమి ప్రభుత్వ నాయకులు ఇంతవరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేసే పరిస్థితి లేదని అన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలలో 2,35,000 పోస్టులను భర్తీ చేసి రాష్ట్రంలో నిరుద్యోగమే లేకుండా చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ మాటను మర్చిపోయి నిరుద్యోగ ఆంధ్ర గా మార్చారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులపై శ్వేతపత్రం విడుదల చేసి, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పించి, ప్రతి జనవరి నెలలో విడుదల చేస్తామన్న జాబ్ క్యాలెండర్ ను రిలీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వ రంగంలోనే నడిపిస్తామన్న మంత్రి నారా లోకేష్ గారు ఈరోజు అధికారం చేపట్టిన తర్వాత పి పి పి విధానమును తీసుకువచ్చి 10 మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడానికి కూటమి ప్రభుత్వం పూనుకుంటుందని, తక్షణమే మెడికల్ కళాశాలలో ప్రైవేటీకరణ ఆపి ప్రభుత్వ రంగంలోనే నడపాలని డిమాండ్ చేశారు. అందరికీ విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు బి. అమోస్, బి. విజయ్, జి. వసంత్ రావు, ఏ. రమణ, ఆర్. తేజ పాల్గొన్నారు.




## పారసెల్లి లో ఘనంగా సంక్రాంతి సంబరాలు..

**- గ్రామ అభివృద్ధిలో కిషోర్, కిరణ్ పాత్ర అభినందనీయం - ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**





**నరసన్నపేట, జనవరి 14, మేజర్‌న్యూస్:** నరసన్నపేట మండలం పారసెల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో నిర్మించిన బస్టాండ్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కిషోర్ చంద్ర పట్నాయక్ మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ధ్యేయంగా తన వంతు ప్రయత్నాన్ని ముందుకు తీసుకెళుతున్నానని, ఎక్కడ ఉన్నా తన గ్రామ అభివృద్ధికి తన వంతు ప్రయత్నం నిరంతరము కొనసాగుతుందని, అందరూ అభివృద్ధి చెందాలని తమ ధ్యేయమని అందుకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ కిరణ్ చంద్ పట్నాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే తమ గ్రామ అభివృద్ధికి అందిస్తున్న సేవలను ప్రశ్నిస్తూ, కాలనీకి రహదారి సౌకర్యం కల్పించాలని, పార్క్ అభివృద్ధికి సహకరించాలని, ఇల్లు లేని నిరుపేదలకు గృహాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం యువత అభ్యున్నతికి, అభివృద్ధికి, విద్య ఆరోగ్యం అందించేందుకు, మహిళా రక్షణకు తమ వంతు కృషి చేస్తుందని, ఉపాధి ఉద్యోగ అవకాశాలకు ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి ఎంతో కృషి చేస్తున్నారని, యువతకు ఉద్యోగ కల్పనకు అనేక కంపెనీలతో ఒప్పందాలు, పారిశ్రామిక అభివృద్ధికి ముందుకు సాగుతున్నారని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి ద్యేయంగా గ్రామ సర్పంచ్ డబ్బీరు కిరణ్ చంద్ర పట్నాయక్ , కిషోర్ చంద్ పట్నాయక్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, రాష్ట్ర ప్రభుత్వం ఆదాయాన్ని దోచుకునేందుకు వివిధ మార్గాలను ఎంచుకున్న ఆనాటి వైసీపీ ప్రభుత్వ ముఖ్యమంత్రి మంత్రులు ప్రజల ఆస్తులను కూడా తమ ఆస్తులుగా భావించారని, గంజాయితో రాష్ట్రాన్ని నింపారని, రక్షణ లేని రాక్షస పాలన ఆనాడు కొనసాగిందని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేటప్పటికి కనీసం జీతభత్యాలు కూడా చెల్లించుకోలేని స్థితికి ఆర్థిక పరిస్థితి ఉండేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసుకుంటూ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకుంటూ రాష్ట్ర అభివృద్ధి కొరకు సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఆర్థిక కష్టాలను ఎదురొడ్డి, సూపర్ సిక్స్ అమలు చేశామన్నారు. పారసెల్లి గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి మహిళా పక్షపాతి అని మహిళా అభివృద్ధికి చంద్రబాబు కృషిని వివరించారు. గ్రామానికి చెందిన బైరి శ్రీనివాసరావు వైసీపీని వీడి టిడిపిలో చేరారు. ఆయనను పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోనంకి కృష్ణం నాయుడు, టిడిపి నాయకులు అడపా చంద్రశేఖర రావు, శిమ్మ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కాలనీలో కనీస వసతులు కరువాయే

**• డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు నరకయాతన • చినుకు పడితే నరకం • గాఢ నిద్రలో అధికారులు**

**పద్మనాభం, జనవరి 14, మేజర్‌న్యూస్:** గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఉన్న ప్రజలందరూ సొంత ఇంటిని కలిగి ఉండాలనే మంచి ఉద్దేశంతో పేదలందరికీ ఇల్లు అనే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల మందికి ఇంటి స్థలాలను కేటాయించి, ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయాన్ని కూడా అందించడం జరిగింది. అయితే సొంత స్థలాన్ని ఇచ్చి, ఇంటి నిర్మాణం చేపట్టిన వాళ్లకు ఆర్థిక సహాయం అయితే చేయగలిగారు కానీ, ప్రభుత్వ కాలనీలో కనీస వసతులు కూడా కల్పించలేకపోయారు. అయితే 2024వ సంవత్సరంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ కాలనీల రూపురేఖలు మారుతాయని ఆశాభావం వ్యక్తం చేసిన ప్రభుత్వ కాలనీ వాసులకు మళ్లీ నిరాసే ఎదురయ్యింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి



వచ్చి చాలా నెలలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వ కాలనీలపై కనీసం దృష్టి సారించడం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వలన, ప్రతి ఇంటిలో వాడకం నీరు ఇళ్ల మధ్యలో నుండే పారుతుంది. దీనివలన మలేరియా, టైఫాయిడ్ వంటి భయంకరమైన విష జ్వరాల బారిన పడుతున్నారు. మరీ ముఖ్యంగా వర్షాకాలం వస్తే ఒక చినుకు పడితే రోడ్లన్నీ బురదమయం అవుతున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ కాలనీలో 60% నిర్మాణాలు పూర్తయినట్లయితే, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి, డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ, అధికారులు ఎవరూ కూడా ఈ ప్రభుత్వ కాలనీలపై దృష్టి పెట్టడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఒకవైపు సిసి రోడ్లు లేక, మరొకవైపు డ్రైనేజీ వ్యవస్థ



మురుకుని రోడ్లపై వాడుతుండడంతో కనీసం వాళ్ళ వాహనాలను కూడా ఇంటి వరకు తీసుకొచ్చే పరిస్థితి లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మండలంలో ఉన్న ప్రభుత్వ కాలనీలలో త్రాగునీరు తో కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తుంది. పద్మనాభం మండలంలో ఉన్న చాలా పంచాయతీలలో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి త్రాగునీరు అందించడం కోసం ప్రభుత్వం ఇంటింటికి కొళాయిలు అమర్చడం జరుగుతుంది. కానీ మండలంలో ఉన్న ప్రభుత్వ కాలనీలలో ఒక్క పంచాయతీలో కూడా ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసే కార్యక్రమం చేపట్టకపోవడం విశేషం. గ్రామాలకు చాలా దూరంలో అప్పటి ప్రభుత్వం కాలనీలను ఏర్పాటు చేయటం వలన, మంచినీళ్ల కోసం చాలామంది ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. గ్రామాలలో ప్రతీ ఇంటికి కొళాయిలను ఏర్పాటు చేస్తున్న సమయంలో, ఆయా గ్రామాల్లో ఉన్నటువంటి ప్రభుత్వ కాలనీలో జలజీవన్ మిషన్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేయాలని స్థానిక కాలనీవాసులు అధికారులను కోరుకుంటున్నారు. గ్రామాలకు దూరంగా ఉన్న ప్రభుత్వ కాలనీలలోనే కాకుండా, గ్రామాలకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ కాలనీలో చెత్త కూడా ఎక్కడికెక్కడ పేరుకుపోయిందని, రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తడి చెత్త పొడి చెత్త ను ఇంటింటికి వెళ్లి సేకరించే కార్యక్రమాన్ని, మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ కాలనీలలో కూడా చేపట్టాలని స్థానిక ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు. ప్రభుత్వ కాలనీలలో ఇంత అద్వానమైన పరిస్థితి నెలకొన్నప్పటికీ గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు సంబంధిత అధికారులు ఎవరూ కూడా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా ఈ ప్రభుత్వ కాలనీలను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏర్పాటు చేయడం వలన, ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం ఈ ప్రభుత్వ కాలనీల మౌలిక వసతులపై దృష్టి సారించడం లేదని విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఏది ఏమైనాప్పటికీ రాజకీయాలతో సంబంధం లేకుండా సంబంధిత అధికారులు దృష్టి, ప్రభుత్వ కాలనీలో ఉన్నటువంటి సమస్యలపై దృష్టి పెట్టాలని పద్మనాభం మండల ప్రజలు కోరుకుంటున్నారు.

# వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో కాకుండా రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలి

**– సిపిఐ డిమాండ్**

**• భోగి మంటల్లో జీవో కాపీలు దగ్ధం చేసి నిరసన.. • తక్షణమే ఆ జీవోలు రద్దు చెయ్యాలని డిమాండ్.**

**మధురవాడ, జనవరి 14, మేజర్‌న్యూస్:** రాష్ట్రంలోని నూతన వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పూరితమైన జీవోలు 590, 847 తీసుకొచ్చిందని, పీపీపీ విధానం ద్వారా ప్రజల ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చెయ్యడం సరియైనది కాదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు విమర్శించారు. బుధవారం తెల్లవారుజామున సిపిఐ ఆధ్వర్యంలో జీవీఎంసీ 5 వ వార్డు, మధురవాడ, నగరంపాలెంలో భోగి మంటల్లో ఈ రెండు జిఓ ప్రతులను లను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూనూతన వైద్య కళాశాలలు ఏర్పాటు కోసం భూములు, భవనాల నిర్మాణం, వనరులు, మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వమే కల్పించిదని, ఇప్పుడు ప్రైవేట్ వ్యకులకు కట్టబెట్టి ప్రభుత్వమే రెండేళ్లపాటు సిబ్బందికి వేతనాలు కూడా చెల్లించేందుకు సిద్ధమైందని, వైద్య విద్యా విధానంలో పీపీపీ వలన పేద, సామాన్య, మధ్యతరగతి విద్యార్థులకు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుందని, ప్రజల ఆరోగ్య సంరక్షణ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయే ప్రమాదం దాపురించిందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటైన వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటుకు అప్పగించడంతోపాటు రెండేళ్ల పాటు సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు




ప్రభుత్వం సిద్ధమవడం ప్రజానిధులను దుర్వినియోగపరచడమేనని తెలిపారు. ఖర్చు ప్రభుత్వానిది...లాభం ప్రైవేటు వ్యక్తులది అన్నట్లుగా విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకునేందుకు ప్రైవేటుకు అవకాశం కల్పించడం విచారకరమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అన్ని ప్రైవేట్ పరం చేస్తున్నదన్న చంద్రబాబు నాయుడు గారు తీరా అధికారం లోకి వచ్చిన తరువాత ప్రైవేట్ కి అప్పజెప్పడం న్యాయంకాదని ఇటువంటి చర్యలు మానుకొని తక్షణమే ఈ జిఓలు రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వమే వీటిని నడిపించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య కార్యదర్శి ఎం డి బేగం, సిపిఐ ఏరియా పార్టీ కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, ఎం సంధ్యా కుమారి, వి మంగ, బి సంధ్యా, రాము పలువురు మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా భోగి సంబరాలు

**ఆనందపురం, జనవరి 14, మేజర్‌న్యూస్:** ఆనందపురం మండలం తర్లవాడ పంచాయతీలో ఘనంగా భోగి సంబరాలు జరిగాయి స్థానిక సర్పంచ్ బి ఆర్ బి నాయుడు ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా తర్లవాడ గ్రామ ప్రజలు అందరూ కలిసి ఒకే చోటా భోగి మంటను ఏర్పాటు చేశారు సాంప్రదాయ బద్ధంగా గంగిరెడ్లు , కొమ్మదాసరిలు,హరిదాసు,దాసరిలు





ఇలా అందరితో ఊరంతా సంప్రదాయం నెలకొంది పంచాయతీ లో అందరితో కలిపి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటుచేసి మరియు,ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వరకు బహుమతులు ప్రధానం చేశారు ,బుర్రకథ ప్రోగ్రాలు నిర్వహిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో మండలటిడిపి పార్టీ ప్రెసిడెంట్ తాట్రాజ్ అప్పారావు వైసిపి వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు బంకు రాజు. ఆదినారాయణ స్థానిక సర్పంచ్ బి ఆర్ బి నాయుడు గ్రామస్తులు

# పేకాట ఆడుతున్న ఏడుగురు అరెస్ట్

**ఆనందపురం, జనవరి 14, మేజర్‌న్యూస్:** ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో శొంఠ్యాం పంచాయతీ నీళ్ల కుండీల పరిసర ప్రాంతాలలో బహిరంగంగా పేకాట ఆడుతున్నారన్న అందిన సమాచారంతో ఎస్సై ఎం హరీష్ తన సిబ్బందితో కలిసి నిళ్ల కుండీలు దగ్గరలో పాత వైన్ షాప్ దగ్గర వెళ్లి చూడగా అక్కడ పేకాట ఆడుతున్న కొందరు వ్యక్తులను



గమనించి వారి వద్ద నుండి 52 ప్యాక్ ముక్కలను 10,650 నగదును స్వాధీనం చేసుకొని వారిపై సీఏ సిహెచ్ వాసు నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# గాలి పటం దారం తాకటంతో విశ్రాంత సైనికో ఉద్యోగికి గాయాలు

**మధురవాడ, జనవరి 14, మేజర్‌న్యూస్:** మధురవాడ బ్రిడ్జ్ వద్ద గాలి పటం దారం తాకటంతో ఒక వ్యక్తికి గాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంలో సిహెచ్ వెంకట్రావు (విశ్రాంత సైనికో ఉద్యోగి) వయసు 54 మంగళవారం కొమ్మాది నుండి ఎంవిపి కాలనీ కి ద్విచక్ర వాహనం పై జాతీయ రహదారి పై వెళుతుండగా ఫ్లై ఓవర్ దగ్గరకు వచ్చేసరికి గాలిపటం దారం మూతికి తగిలినందున ఎడమ పెదవి మీద కుడి పెదవి చివర దారపు కోత అయినందున మిథిలాపురి ఉడా కాలనీలో గల వేదాంత ఆసుపత్రి కి వెళ్లి చికిత్స చేయించుకున్నారు. సంక్రాంతి సందర్భంగా గాలిపతాలు ఎగుర వేసేవారు రహదారుల పైకి వెళ్లకుండా చూసుకోకుండా ఉండటంతో ప్రతీ



యేటా ఏదోకప్రాంతంలో ఇటువంటి ఘటనలు జరుగుతున్న ప్రజల్లో మార్పు రావటం లేదని అన్నారు. వాహనం పై వెళ్తుండగా దారం తాకటంతో చిన్న గాయాలు అయ్యాయి వాహనం అదుపు తప్పి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేదని అన్నారు. మంజా దారాలు ఉపయోగాన్ని విశాఖ నగర సీపీ శంకబ్రత భాగ్చి నిషేధం విధించిన పూర్తిగా మధురవాడ ప్రాంతంలో అమలు కాలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రజలు గాలిపతాలు రహదారులపై ఎగురవేయకుండా ఉండాలని కోరుతున్నారు.




## నర్సీపట్నంలో ఘనంగా భోగి వేడుకలు

**- తెలుగు సంస్కృతిని కాపాడుకోవాలి - స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు**




**నర్సీపట్నం, జనవరి 14, మేజర్‌న్యూస్:** నర్సీపట్నం: నర్సీపట్నం ఎన్టీఆర్ స్టేడియంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో భోగి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. స్పీకర్ దంపతులు సంప్రదాయబద్ధంగా భోగి మంటలు వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మావతి గారు స్వయంగా పొంగలి వండగా, స్పీకర్ అయ్యన్నపాత్రుడు పిల్లలకు గాలిపటాలను అందించి వారితో కలిసి సందడి చేశారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన గంగిరెద్దుల ఆటలు, సోదమ్మ, కొయ్యదొర విన్యాసాలు మరియు వేంకటేశ్వర స్వామి వేషధారణలు, కొళాటం సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తెలుగు ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు పండుగలు మన సాంప్రదాయానికి ప్రతీకలని, మన సంస్కృతి మనతోనే ఆగిపోకుండా భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా పిల్లలకు మన పండుగల విశిష్టతను వివరించాలని కోరారు. భాషా పరిరక్షణ గురించి మాట్లాడుతూ, పిల్లలు పాఠశాలల్లో ఇంగ్లీష్ నేర్చుకున్నప్పటికీ, ఇంట్లో తల్లిదండ్రులు మరియు పెద్దలతో కచ్చితంగా తెలుగులోనే మాట్లాడాలని హితవు పలికారు. మాతృభాషలో మాట్లాడితేనే అనుబంధాలు బలపడతాయని, అది మన పిల్లలకు నేర్పించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని 14 వేల పంచాయతీల్లో ప్రతి గ్రామంలోనూ సంక్రాంతి సంబరాలను ప్రజలందరూ కుటుంబ సమేతంగా ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ సతీమణి డాక్టర్ సువర్ణ, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ సతీమణి దివ్యశ్రీ వాకర్స్ క్లబ్ సభ్యులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో పురప్రజలు, పిల్లలు పాల్గొన్నారు.

## బిచ్చగాళ్లకు రగ్గులు పంపిణీ



**రావికమతం, జనవరి 14, మేజర్‌న్యూస్:** మండలానికి చెందిన హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ బుధవారం బిచ్చగాళ్ళకు రగ్గులు పంపిణీ చేసింది. గత కొంతకాలంగా ఈ సంస్థ ప్రతి నెల ఒక సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా జనవరి నెలలకు సంబంధించి చలి తో గజగజలాడుతున్న రోడ్డు పక్కన ఉన్న బిచ్చగాళ్లకు రగులు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు కొత్తకోట నుంచి నర్సీపట్నం వరకు రహదారికి ఇరువైపులా ఉన్న బిచ్చగాళ్లకు రగ్గులు పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో ఫౌండర్ విరోతి ఆనంద్ అధ్యక్షులు జి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సారిపల్లిపాలెంలో ఘనంగా భోగి వేడుకలు

**- కుటుంబ సభ్యులతో కలిసి భోగి వేడుకలో పాల్గొన్న హెూం మంత్రి అనిత**



**నక్కపల్లి, జనవరి 14, మేజర్‌న్యూస్:** నక్కపల్లి మండలంలోని సారిపల్లిపాలెంలో ఉన్న హెూం మంత్రి అనిత నివాసం వద్ద భోగి పండుగను కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నిర్వహించారు. భోగి పర్వదినం సందర్భంగా మంత్రి నివాసం పండుగ వాతావరణంతో కళకళలాడింది. సాంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించిన భోగి వేడుకల్లో కేరళ డ్రమ్స్ బృందంతో డప్పు వాయించి హెూం మంత్రి అనిత ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. హరిదాసు కీర్తనలు, డుడు బసవన్నల ప్రదర్శనలతో మంత్రి నివాసం సందడిగా మారింది. ప్రత్యేక ఆకర్షణగా కేరళ కళాకారుల నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. స్థానిక నాయకులు సరదాగా స్టెప్పులు వేయడంతో వేడుకల ఉత్సాహం మరింత పెరిగింది. పేట నియోజకవర్గ నాయకులతో కలిసి మంత్రి అనిత సంతోషంగా సంక్రాంతి పండుగను జరుపుకున్నారు. ముగ్గుల పోటీలు నిర్వహించిన నేపథ్యంలో ముగ్గుల పరిశీలన సందర్భంగా కుమార్తెతో కలిసి మంత్రి అనిత ముగ్గు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. సంప్రదాయంగా ఎడ్ల బండిని తోలి గ్రామీణ సంస్కృతిని గుర్తు చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరికీ భోగి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. భోగి పండుగ వ్యవసాయ సంస్కృతికి ప్రతీకగా, రైతు జీవితంతో విడదీయరాని పండుగ అని పేర్కొన్నారు. పాత కష్టాలను వదిలి, కొత్త ఆశలు, ఆకాంక్షలతో ముందుకు సాగాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ భోగి పండుగ రాష్ట్ర ప్రజలకు మంచి ఫలితాలు తీసుకురావాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సమృద్ధి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తూ పాలన సాగిస్తున్నారని మంత్రి అనిత తెలిపారు.



## గ్రామాలలో దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తా

**- ఎమ్మెల్యే బండారు, డైరీ చైర్మన్ ఆనంద్ కుమార్ - పెదనందిపల్లి సత్యనారాయణమూర్తి కొండపై మండపం నిర్మాణానికి శంకుస్థాపన**

**దేవరాపల్లి, జనవరి 14, మేజర్‌న్యూస్:** గ్రామీణ ప్రాంతాలలో దేవాలయాలను అభివృద్ధి పరిచేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. మండలంలోని పెదనందిపల్లి గ్రామ సమీపంలోని సత్యనారాయణమూర్తి ఆలయం వద్ద 6 లక్షలు ఆడారి సొంత నిధులతో మండపం నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే బండారు మాట్లాడారు. నూతన మండపం నిర్మాణంతో పాటు మరో మండపం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. పెదనందిపల్లి గ్రామంతో పాటు సత్యనారాయణమూర్తి ఆలయ సమీపంలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి మరో 17 లక్షలతో పనులు చేపట్టనున్నామన్నారు. డైరీ చైర్మన్ ఆనంద్ మాట్లాడుతూ పురాతన ఆలయాల పునర్నిర్మాణానికి గ్రామ పెద్దలు, యువత ముందుకు రావాలన్నారు. దీనికి నా వంతు సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. ఆలయానికి వెళ్లే దారిలో మట్టి రోడ్డు నిర్మాణం ఆలయ ధర్మకర్త ఓ.సత్యనారాయణ, గ్రామ నాయకులు, మాజీ సర్పంచ్ కొరుపోలు రామలింగస్వామి యువసేన సొంత నిధులతో చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే ను, డైరీ చైర్మన్ ను, ముఖ్య నాయకులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అంతకుముందు సత్యనారాయణ మూర్తి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కిలపర్తి భాస్కరరావు, రావాడ సింహాద్రి నాయుడు, రైవాడ రిజర్వాయర్ చైర్మన్ పోతల పాత్రునాయుడు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు పెద్దాడ వెంకటరమణ, బిజెపి మండల పార్టీ అధ్యక్షురాలు ఆవుగడ్డ సత్యవేణి (నాయుడమ్మ), మండల పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి శరఖాన సూర్యనారాయణ, డైరీ డైరెక్టర్ గంగాధర్, ఆవు గడ్డ కోటిపల్లి నాయుడు, పూడి సత్యరావు, మతల రాజు నాయుడు, అల్లు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





## తీడ, వై.తుని గ్రామాలలో కోడి పందేలపై పోలీసులు దాడి

**- ఇదుగురు నిందుతులు, నాలుగు కోళ్లు స్వాధీనం**

**కశింకోట(అనకాపల్లి), జనవరి 14, మేజర్‌న్యూస్:** స్థానిక కశింకోట పోలీస్ స్టేషన్ పరిధిలోని తీడ, వై.తుని గ్రామాల శివారు ప్రాంతాలలో అక్రమ కోడి పందేలపై కశింకోట పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. తీడ గ్రామం శివారులో నిర్వహించిన దాడిలో ముగ్గురు నిందితులు పట్టుబడగా, వారి వద్ద నుండి 2 కోళ్లు, రూ.750/- నగదు స్వాధీనం చేసుకున్నారు. అలాగే వై.తుని గ్రామం శివారులో నిర్వహించిన దాడిలో ఇద్దరు నిందితులు పట్టుబడగా, వారి వద్ద నుండి 2 కోళ్లు, రూ.650/- నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులు సీఐ ఏ. స్వామి నాయుడు మార్గదర్శకత్వంలో, ఎస్సై మనోజ్ కుమార్, సిబ్బంది చేత విజయవంతంగా నిర్వహించబడ్డాయని, కశింకోట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.






## ఘనంగా భోగి పండుగ



**గరుగుబిల్లి, జనవరి14, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో భోగి పండుగను బుధ వారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగలో భాగంగా భోగి పండుగను ఘనంగా నిర్వహించారు.వేకువ జాము నుంచి ఆయా గ్రామాల్లో భోగిమంటలను వేశారు. భోగిమంట ల్లో ముందుగా ఆవు పేడతో తయారుచేసిన భోగిపిడకలను పిల్లలచే వేయించారు.మండల పరిధిలోని గరుగుబిల్లి, రావివలస, నాగూరు, తోటపల్లి, ఉల్లిభద్ర, పెదగుడబ, కొత్తపల్లి, ఉద్దవోలు, వల్లరిగుడబ, శివ్వాము, మరు పెంట, తదితర గ్రామాల్లో భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

# డ్రగ్స్ వద్దు-ఆటలే ముద్దు




**పాలకొండ, మేజర్ న్యూస్ :** డ్రగ్స్ రహిత పాలకొండకై నడుం బిగిద్దాం అని పాలకొండ డీఎస్పీ రాంబాబు అన్నారు. ఆయన మాట్లాడుతూ, గంజాయి రవాణా మరియు వాడకంపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారని హెచ్చరించారు. కేవలం చట్టాలు, అరెస్టుల వల్ల మాత్రమే మార్పు రాదని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను గమనిస్తూ ఉండాలని కోరారు. యువత చెడు సావాసాలకు దూరంగా ఉండి, చదువు మరియు క్రీడలపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఆరోగ్యమే మహాభాగ్యం – యోగా గురువుల సందేశం.. యోగా గురువు జనార్దన్ మాస్టర్, గారాల సూర్యం మాస్టర్, బొడ్డు రామ్మోహన్ మాట్లాడుతూ, శారీరక, మానసిక దృఢత్వానికి యోగా మరియు క్రమశిక్షణ ఎంతో అవసరమని పేర్కొన్నారు. మత్తు పదార్థాలు మెదడును నిర్వీర్యం చేస్తాయని, యువత యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా ఒత్తిడిని జయించి, వ్యసనాలకు దూరంగా ఉండవచ్చని సూచించారు. అనంతరం పాలకొండ ప్రధాన కూడళ్ల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు.గంజాయి వద్దు-జీవితం ముద్దు", "మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం -సమాజాన్ని రక్షిద్దాం" అంటూ యువత చేసిన నినాదాలతో పాలకొండ వీధులు హోరెత్తాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పల్లా కొండబాబు, మరియు గంటా సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. పాలకొండను గంజాయి రహిత పట్టణంగా మార్చడానికి ప్రతి పౌరుడు సహకరించాలని, ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ చైతన్య కార్యక్రమం స్థానిక ప్రజ స్ఫూర్తిని నింపింది.

# క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయం

**– అరుకు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్తిబాబు – కార్యక్రమంలో మాట్లాడిన ఎంపిటిసి సభ్యులు సత్తిబాబు**

**– క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయి**





**గరుగుబిల్లి, జనవరి 14, మేజర్ న్యూస్ :** గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ టోర్న మెంట్ పోటీలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అరుకు పార్ల మెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మరియు నాగూరు ఎంపీ టీసీ సభ్యులు ద్వారపురెడ్డి సత్యనా రాయణ(సత్తిబాబు) అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని చిలకాం గ్రామంలో మంగళవారం క్రికెట్ పోటీలను అరకు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్య నారాయణ (సత్తిబాబు) ప్రారంభించారు.ఈ సందర్భంగా జరిగిన సమా వేశంలో అరకు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి మరియు నాగూరు ఎంపిటిసి సభ్యులు ద్వారపురెడ్డి సత్యనారాయణ (సత్తిబాబు) మాట్లాడుతూ యువత జీవనశైలిలో క్రీడలు భాగము కావాలని కోరారు. అదే విధంగా క్రీడలు మానసిక ఉల్లా సానికి ఎంతగానో దోహదపడతాయ ని పేర్కొన్నారు.ప్రస్తుతం నిర్వహిస్తు న్న క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకా రులు గెలుపు ఓటములను సమా నంగా తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యులు సత్తిబాబు కోరారు.

క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని మంచి నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని తెలి పారు.గ్రామీణ స్థాయిలో నిర్వహించి న క్రికెట్ పోటీలు యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఎంతగానో దోహదపడతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ ద్వారపురెడ్డి గంగమ్మ,మాజీ ఎంపీపీ ద్వారపురెడ్డి గౌరీ, ద్వారపురెడ్డి రాజశేఖర్, ద్వారపురెడ్డి రాజేష్, ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ తెర్లి హేమాక్షీ తదితరులు పాల్గొన్నారు.

## సంక్రాంతి సందర్భంగా కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు : ఎస్ఐ హేమలత వెల్లడి

**సీతానగరం జనవరి 14 (మేజర్ న్యూస్) :** సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామాల్లో కోడిపందాలు,జూదము నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ హేమలత వెల్లడించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో స్థానిక విలేకరులతో మాట్లాడారు. కోడి పందాలు నిర్వహణ, జూదం చట్టరీత్యా నేరమని ఈ మేరకు నిబంధనలు ఉల్లంఘిం చిన వారిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఎక్కడైనా కోడిపందాలు



జూదం నిర్వహిస్తు న్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని వెల్లడించారు. కోడిపందాలు నిర్వహించడం, ప్రోత్సహించడం, లేదా పాల్గొనడం చట్ట విరుద్ధమని దీనిపై ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ జంతు హింస నివారణ చట్టం కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. సంక్రాంతి పండుగను సాంప్రదాయ పద్ధతులతో ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

## పండుగ సంప్రదాయాల్లో ఆరోగ్య ప్రయోజనాలు

**– బూర్జ భోగి వేడుకలో పాల్గొన్న డాక్టర్ జగన్ మోహన్**



**సీతానగరం, జనవరి14 మేజర్ న్యూస్ :** పూర్వీకుల కాలం నుండి ఆనవాయితీగా వస్తున్న పండుగ సంప్రదాయాల్లో ఆరోగ్య ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయని జిల్లా ఎన్.సి.డి అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బూర్జ గ్రామంలో బుధవారం నిర్వహించిన భోగి వేడుకలో గ్రామస్తులతో కలిసి పాల్గొన్నారు. చిన్నారులు భోగి పిడకలను మంటలో వేసి భక్తి శ్రద్ధలను చూపారు.చిన్నా, పెద్ద,యువత అంతా ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకుంటూ సందడి చేశారు. పంటలు బాగా పండి ఇండ్లకు వచ్చే సమయమని,నూతనత్వానికి స్వాగతం పలికుతూ ఆత్మ విశ్వాసాన్ని కలిగిస్తుందన్నారు. భోగి మంటలు అంటే కేవలం నిప్పే పెట్టడం కాదని, ఇది గతాన్ని వదిలి భవిష్యత్తును సాను కూలంగా ఆహ్వానించడానికి ప్రతీక అని, పండుగలు మానసిక, సామాజిక, శారీరక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయని,ఒత్తిడి ఆందోళన నుండి విరామం లభించి, ప్రశాంతతను,సానుకూల దృక్పథన్ని అందిస్తాయన్నారు. సంస్కృతి సంప్రదాయాలను ప్రోత్సహించి సామాజిక బంధాలను బలోపేతం చేసి మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. అలాగే సంప్రదాయ వంటకాలు ఆరోగ్యకరమని తెలిపారు. మన పండుగ ఆచారాలను భావి తరాలకు అందివ్వడంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

## ఎం.రాజపురంలో నిమ్మక గోపాలరావు స్మారక ఆర్చ్ ప్రారంభం



**పాలకొండ, మేజర్ న్యూస్ :** పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్వగ్రామమైన ఎం.రాజపురం గ్రామంలో అభివృద్ధిలో భాగంగా గ్రామం వద్ద నూతనంగా నిర్మించిన ఆర్చ్ బుధవారం ప్రారంభించారు. తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే నిమ్మక గోపాలరావు జ్ఞాపకార్థం ఆయన పేరు మీద ఈ ఆర్చ్ ఏర్పాటు చేశారు. గోపాలరావు కుమారులు, మాజీ తోటపల్లి చైర్మన్ నిమ్మక పాండురంగా మరియు నిమ్మక జయకృష్ణ తమ సొంత నిధులతో ఈ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు గర్భనా సత్తిబాబు, టీడీపీ సీనియర్ నాయకులు కర్నెన అప్పల నాయుడు, పొదిలాపు కృష్ణ మూర్తినాయుడు, టీడీపీ వీరఘట్టం మండల నాయకులు ఉదయాన ఉదయ్ భాస్కర్, జాడ శ్రీధర్, జామి లక్ష్మి నారాయణ, బల్ల హరి పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి జనసేన జానీ, వీరఘట్టం మండల సీనియర్ జనసేన నాయకులు మత్స పుండరికం, రౌతు గోవిందా, సరిపల్లి అచ్యుత్ మరియు పాలకొండ నియోజకవర్గంలోని వివిధ హోదాల్లో ఉన్న కూటమి నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు మరియు గ్రామ ప్రజలు హాజరయ్యారు.

# చిన్న బత్తివలసలో క్రీడోత్సవాలు

## నూతన పంచాయితీ కావడం వల్లనే ఈ క్రీడా సంబరాలు అంటున్న యువకులు




**పూసపాటిరేగ, జనవరి 14, మేజర్ న్యూస్ :** మండలంలోని కుమిలి పంచాయితీ నుంచి విడిపోయి నూతన పంచాయతీగా ఏర్పడిన చిన్న బత్తి వలస పంచాయతీలో క్రీడా పోటీలు అంగరంగ వైభవంగా భోగి పర్వదినాన ప్రారంభమయ్యాయి. మండలానికి మారుమూల పంచాయితీగా వెనుకబడిన ఈ ప్రాంతంలో యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు పంచాయతీకి చెందిన యువకుడు కొర్నాన రామ నాయుడు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ముందుకొచ్చారు. అందులో భాగంగా క్రికెట్ పోటీలను రామనాయుడు ప్రారంభించి పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ పోటీలు చినబట బత్తివలస తో పాటు పెద్ద బత్తివలస కూడా పోటీల్లో పాల్గొన్నాయి. మొత్తం ఐదు టీములు పాల్గొన్న ఈ క్రీడల్లో రామ నాయుడు టాస్ వేసి పోటీలను లాంచిన గా ప్రారంభించారు. పోటీలో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.5 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.3 వేలు అందించనున్నట్లు క్రీడల ఆర్థిక ప్రోత్సాహకుడు రామ నాయుడు స్పష్టం చేశారు. అదే విధంగా గ్రామంలో రంగవల్లులు పోటీలను కూడా నిర్వహించి మహిళలకు ఆర్థిక ప్రోత్సాహకాలను అందించనున్నట్లు రామ నాయుడు తెలిపారు.

# భోగి మంటల్లో మెడికల్ కాలేజీల పీపీపీ జీవో ప్రతులు..

## – కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు భోగి మంటల్లో కాలిపోవాలి

## – జెడ్పీ ఛైర్‌పర్సన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్ రావు



**విజయనగరం టౌన్, జనవరి 14, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలపై పీపీపీ విధాన జీవో ప్రతులను జెడ్పీ ఛైర్పర్సన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, భీమిలి నియోజకవర్గ ఇంచార్జ్ మజ్జి శ్రీనివాస్ రావు (చిన్న శ్రీను) భోగి మంటల్లో వేసి తగులబెట్టారు. సంక్రాంతి పండగతో మొదలవుతున్న ఈ సుఖ సంతోషాలు ఈ కొత్త ఏడాదిలో కొనసాగాలంటే, కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలు భోగి మంటల్లో కాలిపోవాలని ఆయన నినదించారు. గురువారం విజయనగరంలోని తమనివాసంలో ప్రజల మధ్యన కుటుంబ సమేతంగా భోగి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం తీసుకు వచ్చిన పీపీపీ విధానాన్ని ఆయన మరోసారి ఖండించారు. ఈ కొత్త ఏడాదిలో ఎటువంటి ప్రకృతి వైఫరిత్యాలు ఏవీ జరగకుండా ఉండేందుకు ఈ సంక్రాంతి పండగను ప్రజలంతా జరుపుకుంటారని అన్నారు. ఐతే ఈ కూటమి ప్రభుత్వంలోని ప్రధాన భాగ స్వామ్య తెలుగుదేశం పార్టీ గడచిన ఏడాది అంతా పేద బడుగు బలహీన వర్గాల ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేసిందని ఆయన దుయ్యబట్టారు. పేద ప్రజలకి ఉచిత వైద్య విద్యను, వైద్యాన్ని అందించాలన్న గొప్ప సంకల్పంతో తమ వైసీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను తీసుకు వచ్చారని గుర్తు చేశారు. ఐతే ఈ కూటమి ప్రభుత్వం పీపీపీ విధానాన్ని తీసుకు వచ్చి ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడాన్ని ఈ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకించారని అన్నారు. ఈ ప్రజా వ్యతిరేక విధానంపై ప్రధాన ప్రతిపక్ష పార్టీగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోటి సంతకాల ఉద్యమం ద్వారా ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లిందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకి ఉచిత వైద్యాన్ని, వైద్య విద్యను దూరం చేయకూడదన్న నినాదంతో ఈ రాష్ట్రంలోని మేధావులు, ఉద్యోగ, విద్యార్థి సంఘాలు, అనేక వర్గాలు వారు ముక్త కంఠంతో ఖండించారని అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఈ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలంతా తప్పుబడుతున్నా, ఈ కూటమి ప్రభుత్వం తమకి అధికారం ఉందన్న బలంతో గుడ్డిగా ముందుకు వెళ్తోందని ధ్వజమెత్తారు. ఏడాది మొత్తంగా ప్రజలు తాము పడ్డ కష్టాలు, బాధలను ఈ భోగి మంటల్లో కాలిపోవాలని ఎలాగైతే కోరుకుంటారో, ఈ భోగి మంటల్లోనే మెడికల్ కాలేజీల పీపీపీ విధానం కాలిపోవాలని, ప్రజలకి మేలు జరగాలని ఈ జీవో ప్రతులను మంటల్లో వేయడం జరిగిందన్నారు.

ఈ పీపీపీ విధానం వద్దని న్యాయస్థానాలు సైతం చెబుతున్నా ఈ కూటమి ప్రభుత్వం పెడచెవిన పెడుతోందన్నారు. మెడికల్ కాలేజీలపై పీపీపీ విధానం రద్దు కావాలి, ప్రజలకి మేలు జరగాలన్న ఉద్దేశ్యంతోనే ఈ జీవో ప్రతులను భోగి మంటల్లో వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు, నెల్లిమర్ల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బడ్డుకొండ ప్రదీప్ నాయుడు, వైసీపీ నాయకురాలు మజ్జి సిరి సహస్ర, జిల్లా పార్టీ కార్యదర్శులు వర్రి నరసింహ మూర్తి, ఇప్పిలి అనంతం, గొర్లె రవికుమార్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మహంతి జనార్ధన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జైహింద్ కుమార్, ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాస్ నాయుడు, యువజన విభాగం అధ్యక్షుడు అల్లు అవినాష్, అధికార ప్రతినిధి కనకల రఘురామ్, పూసపాటి రేగ, చీపురుపల్లి మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పల నాయుడు, వరహాల నాయుడు, తెర్లాం వైఎస్ ఎంపీపీ సత్యనారాయణ, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కోలాహాలంగా కోట్ల దంపతుల సంక్రాంతి సంబరాలు

## నిరుపేద కుటుంబాలకు దోవతుల వితరణ

## కొవ్వాడ మేలుకొలుపు అన్నదాన వితరణకు రూ 30,000 లు ఆర్థిక సాయం

## అనారోగ్యవంతులను పరామర్శించి వారు కూడా ఆర్థిక సహకారం అందించిన కోట్ల



**పూసపాటిరేగ, జనవరి 14 (మేజర్ న్యూస్) :** మండలంలోని కొవ్వాడ పంచాయతీలో సంక్రాంతి సంబరాలు జనసేన నాయకుడు, సర్పంచ్ కోట్ల రఘు ఆర్థిక సహకారంతో కోలాహాలంగా బుధవారం ప్రారంభమయ్యాయి. సర్పంచ్ రఘు భోగిమంటలతో ప్రారంభించిన సంక్రాంతి సంబరాలు పంచాయితీ అంతా సుఖ సంతోషాలతో, ఆనందం వెల్లి మిరియాలన్నా ఉత్సాహంతో నిరుపేద కుటుంబాలకు దోవతలను పంపిణీ చేశారు. ఈ వస్త్రాల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ కోట్ల రఘు సతీమణి రేవతితో కలిసి నిర్వహించారు. ఈ వస్త్రాల పంపిణీ కార్యక్రమానికి కొవ్వాడ పంచాయతీకి చెందిన వారే కాకుండా పొరుగు పంచాయితీలైన పూసపాటిరేగ, చౌడమ్మ అగ్రహారం పంచాయతీలకు చెందిన వారు కూడా విచ్చేసి వస్త్రాలను అందుకున్న వారిలో ఉన్నారు. అదేవిధంగా ప్రత్యేకంగా వస్త్రాల పంపిణీకి విచ్చేసిన దివ్యాంగులు కూడా వస్త్రాలతో పాటు రూ.500 లు చొప్పున ఆర్థిక పారితోషకాలను కోట్ల దంపతులు అందజేశారు. సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకొని పంచాయితీకి చెందిన కొంతమంది శ్రీకృష్ణ మేలుకొలుపు ఉత్సవాలను నిర్వహించారు. మేలుకొలుపులో పాల్గొన్న భజన బృందాలకు కూడా కోట్ల రఘు అన్న సమారాధన కార్యక్రమం నిమిత్తం రూ.30 వేలు అందించి కోట్ల తన దాతృత్వాన్ని చాటుకున్నారు. అంతేకాకుండా పంచాయతీలో ఉన్న అనారోగ్య బాధితులను కూడా రఘు పరామర్శించి



బాధితు కుటుంబాలకు రూ.2 వేలు చొప్పున ఆర్థిక సాయం చేసి ఏ కష్టం వచ్చినా ఆపదలో నేనున్నానంటూ బాధిత కుటుంబాలకు కోట్ల రఘు భరోసా ఇచ్చారు. సంబరాల్లో భాగంగా మహిళలకు రంగవల్లుల పోటీలను నిర్వహించి వారి ప్రావీణ్యతను బట్టి ఆర్థిక పారితోషికాలను ఇవ్వనున్నట్లు రఘు పేర్కొన్నారు.

# భోగి-సంక్రాంతి పర్వదినాన పేదల ముఖాల్లో చిరునవ్వులు

## – ఎరుకల పాకలు, గజరాయుని వలస గ్రామాల్లో చీరలు – దుప్పట్ల పంపిణీ చేసిన పాలవలస గౌరు




**బాడంగి, జనవరి 14 (మేజర్ న్యూస్) :** మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని ఎరుకల పాకల గ్రామంలో భోగి--సంక్రాంతి పండుగల సందర్భంగా పేదలు, వృద్ధులు, వితంతువులకు చీరలు, దుప్పట్ల పంపిణీ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ పాలవలస పార్వతి, వైస్ ఎంపీపీ పాలవలస గౌరు ఆధ్వర్యంలో నిర్వహించారు. 1995 సంవత్సరంలో పాలవలస గౌరు తొలిసారిగా సర్పంచ్‌గా ఎన్నికైన నాటి నుంచే ప్రతి ఏడాది భోగి పండుగను పురస్కరించుకుని పేదలు, వృద్ధులు, వితంతువులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ సంవత్సరం కూడా ఎరుకల పాకల గ్రామంతో పాటు గజరాయుని వలస గ్రామంలోనూ ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామ పెద్దల సహాయ సహకారాలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారుగా రెండు మూడు గ్రామాల నుంచి వచ్చిన వృద్ధులు, వితంతువులకు అవసరమైన చీరలు, దుప్పట్లు అందజేశారు. పండుగ వేళ అందిన ఈ సహాయం పేద కుటుంబాలకు ఎంతో ఊరటనిచ్చిందని గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పండుగల అసలైన అర్థం సేవ, మానవత్వం అని నిరూపించారని గ్రామ ప్రజలు పాలవలస గౌరు, పాలవలస పార్వతిని అభినందించారు.

# వైభవంగా బోగి సంబరాలు వాడవాడలా ప్రత్యేక కార్యక్రమాలు



**లక్క వరపు కోట జనవరి 14 (మేజర్ న్యూస్) :** మండలంలో సంక్రాంతి సంబరాలు ఉన్నాయి ఈ సందర్భంగా మొదటి రోజు నిర్వహించే భోగి పండుగను బుధవారం ప్రజలు వైభవంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే అభ్యంగన స్నానాలు చేసి భోగిమంటలు వెలిగించి ఆ మంటల్లో తమ అరిష్టాలు దరిద్రం కాలి పోయి అశు భాలు అంతరించి శుభం కలగాలని కోరుకున్నారు బలరాం గ్రామంలో సర్పంచ్ తూర్పటి సంతోషమ్మ రామకృష్ణ ఇతర పెద్దలు యువత ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు విద్యార్థులకు మహిళలు యువతకీ వివిధ రకాల పోటీలు నిర్వహించడం జరిగింది గెలుపొందిన వారికీ బహుమతులు సంక్రాతి రోజున అందజేయనున్నారు రెల్లి గౌరమ్మ పేట గ్రామంలో శ్రీరామ భజన మండలి వైవి రమణ ఇతర గ్రామ పెద్దల ఆధ్వర్యంలో రామాలయం లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు సీతారాముల కళ్యాణము కనుల పండుగలా నిర్వహించడంతో పాటు పేదలకు వస్త్రాల పంపిణీ భజన బృందానికి వస్త్రాలు పంపిణీ భారీ అన్న సమరాధన వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది ఎల్ కోట గ్రామంలోసంగం వీధిలో గల రామాలయం లో సీతారాములకు వేద పండితులు అక్కా జోస్యుల శ్రీ హరి శర్మ ఆధ్వర్యంలో గ్రామస్థులు పూజలు నిర్వహించి అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఇలా ప్రతి గ్రామం లో ఎదో ఒక కార్యక్రమం తో పాటు మేలు కొలుపు బృందం సందడి గంగిరెద్దుల వారి పాటలు కోలాటం ఆటలు ప్రతి ఇంటి ముంధు కనువిందు చేసే రక రకాల ముగ్గులు నోరురుంచే రుచి కరమైన పిండి వంటలు గుమ గుమలు ఇలా సంక్రాతి పండుగ మొదటి రోజు ప్రతి చోట ప్రతి ఇంట సందడి చేస్తూ ప్రారంభం అయ్యింది అని చెప్పొచ్చు

# సమాజానికి యువ నాయకత్వం అవసరం

## - ఘనంగా సి.హెచ్.సి. సభ్యుడు బొల్లు త్రినాథ్ జన్మదిన వేడుకలు



**భోగాపురం, జనవరి 15 (మేజర్ న్యూస్) :** నేటి సమాజంలో యువనాయకత్వం ఎంతో అవసరమని, అన్ని కోణాల్లోనూ ఆలోచిస్తూ పదిమందికి స్ఫూర్తిదాయకంగా నిలవాలని జనసేన మండల పార్టీ అధ్యక్షులు వందనాల రమణ అన్నారు. భోగాపురం మేజర్ పంచాయతీలో సుందరపేట సిహెచ్సి సభ్యులైన బొల్లు త్రినాథ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 22 పంచాయతీలకు చెందిన నాయకులు, అభిమానులు ప్రత్యేకంగా త్రినాధను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని కోరుతూ ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా త్రినాథ్ మాట్లాడుతూ మీ అందరి సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల ఆశయాలు, ఎమ్మెల్యే లోకం మాధవి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలను నెరవేర్చడంలో ముందుంటానని, భోగాపురం గ్రామ అభివృద్ధికి నా వంతు సహాయ సహకారాలు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు పడాల శ్రీనివాసరావు, పల్లంట్ల జగదీశ్, మాత నవీన్, గుండపు సూరిబాబు, జక్కపు రవి తదితర నాయకులు పాల్గొన్నారు.

# మౌలిక వసతులు కల్పనకు కట్టుబడి ఉన్నాం "పొట్నూరు"

**గుర్ల,జనవరి,14 మేజర్ న్యూస్ :** గ్రామంలో మౌలిక వసతులు కల్పనకు కట్టుబడి ఉన్నామని ఎంపీపీ ప్రతినిధి పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. బుధవారం పాలవలస పంచాయతీ మధుర గ్రామమైన నక్కలపేటలో 2 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఇంకా గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే సమస్య ఉన్న పలు వీధుల్లో సిసి రోడ్లు కాలువలు నిర్మాణం చేపట్టామని అన్నారు. నక్కల పేట గ్రామస్తులు పండగ వేల సీసీ రోడ్డు నిర్మాణంతో ఎంతో సంతృప్తి చెందామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వల్లూరు రాము,బుర్లె శ్రీనివాసరావు, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# ఎల్.కోటలో సందడి చేసిన మేలు కొలుపు బృందం



**లక్కవరపు కోట జనవరి 14 (మేజర్ న్యూస్) :** మండలంలో సంక్రాతి ఉత్సవాల సందర్భంగా నెల గంట ప్రారంభం నుంచి అన్ని కొన్ని గ్రామాలలో కొందరు బృందంగా ఏర్పడి భజనలు ద్వారా భక్తి గీతాలు ఆలపిస్తూ ప్రజలను మేలు కొలుపుతూ పండగ సందడి ఆ ఉత్సాహన్ని అందరిలో నింపేందుకు ప్రతి ఏటా ప్రయత్నం చేస్తూనే వుంటారు ఈ బృందం నే మేలు కొలుపు బృందం అంటారు ఈ బృందం లో చిన్న పెద్ద వర్గ బేధాలు లేకుండా అందరు ఉత్సాహంగా పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి సేకరించిన బియ్యం డబ్బులు ద్వారా పండగ రోజున దేవుని గుడి వద్ద అన్న సంతర్పన ఏర్పాటు చేస్తారు ఈ విదంగా సంక్రాతి ప్రారంభం నుంచి ఎంత చలిగా వున్నా చలిని కూడా లెక్క చేయకుండా ఈ బృందం తెల్లవారు జామునే ఇలా పండ వచ్చేస్తుంది అందరు సిద్ధం కండి అని అందరికి గుర్తుకు తెస్తారు హిందువుల పండగలో ముఖ్యంగా తెలుగు వారి పండగలో సంక్రాతి ఎంతో ముఖ్య మైంది మూడు రోజులు జరిగే ఈ పండగ కోసం నెల రోజులు నుంచే ఇలాంటి అనేక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సంక్రాతి తన ప్రత్యేకత చాటు కుంటుంది అందుకే అన్ని పండగలు కంటే సంక్రాతి అంటే తెలుగు ప్రజలకు మరింత ఇష్టం మొదటి రోజు బోగి బుధవారం సందర్భంగా ఎల్.కోటలో మేలు కొలుపు బృందం వీధుల్లో రామ నామ కీర్తన చేస్తూ సందడి చేశారు

# భోగి పండుగ సందర్భంగా గజరాయునివలసలో ఎడ్ల పందేలు

**బాడంగి, జనవరి 14 (మేజర్ న్యూస్) :** భోగి పండుగ సందర్భంగా ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్లే గజరాయునివలస గ్రామంలో బుధవారం సంప్రదాయ గ్రామీణ ఎడ్ల పందేలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి బొబ్బిలి శాసన సభ్యులు బేబీ నాయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ క్రీడలు, సంప్రదాయాల పరిరక్షణలో ఎడ్ల పందేల ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. పండుగల సమయంలో ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యతను, ఉత్సాహాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.



ఈ పోటీల్లో అనేక గ్రామాల నుంచి అనేక మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను గెలుపొందిన వారు కన్నంపేట సాలూరు గుమ్మడి గ్రామాలకు చెందిన రైతులు వారికి నాయుడు వలస ప్రధానోపాధ్యాయులు జెసి రాజు బహుమతులను ప్రధానం చేశారు కార్యక్రమంలో ఎంపీపీ వై లక్ష్మీ వైస్ ఎంపీపీ పాలవలస గౌరు, గ్రామ సర్పంచ్ ఎం. సత్యం, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.

# పేదలకు "పడాల" పండగ కానుకలు

**భోగాపురం, జనవరి 15: మేజర్ న్యూస్ :** సంక్రాంతి పండుగ ప్రతి ఇంట్లో ఆనందంగా గడుపుకోవాలని, ఏడాది పాటు ప్రతిరోజు ఒక పర్వదినంగా ఉండాలనే ఉద్దేశ్యంతో పేదలకు నూతన వస్త్రాలను అందజేశామని జనసేన సీనియర్ నాయకులు పడాల శ్రీనివాసరావు, ఆయన సతీమణి మాజీ జెడ్పిటిసి సభ్యులు పడాల రాజేశ్వరితో కలిసి పేదలకు నూతన వస్త్రాలను అందజేశారు. ప్రతి ఏటా సాంప్రదాయపద్ధంగా వస్తున్న ఇలాంటి కార్యక్రమాలు చేయడం ఎంతో ఆనందంగా ఉందని, ఎవరైతే సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటారో వారిపై ఎల్లప్పుడూ భగవంతుని దీవెనలు ఉంటాయని శ్రీనివాసరావు అన్నారు.



# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే బేబీనాయన



**బొబ్బిలి, జనవరి 14: మేజర్ న్యూస్ :** కష్టంలో ఉన్న వారిని గుర్తించి, వైద్య ఖర్చుల కోసం కూటమి ప్రభుత్వం ఎమ్మెల్యే బేబీనాయన ఆర్థిక సహాయం బుధవారం అందజేశారు. బొబ్బిలి నియోజకవర్గంలో కొందరు పౌరుల ఆరోగ్యసమస్యలు మరియు వారి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, గౌరవ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 8 మంది లబ్ధిదారులకు రూ3,19,641 ఆర్థిక సహాయం అందేలా కృషి చేసి, సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) బొబ్బిలి కోటలో లబ్దిదారులకు అందజేశారు. అందుకున్న వారిలో గుణుపూరు ఆదినారాయణకి రూ63,893, కె.సత్యనారాయణకి రూ52,522, హైందవి అజ్జారపుకి రూ45,000, కలిశెట్టి సోహన్ సాయికి రూ37,378, సిరిపురం శృతికి రూ36,480, సి.హెచ్.భాస్కరరావుకి రూ31,843, పెద్దింటి సత్యం నాయుడుకి రూ.27,525 ఆల్తి అరుణజ్యోతికి రూ25,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షుడు, కౌన్సిలర్, గెంబలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ మహమ్మారిని తరిమి కొట్టండి

## - కరపత్రాలను భోగిమంటల్లో వేసిన ఐద్వా



**బొబ్బిలి, జనవరి 14: మేజర్ న్యూస్ :** అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా విజనగరం జిల్లా అధ్యక్షులు కే.పుణ్యవతి ఆధ్వ ర్యంలో బొబ్బిలి మండలం జే.రంగ రాయపురంలో బుధవారం డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టండి అని భోగి మంటల్లో కరపత్రాలు తగల బెట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు బెల్ట్ షాపులు లేకుండా చేస్తానని హామీ ఇచ్చినప్పటికీ హామీని ఏమాత్రం కూడా అమలు చేయలేకపోవడం అన్యాయమన్నారు. యువత చెడు వ్యసనాలకి బానిస అయిపోయి జీవితాలని నాశనం చేసుకుంటున్నా రని ఆమె అన్నారు. జనవాసాల్లో మద్యం షాపులు బారులు కి అనుమతులు ఇవ్వడం వలన మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని ఆమె అన్నారు. గంజాయి డ్రగ్స్ మద్యం ని ప్రభుత్వం నివారించాలని ఆమె కోరారు గంజాయి డ్రగ్స్ మద్యంకు బానిస అయ్యి చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆమె ప్రభుత్వానికి తెలియజేశారు.

# జీఎంఆర్‌కి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన జెడ్పీ ఛైర్‌పర్సన్ చిన్న శ్రీను మరియు సీరమ్మ..!



**విజయనగరం టౌన్, జనవరి 14, మేజర్ న్యూస్ :** తెలుగు ప్రజలు గర్వ పడే ప్రముఖ పారిశ్రామిక వేత్త, జీ ఎం ఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లి ఖార్జున్ రావు ని ఉమ్మడి విజయనగరం జిల్లా జెడ్పీ ఛైర్పర్సన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ ఇంచార్జ్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) గురువారం రాజాంలోని జీఎంఆర్ ఆయన ఐటీ ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. అల్లుడు నెల్లిమర్ల నియోజక వర్గ వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు ప్రదీప్ నాయుడు, కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మతో కలిసి వెళ్ళిన చిన్న శ్రీను జీఎంఆర్‌కి దుశ్శాలువ కప్పి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఇరువురు కొద్దిసేపు ముచ్చటించుకున్నారు.

## “ప్రజలు అందరికీ భోగి పండుగ
## హృదయపూర్వక శుభాకాంక్షలు : మాజీ ఎమ్మెల్యే శంభంగి



**బొబ్బిలి, జనవరి 14: మేజర్ న్యూస్ :** ఈ భోగి మంటలు మన సమాజంలోని అశాంతిని, వెనుకబాటు తనాన్ని దహించివేసి.. ప్రతి ఇంట్లో అభివృద్ధి, సుఖసంతోషాల కాంతులు నింపాలని మనసారా కోరుకుంటూ మాజీ ఎమ్మెల్యే శంభంగి వెంకట చిన అప్పలనాయుడు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

## కోడూరులో ఘనంగా సంక్రాంతి సంబరాలు



**బాడంగి, జనవరి 14, మేజర్ న్యూస్ :** మండలంలోని కోడూరు గ్రామంలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా గ్రామస్తులంతా వేడుకల్లో పాల్గొనడంతో గ్రామమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది.‘అవర్ విలేజ్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. అదేవిధంగా నిర్వహించిన మహా లాటరీ కార్యక్రమంలో గ్రామానికి చెందిన 40 మందికి వివిధ బహుమతులు అందజేశారు. ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన గ్రామ యువతను సత్కరించి అభినందించారు. సంక్రాంతి వేడుకల్లో భాగంగా నాలుగు రోజుల పాటు క్రికెట్, వాలీబాల్, షటిల్ వంటి క్రీడా పోటీలు నిర్వహించగా యువత ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేసింది. మహిళల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. రంగురంగుల ముగ్గులతో గ్రామమంతా పండుగ శోభను సంతరించుకుంది వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు.

### గోదా రంగనాథ కళ్యాణ మహోత్సవం
## కన్నుల పండుగగా నిర్వహణ



**పాలకొండ, మేజర్ న్యూస్ :** స్థానిక ముదునూరువారి వీధి గ్రామంలో వెలసిన శ్రీ కోదండ రామాలయంలో గోదా రంగనాథ కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో జరిగిన ఈ వేడుకలు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించాయి. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు, సేవల్లో పాల్గొన్నారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య సంప్రదాయబద్ధంగా నిర్వహించిన కళ్యాణోత్సవం భక్తుల మనసులను పరవశింపజేసింది. గోదాదేవి–రంగనాథుల కల్యాణ దృశ్యం భక్తులకు నిజంగా కన్నుల పండుగగా నిలిచింది. ఆలయాన్ని పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించగా, పంచవాద్యాల నాదాలతో ఉత్సవ వాతావరణం ఉట్టిపడింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సీతారాంజీ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాదీ గోదా రంగనాథ కళ్యాణ మహోత్సవాన్ని భక్తి వైభవంగా నిర్వహించామని తెలిపారు. గ్రామస్తుల సహకారంతో పాటు భక్తుల సహభాగిత్యం వల్ల ఈ ఉత్సవం మరింత ఘనంగా జరిగిందని అన్నారు. కళ్యాణ మహోత్సవానంతరం ప్రత్యేక హారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణతో, పిల్లలు ఉత్సాహంగా పాల్గొనడంతో ఆలయం ఉల్లాసంగా మారింది. ఈ మహోత్సవం ద్వారా గ్రామంలో ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యం మరింత పెరిగిందని స్థానికులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగించాలని భక్తులు ఆకాంక్షించారు.

# హిందూ ధర్మ పరిరక్షణ భారతీయులను ఐక్యం చేయడం ఆర్ఎస్ఎస్ ముఖ్య లక్ష్యం



**లక్కవరపుకోట జనవరి 14 (మేజర్ న్యూస్) :** దేశంలో హిందూమత పరిరక్షణ తో పాటు ప్రజలందరినీ ఐక్యం చేసే ఉద్దేశంతో 1925లో స్వతంత్ర సమర యోధుడు కేశవ్ బైలిరామ్ హెడగ్వర్ ఆర్ఎస్ఎస్ సంస్థను ఏర్పాటు చేశారని ఈ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశం హిందువులు అందరిని ఐక్యం చేసి స్వతంత్ర సాధలో కలిసి పోరాడే లా చేయడం అని మతాన్ని ప్రచారం చేయడం కాదని మనుషులందరినీ ఐక్యం చేయడమే ప్రధాన లక్యం అని ఆర్ఎస్ఎస్ మండల కార్యవర్గ సభ్యులు త్రినాథ్ అన్నారు బుధవారం రెల్లి గౌరమ్మ పేటలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు హిందువులంతా విడిపోయి కులాలు వారీగా వర్గాలు వారీగా అనేకంగా ఉండి బ్రిటిష్ వారి చేతుల్లో బానిసలుగా మారిపోయిన సందర్భాన్ని గమనించిన అప్పటి స్వతంత్ర సమరయోధులు హిందువుల ఐక్యం చేసి తద్వారా భారతీయతను దేశభక్తిని వారిలో నింపారు అని తద్వారా ముందుకు సాగిన పోరాటం కారణం గా దేశానికి స్వతంత్రం వచ్చిందని అన్నారు ఇప్పటికి హిందువులంతా అనైక్యంగా ఉండడం వల్లే దేశంలో మైనార్టీ మతాలవారు హిందువులను ఇబ్బంది పెడుతూ వారి ఆధిపత్యాన్ని కొనసాగించే ప్రయత్నం చేస్తున్నారని దీనికి కారణం హిందువుల్లో కులాలవారీగా ప్రాంతాలవారీగా విడిపోతూ అనేకంగా ఉండడమే ప్రధాన కారణమన్నారు జనాభాపరంగా హిందువులకి ఎక్కువగా ఉన్న ఐక్యతలో హిందువులు మధ్య లోపం స్పష్టంగా కనిపిస్తుందని ఆ యొక్క లోటును ఇతర మతాలవారు ఆసరాగా తీసుకొని హిందువుల మనోభావాలతో ఆడుకుంటున్నారని ఇది ప్రతి హిందువు గుర్తించి హిందువులంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. క్రిస్టియన్స్ ముస్లింలు ఇతర మతాల వారు ఒక్కరున్నా ఇద్దరున్నా పదిమంది ఉన్నా వారి చేసే పూజల్లో వారు చేసే ప్రార్థనలో ఇతర కార్యక్రమాలలో వేసాధారణలో అందరినీ కలుపుకొని ఒక ఐక్యతా భావాన్ని వారిలో నింపి తామంతా ఒక్కటే అనే భావనను కలిగించి ఏదైనా సమస్య వస్తే మళ్ళీ వారందరినీ పోగుచేసుకుని ఒకే తాటిపై కదిలే పరిస్థితి ఉందని కానీ హిందువుల్లో అటువంటి పరిస్థితి ఇప్పటికి లేకపోవడం పెద్ద లోపం గా పేర్కొన్నారు ఇప్పటికైనా ఈ లోపాలను సవరించుకుని హిందువులంతా ఐక్యం కావాలని కులం ప్రాంతం వర్గం అనే బేధాలను విడిచి ఒకే తాటిపైకి రావాలని లేదంటే అధిక జనాభా ఉన్న హిందువులు హిందూ దేశం లో వున్నా ఎన్ని శతాబ్దాలు గడిచినా మైనార్టీలుగానే మిగిలిపోవాల్సి వస్తుందని అన్నీ ఉండి అల్లుడు నోటిలో శని అనే సామెత మన విషయం లో నిజం అవుతుంది అని అన్నారు అతి తక్కువ జనాభా ఉన్న అన్ని మతాలవారు కలిసి మెలిసి జీవిస్తున్న పరిస్థితుల్లో హిందువులు ఎందుకు కలిసిమెలిసి ఉండలేకపోతున్నారు అనే ప్రశ్న ప్రతి ఒక్కరులో మొదలుకావాలని మార్పు ప్రారంభం కాకపోతే ఇలా విడిపోయి చెడిపోతుంటే ఎప్పటికీ మనం అనుకున్నట్టువంటి ఐక్యతను సాధించలేమని ఆయన అన్నారు మన మతాచారాలలో పూజా విధానాలలో ఈ ఐక్యతకు భంగం కలిగించే లోపాలు ఏమన్నా ఉంటే వాటిని సవరించుకొని అందరం ముందుకు కదలాలని పిలుపునిచ్చారు హిందూ మతాన్ని ఆచరించే వారందరూ కూడా ఐక్యం అయితేనే హిందూ మతం హిందూ ధర్మం రక్షించబడి భావితరాలకు ఆదర్శంగా మనం నిలబడతామని లేదంటే ఇతర దేశాల్లో హిందువులపై జరుగుతున్న దాడులు మనదేశంలో కూడా జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో రెల్లి గౌరమ్మ పేట గ్రామ పెద్దలు శ్రీ రామ భజన మండలి సభ్యులు వై.వి.రమణ తదితరులు ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రంగవల్లులు.. ఆనందాల హరివిల్లులు.. పోలిపల్లిలో కనిపించిన సంక్రాంతి శోభ





**భోగాపురం, జనవరి 15: మేజర్ న్యూస్ :** సంక్రాంతి పండుగ శోభ పోలిపల్లిలో సంతరించుకుందనడంలో సందేహం లేదు. చిట్టి పొట్టి చేతులే కాకుండా.. మహిళా మణుల చేతుల నిండా రంగుల వలయంగా మారింది. భోగాపురం మండలం పోలిపల్లి గ్రామంలో ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీలు అత్యంత కమనీయంగా కనువిందుగా జరిగాయి. చిన్న పెద్ద తేడా లేకుండా మహిళా మణులంతా ఒకే చోట కూడి మనసును హత్తుకునే ముత్యాల ముగ్గులతో శ్రోతల్ని కట్టిపడేశారు. ఒక దానికి ఒకటి పోటీ పడుతూ న్యాయ నిర్ణేతల మనసును గెలిచారు. ఈ పోటీల్లో ప్రథమ అనురాధ రూ.15 వేలు, రెండవ కె .తేజ రూ. 10వేలు, మూడవ కృష్ణవేణి రూ. 5వేలు, నాల్గవ ఏ.రోజా రూ.3వేలు సాధించారు. ఈ యొక్క పోటీల్లో పాల్గొన్న 55 మందికి బహుమతితో పాటు రూ.500 నగదును అందించారు. ఈ కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా హై స్కూల్ హెచ్ఎం నిర్మల, డిప్యూటీ ఎంపీడీవో కె.బుజ్జి, పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కర్రోతు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో సుఖ సంతోషాల పండగ

### – సంక్రాంతి సంబరాల నిర్వహణలో రమణ ఆర్థిక సహకారం ఎనలేనిది – పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రధానం





**పూసపాటిరేగ, జనవరి 14 (మేజర్ న్యూస్) :** ఎన్డీఏ కూటమి ప్రభుత్వ అధికారులకు వచ్చాక గ్రామాల్లో పండగ వాతావరణం ఏర్పడడం సంతోషకరంగా ఉందని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. మండలంలోని చోడమ్మ అగ్రహారం లో మాజీ ఉప సర్పంచ్ గొర్ల రమణ ఆర్థిక సహకారంతో నిర్వహించిన క్రీడా పోటీలతోపాటు రంగవల్లుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఎమ్మెల్యే లోకం నాగబాబు చేతుల మీదుగా బహుమతులను బుధవారం ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వ అధికారులకు వచ్చేక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తూ గ్రామాలు అభివృద్ధి బాట పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే మాధవి వ్యక్తం చేశారు. కొన్ని అభివృద్ధి పనుల విషయంలో వైకాపా నాయకులు కావాలనే అడ్డు తగిలి పంచాయతీ తీర్మానాలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడినప్పటికీ జిల్లా పరిపాలప అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించడం ద్వారా గ్రామాల్లో సిసి రోడ్లతో పాటు కాలువలను నిర్మించగలుగుతున్నామన్నారు. తాను ప్రజా సేవకురాలనే తప్ప భక్షకురాలు ని కాదని అవినీతి లేని సమాజాన్ని తీర్చిదిద్దమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఈ సందర్భంగా మాధవి స్పష్టం చేశారు. కొవ్వాడ పంచాయతీ పరిధిలో ఉన్న రహదారులన్నిటినీ ఇతర గ్రామాలకు అనుసంధానం చేసిన సర్పంచు కోట్ల రఘు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా రఘు ని సందర్భంగా ఎమ్మెల్యే మాధవి అభినందించారు. అనంతరం గొర్ల రమణ ఆర్థిక సహకారంతో నిర్వహించిన క్రీడల్లో విద్యార్థులకు ట్రోఫీలతోపాటు నగదు బహుమతులను ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, నాయకులు లోకం ప్రసాద్, కోట్ల రఘు, జమరాజుల తో కలిసి అందజేశారు. అదే విధంగా రంగవల్లుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు గ్రైండర్లతో పాటు గ్రైండర్ తో పాటు మిక్సీ , కుక్కర్లను కూడా ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆర్థిక నిర్వహకులు గొర్లె రమణ సమక్షంలో అందజేశారు, ఈ కార్యక్రమంలో తెదేపా అధ్యక్షుడు గుడివాడ అప్పల నరసయ్య, కూర్మారావు , గ్రామస్తులు కూడా పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వం జీవోలనుని భోగి మంటల్లో దగ్ధం





**సీతానగరం, జనవరి 14 (మేజర్ న్యూస్) :** మండలంలో నిడగళ్లు, బుడ్డిపేట, చినబోగిల, రంగం పేట, రెడ్డివానివలస, రామవరం గ్రామాల్లో ప్రజాసంఘాలఆధ్వర్యంలో జీవో ప్రతులను దగ్ధం చేసారు, ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, సిఐటియు కార్యదర్శి గవర వెంకటరమణ మాట్లాడుతూ పేదలను ఉపాధికి దూరం చేసే విబి జి రామ్ జి ఉపాధి స్కీములు రద్దుచేయాలి, నాణ్యతలేని నకిలీ విత్తనాల వలన నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వకుండా కంపె నీలుకు అను కూలంగా ఉండే విత్తన సవరణ బిల్లు 2025 రద్దు చేయాలని, వ్యవసాయా నికి పేద బలహీన వర్గాలకు రాయితీలు లేకుండా చేసే విద్యుత్ బిల్లు రద్దు చేయాలని ,కేంద్రం ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకశీలో మహాత్మ గాంధీపేరు తోగించింది. ఇంతవరకు కేంద్రం 90 శాతం నిధులు ఇచ్చేది ఇప్పుడు కేంద్రం 60, శాతం రాష్ట్రం 40 శాతం నిధులు ఇవ్వాలనే నిబంధన పెట్టి రాష్ట్రల్లో భారం మోపింది, ఇది రాష్ట్రలకి తీవ్రంగా నష్టం జరుగుతుంది. 125 రోజులకి పనిదినాలు పెంచి 60 వేలకోట్లల్లో 20 వేల కోట్లు నిధులు తగ్గించింది. పనిదినాలు ఉన్న నిధులు లేకపోతే పని జరగదు. అలాగే పెరిగిన ధరలుకి అనుగుణంగా రోజుకి రూ.600 కూలి ఇవ్వాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని, పట్టణాల్లో ఉపాధి హామీ పథకం అమలు చేయాలని డిమాండ్ చేసారు. చేశారు.బోరపరెడ్డి అప్పారావు,గంట జ్యోతి, యాళ్ల ఈశ్వరరావు, సిహెచ్, క్రిష్ణ, ఆర్.లక్షుం నాయుడు, రెడ్డి రవణ మూర్తి, నక్క త్రినాథ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీగోదాదేవి కళ్యాణ మహోత్సవం

**– దేవస్థానం ఈవో బండ్లమూడి శ్రీనివాస్ – వి.వి.అప్పలాచార్యులు ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవం – దేవస్థానం సిబ్బంది గంట శ్రీధర్ నాయుడు**







**గరుగుబిల్లి, జనవరి14, మేజర్ న్యూస్ :** ఉత్తరాంధ్రలో చిన తిరుపతిగా ప్రసిద్ధి చెందిన తోటపల్లి గ్రామంలో వేంచేసి యున్న శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో బుధవారం భోగి సందర్భంగా శ్రీగోదాదేవి కళ్యాణ మహోత్సవము అత్యంత వైభవంగా జరిగింది. భోగి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవెంకటేశ్వర స్వామి మరియు పద్మావతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు.

ధను ర్మాసం సందర్భంగా శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో నెలరోజుల పాటు ధనుర్మాసం ఉత్సవములు ఘనంగా నిర్వహించారు. అదే విధముగా స్వామి వారి తిరువీధి మహోత్సవం, విశేషహోమములు, తదితర పూజా కార్యక్రమాలు జరి గాయి.ధనుర్మాసం ముగింపు సందర్భంగా శ్రీగోదాదేవి కళ్యాణ మహోత్సవమును ఆలయ ప్రధాన అర్చకులు వి.వి.అప్పలా చార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు.కళ్యాణంలో పాల్గొన్న భక్తులకు ఉచిత ప్రసాదంను అందజేయడం జరిగిందని ఆలయ కార్య నిర్వహణ అధికారి బండ్లమూడి శ్రీనివాస్ తెలిపారు.

గోదాదేవికళ్యాణం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మార్కొండ పకీరునాయుడు, దేవస్థానం సిబ్బంది గంట శ్రీధర్ నాయుడు,భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

### కూటమి ప్రభుత్వం ఇచ్చిన చీకటి జీఓ ప్రతులును

# భోగి మంటల్లో దహనం చేసిన ఎమ్మెల్సీ

**పాలకొండ, మేజర్ న్యూస్ :** పాలకొండ లో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రతులును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ శాసనమండలి సభ్యులు పాలవలస విక్రాంత్ బాబు భోగి మంటల్లో దహనం చేసి, నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై కూటమి ప్రభుత్వం వెంటనే నిర్ణయం మార్చుకోవాలని వారు డిమాండ్ చేశారు. మాయమాటలు, అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి, గత 19 నెలలుగా మోసం, వంచనతో పాలన సాగిస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీ నెరవేర్చకుండా సీఎం చంద్రబాబు మరోసారి ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. అందుకే కూటమి పెద్దల మనసుల్లో నిండి ఉన్న మోసం, వంచన, నిరంకుశత్వం వంటి దుర్గుణాలన్నీ ఈ భోగి మంటల్లో కాలిపోవాలని, కనీసం ఇప్పుడైనా ప్రజలకు మేలు చేసేలా సీఎం చంద్రబాబుకు సద్బుద్ధి ఇవ్వాలని దేవుడిని ప్రార్థించామన్నారు. ముఖ్యంగా ప్రజారోగ్య రంగాన్ని నిర్వీర్యం చేసేలా 10 కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేలా నారా చంద్రబాబు మనసు మార్చాలని దేవుడిని ప్రార్థించామన్నారు. అలాగే, ఆ నిర్ణయంపై నిరసన వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు సంబంధించిన జీఓ ప్రతులును భోగి మంటల్లో దహనం చేయడం జరిగిందన్నారు.కూటమి ప్రభుత్వం కొలువు దీరిన నాటి నుంచి యువత, ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు, మహిళలు ఇలా అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర ద్రోహం చేశారన్నారు. ఇకనైనా వారి మేలు గురించి ప్రభుత్వం ఆలోచించాలన్నారు. గత వైయస్సార్‌సీపీ ప్రభుత్వ



హయాంలో ఐదేళ్లూ రాష్ట్ర ప్రజలంతా సంక్రాంతి పండుగను ఎంతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకొంటే, కూటమి ప్రభుత్వం వచ్చాక జరుగుతున్న ఈ రెండో సంక్రాంతికి కూడా ఏ ఇంటా ఆ శోభ కనిపించడం లేదన్నారు. ముఖ్యంగా కూటమి పాలనలో మహిళలు అన్ని విధాలుగా నష్టపోయారన్నారు. ఇకనైనా గత ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలిని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా వీరితో పాటూ వెలమల మన్మధ రావు, అయ్యప్ప శంకర్, భాసురు కాంతారావు, కోడెం విజయకుమార్, దవాళేశ్వర రావు,లిల్లీ పుష్పనాదం, చిన్ని, నీలాపు శ్రీనివాసరావు, దుప్పాడ పాపి నాయుడు, భాను పాలకొండ నియోజకవర్గ వైయస్సార్ సీపీ పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### రౌతు వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో

# ముగిసిన ధనుర్మాస కార్యక్రమాలు



**సీతానగరం, జనవరి 14 (మేజర్ న్యూస్) :** మండలంలోని సుమిత్రాపురం గ్రామం టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రౌతు వేణు గోపాలనాయుడు ఆధ్వర్యంలో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న ధనుర్మాస కార్యక్రమాలు బుధవారం గోదాదేవి కళ్యాణంతో ముగిసాయి. నెలరోజులపాటు గ్రామములో గోవిందనామస్మరణ, మేల్కొలుపులు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు భజనలు చేసి, ఆండాళ్ పాశురం పఠనాకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు మాట్లాడుతూ భక్తులంతా కలిసికట్టుగా వేకువజాము నుండి ప్రతిరోజు కార్యక్రమాలను చాలా చక్కగా భక్తిశ్రద్ధలతోనిర్వహించామని . గ్రామంలో ఆధ్యాత్మికత పెంచడంలో ధనుర్మాసం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. సంక్రాంతి పండుగలో భాగముగా మొదటిరోజు భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి గ్రామంలో భోగిమంటలను వేశారు.భోగిమంట ల్లో ముందుగా ఆవు పేడతో తయారుచేసిన భోగి పిడకలను పిల్లలచే వేయించారు.

## రెండు తులాల బంగారం తాడు దొంగతనం

**సీతానగరం జనవరి 14 మేజర్ న్యూస్ :** మండలంలో నడుస్తూ వెళు తున్న మహిళల మెడ నుండి రెండు తులాల బంగారం తాడు చోరీ చేసిన వైనం. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం రామవరం పంచాయతీ రెడ్డివానివలస గ్రామానికి చెందిన రెడ్డి అన్నపూర్ణమ్మ తనకున్న మేకలను మేపడానికి స్థానిక రైల్వే గేట్ సమీపానికి తోలుకొని వెళ్తుండగా పల్సర్ బైక్పై గుర్తుతెలియని వ్యక్తి వచ్చి తన మెడలో ఉన్న రెండు తులాల బంగారు తాడును తెంపుకొని వెళ్లిపోయాడని అనంతరం స్థానిక సహకారంతో వెతకగా ఎక్కడ ఆచూకీ కనబడకపోవడంతో ఈ మేరకు సీతానగరం పోలీస్ స్టేషన్లో ఆమె ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

## ప్రతీ ఇంటా సంక్రాంతి పండుగ సంతోషాన్ని నింపాలి

**– ప్రతి ఒక్కరూ సంతోషంగా నిర్వహించుకోవాలని ఆకాంక్ష**

**– టిడిపి పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఏఎంసి వైస్ చైర్మన్ రౌతు వేణుగోపాల్ నాయుడు**



**సీతానగరం జనవరి14 (మేజర్ న్యూస్) :** భోగిమంటలతో సంక్రాంతి పండుగ శోభ ప్రారంభం అయిందని ఈనేపథ్యం లో ప్రజలకు మరియు తెలుగుదేశం పార్టీ నాయ కులు, కార్యకర్తలకు టిడిపి పార్టీ మండల ప్రధాన కార్యదర్శి. ఏఎంసి వైస్ చైర్మన్ రౌతు వేణుగోపాల్ నాయుడు సంక్రాంతి శుభా కాంక్షలు తెలియ జేశారు. ఈమేరకు ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగ ప్రతి ఇంటా సంతోషాన్ని నిశీపాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పల్లె పండుగ రైతుల పండుగ మన అక్క చెల్లెమ్మల పండుగ మొత్తంగా మన సంస్కృతిని సంప్రదాయాలను చాటి చెప్పే అచ్చ తెలుగు పండుగ అభివర్ణించారు. సంక్రాంతి పండుగ ప్రతీ కుటుంబానికి ఆయురారోగ్యాలతో, శుభాలు, ప్రతి ఇంట కాంతులు వెదజల్లాలని . సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్ర మణం అంటారని ఈపుణ్యదినాన్నే సంక్రాంతి పండుగను తెలుగువారు నిర్వ హించుకుంటారని అన్నదాతలు పండించే పంటలు చేతి కొచ్చే సమయంలో, ఆనందోత్సవాల నడుమ మూడు రోజులు భోగి సంక్రాంతి, కనుమ పండుగను ఘనంగా నిర్వహించుకునే ఈ పండగ ప్రజలందరికీ మధుర స్మృతులను మిగల్చాలని కోరారు. ప్రజలకు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు. మండలంలో ప్రజలకు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

# రావుపల్లిలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**- బహుమతులు అందజేసిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సూర్యప్రకాష్ - గ్రామ అభివృద్ధికి తన వంతు సహకారం...డాక్టర్ గుల్ల సూర్య ప్రకాష్**

**- గ్రామ పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేష్ - ఆశయ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు**






**గరుగుబిల్లి, జనవరి 14 (మేజర్ న్యూస్) :** రంగవల్లులతో తీర్చిదిద్దిన వీధులు,పూల అలంకరణతో కొలువు తీరిన గొబ్బెమ్మలు,ఆధ్యాత్మిక సౌర భాలు వెలజల్లుతూ హరిదాసుల కీర్తనలు,పిండివంటల ఘుమఘు మలు నూతన వస్త్రాలను ధరించిన పిల్లల కేరింతలుతో సాంస్కృతిక కార్యక్రమాలతో సంక్రాంతి సంబ రాలను మండల పరిధిలోని రావుపల్లి గ్రామంలో ఆశయ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్, గ్రామ పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్), డాక్టర్ గుల్ల రామ్ నరేష్, మాజీ సర్పంచ్ గుల్ల కాశినాయుడు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి సంక్రాంతి సంబరాలను ప్రారంభించా రు.సంక్రాంతి సంబరాలు సందర్భంగా గ్రామంలోని ప్రతిభావంతులైన కళాకా రులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.గ్రామీణ జానపద నృత్యాలు తప్పిట గుళ్ళుతో పాటు ఇతర సాంప్రదాయ నృత్యాలు కోలాటం, భరతనాట్యం, కూచిపూడి నృత్యం వంటివి సంక్రాంతి సంబరా లలో ప్రదర్శించారు.అదే విధముగా గ్రామంలోని 20 వీధులలో ప్రతి ఇంటి ముందు వేసిన ముగ్గులను పరిశీలిం చిన అనంతరం 20 మందిని ఎంపిక చేసి చీరలను అందజేశారు.

సంక్రాం తి సంబరాలలో భాగంగా నిర్వహిం చిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న కళాకారులను ప్రోత్సహిస్తూ ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్, సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్) డాక్టర్ గుల్ల రామ్ నరేష్, డాక్టర్ వెంకట నాయుడు, గుల్ల కాశినాయుడు తదితరులు బహుమతులను అందజేశారు.అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ గుల్ల సూర్య ప్రకాష్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఆశయ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు కృషి చేయడం పట్ల డాక్టర్ సూర్య ప్రకాష్ సభ్యులను అభినందించారు. ఆశయ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యం లో కళాకారులను ప్రోత్సహించేం దుకు సంక్రాంతి సంబరాలను నిర్వ హించడం ఆనందంగా ఉందన్నారు. మన సంస్కృతిని ప్రతిబింబించే ఈ పండుగను కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో కలిసి ఆనందంగా నిర్వహించుకోవాలని కోరారు.గ్రామ పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్) మాట్లా డుతూ ఆశయ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధికి కృషి చేయడంతో పాటు సామాజిక మరియు సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.అదే విధంగా గ్రామంలో ఆశయ హెల్పింగ్ హాండ్స్ చేపడు తున్న కార్యక్రమాలకు తన వంతు సంపూర్ణ సహాయ సహకారాలు ఉంటాయని ఈసందర్భంగా సర్పంచ్ మహేష్ వెల్లడించారు. ఈ కార్యక్ర మంలో బంకుపల్లి సూర్యనారాయణ శర్మ, గుంట్రెడ్డి హరికుమార్, జబర్దస్త్ ఆర్టిస్ట్ నవ్వుల దామోదర్, ఆశయ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## హైస్కూల్‌కు సౌండ్ సిస్టం అంద జేసిన డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్

**ఇప్పటికే డైనింగ్ హాల్ నిర్మించిన డాక్టర్ సూర్యప్రకాష్**

**జడ్పీహైస్కూల్ అభివృద్ధికి తన వంతు కృషి..డాక్టర్ సూర్యప్రకాష్**

**అభినందించిన సర్పంచ్ బొంతాడ మహేష్ తదితరులు**



**గరుగుబిల్లి, జనవరి 14, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని రావు పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు ప్రస్తుతం హైదరాబాద్ కేర్ హాస్పిటల్ లో కార్డియాలజిస్టుగా విధులు నిర్వ హిస్తున్న ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్ సౌండ్ సిస్టమును బుధవారం అందజేశారు. తన స్వగ్రామం రావుపల్లి గ్రామంలో డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్ ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలను పొందారు.గడిచిన కొద్ది రోజుల క్రితం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థు లు మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా పాఠశాలలో అమలు చేస్తు న్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజ న పథకంకు సంబంధించి తన తల్లి దండ్రులు గుల్ల లక్ష్మశీనాయుడు, రాములమ్మ జ్ఞాపకార్థం అధునాతన భోజనశాలను నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం బుధవారం ఆశయ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సౌండ్ సిస్టమును అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు (మహేష్), మాజీ సర్పంచ్ గుల్ల కాశినాయుడు, డాక్టర్ గుల్ల రామ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్‌కు ఘన సన్మానం

**- సన్మానించిన సర్పంచ్ బొంతాడ మహేష్, కాశినాయుడు - గ్రామాభివృద్ధికి మరింత కృషి..డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్**



**గరుగుబిల్లి, జనవరి 14, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని రావు పల్లి గ్రామంలో ఆశయ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో భాగముగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రముఖ కార్డియాలజిస్ట్ గా ఎంతో పేరు ప్రఖ్యాతులు గాంచిన మరియు విషనరీ ఇండియన్స్ అవార్డు గ్రహీత డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్‌ను బుధవారం ఘనంగా సన్మానిం చారు. ఈమేరకు తన స్వగ్రామమైన గరుగుబిల్లి మండలం రావుపల్లి గ్రామాభివృద్ధికి డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్ తన వంతు కృషి చేస్తున్న నేపథ్యం లో ఆశయ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు(మహేష్), మాజీ సర్పంచ్ గుల్ల కాశీనాయుడు,డాక్టర్ గుల్ల రామ్ నరేష్, డాక్టర్ వెంకట నాయుడు తదితరులు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా సన్మాన గ్రహీత డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్ మాట్లాడుతూ గ్రామంలో సామాజిక మరియు సేవా కార్య క్రమాలను తన వంతు చేపడతానని పేర్కొన్నారు.గ్రామ పంచాయతీ సర్పంచ్ బొంతాడ మహేష్ మాట్లా డుతూ గ్రామాభివృద్ధికి డాక్టర్ గుల్ల సూర్యప్రకాష్ ఎంతో కృషి చేయడం జరుగు తుందన్నారు. ఈకార్యక్రమంలో గుంట్రెడ్డి హరి కుమార్, గ్రామస్తులు చింతాడ తవిటాచారి, చింతాడ రుద్రకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సంక్రాంతి పండుగ

**- ఇంటి ముందు ప్రత్యేక ముగ్గులు వేసిన మహిళలు - సంక్రాంతి సందర్భంగా రంగ వల్లులతో తీర్చిదిద్దిన వీధులు**

**- పూల అలంకరణతో కొలువు తీరిన గొబ్బెమ్మలు**

గరుగుబిల్లి, జనవరి14, మేజర్ న్యూస్: రంగవల్లులతో తీర్చిదిద్దిన వీధులు.....పూలు అలంకరణతో కొలువుతీరిన గొబ్బెమ్మలు, ఆధ్యా త్మిక సౌరభాలు వెదజల్లుతూ హరిదాసుల కీర్తనలు, విన్యాసాలు, పిండివంటల ఘుమఘుమలు నూతన వస్త్రాలను ధరించిన పిల్లల కేరింతలుతో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు.పండుగ నెల ప్రారంభమైనప్పటి నుండి ప్రతి ఇంటి ముందు ఉదయాన్నే ఆవు పేడతో కల్లాపు జల్లి అందమైన ముగ్గులువేసి వాటి మధ్యన గొబ్బెమ్మను పెట్టి పూజిస్తారు.తెలుగు సాంప్రదాయం ప్రకారం గొబ్బెమ్మలను గోదాదేవి, లక్ష్మీదేవి, గౌరీమాతగా భావిస్తారు.గోవుపేడతో చేసిన గొబ్బె మ్మలను ముగ్గులు మధ్యలో ఉంచి పూలు పసుపు కుంకుమ సమర్పించి పూజిస్తా రు.అదేవిధముగా మకర సంక్రాంతి రోజున పెద్దల పండుగగా పిలుస్తారు. ఈమకర సంక్రాంతి రోజున పితృదేవతలకు కొత్తదుస్తులు చూపించి తర్పణాలు వదులుతారు. పంచభక్ష పరమాన్నాలతో కూడిన నైవేద్యం సమర్పించి పెద్దల ఆశీర్వచ నం పొందుతారు. కనుమపండుగ రోజున పశువుల పండుగగా పిలుస్తా రు. వ్యవసాయ పనుల్లో రైతు లకు అండగా నిలిచే పశువులను సమీ పంలోని చెరువు దగ్గరకు తీసుకువెళ్లి శుభ్రంగా కడిగి పశువులను ప్రత్యే కంగా పూజిస్తారు.అదే విధంగా కనుమ పండుగను ఘనంగా నిర్వహించారు.



## నియోజకవర్గ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు

**- ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్**



**ఆమదాలవలస, జనవరి 14, మేజర్‌న్యూస్:** ఆమదాలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే కూన రవికుమార్ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగు ప్రజలందరికి సాంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి పండుగ నిలుస్తుంది అన్నారు. సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాలలో కొత్త కాంతులు నింపాలని ఆకాంక్షించారు. సొంత గ్రామాల మీద మమకారానికి, రైతులకు ఇచ్చే గౌరవానికి ప్రతీక సంక్రాంతి నిలుస్తుందన్నారు. సంక్రాంతి శుభాలు కలగాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పండగకు అందరూ ఆనందంగా గడుపుకోవాలని కోరారు.

## పేదప్రజల సంతోషమే సంక్రాంతి ఆనందం

**- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు పిన్నింటి**



**రణస్థలం, జనవరి 14, మేజర్‌న్యూస్:** రణస్థలం మండలం రణస్థలం పంచాయతీలో ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ సంక్రాంతికి కూడా పేదలకు వస్త్రదానం, ఆడపడుచులకు చీరలతో పాటు గాజులకు కొంత డబ్బులను ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు మరియు రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట బానోజీ నాయుడు వారి కుటుంబ సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదవాడు తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతిని ఆనందంగా జరుపుకోవాలని ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలగకూడదని అందరు సంతోషంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి మజ్జి వెంకట రమణ, వాళ్ళే రమణ , లంక రామారావు , పిన్నింటి రామారావు, పిన్నింటి సత్యారావు, కరిమజ్జి గోవింద, ఏఎంసి డైరెక్టర్ కెల్ల అప్పలనాయుడు, గుడిపాటి ప్రదీప్ కుమార్, చందక లక్ష్మణరావు, గులివిందల శంకర్, లంక రమణ, గొర్లె గోవింద,సువ్వాడ రమణ, పిన్నింటి నీలకంఠం ,కర్రీ సీతారాం , కుప్పిలి అప్పారావు, పంపురెడ్డి అప్పలనాయుడు, కరిమజ్జి అప్పలనాయుడు, పిన్నింటి వెంకటరావు, పిన్నింటి అప్పలనాయుడు పిన్నింటి ప్రకాష్, పిన్నింటి సూర్యారావు, యువత, పంచాయతీ ప్రజలు పంచాయతీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## తుప్పల చాటున 108 అంబులెన్స్

**- మరమ్మతుకు పట్టించుకోని అధికారులు**



**దుంబ్రిగుడ, జనవరి 14, మేజర్‌న్యూస్:** మారుమూల గ్రామంలో అనారోగ్యానికి గురైన వ్యాధిగ్రస్తులకు తక్షణమే వైద్య సేవలు అందించటానికి గాను ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్ కు మరమ్మత్తు పనులు చేయకపోవడంతో అది మూలన పడింది. సుమారు ఏడాది నుంచి అది పలమాటులో మూలన పడి నిరుపయోగంగా దర్శనమిస్తుంది. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతు గురైన 108 అంబులెన్స్ కు మరమ్మత్తు పనులు చేసి వినియోగంలో తీసుకొచ్చి గిరిజనులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని మండలంలోని గిరిజనులు కోరుతున్నారు.

## సంక్రాంతి చిరునవ్వులు ప్రతి ఒక్కరిలో ఉండాలి

**- ఎచ్చెర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే ఎన్.ఇ.ఆర్**



**రణస్థలం, జనవరి 14, మేజర్‌న్యూస్:** రణస్థలం మండలం, బంటుపల్లి పంచాయతీలోని నడుకుదుటి పాలెంలో ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు( ఎన్ ఈ ఆర్) స్వగృహం వద్ద కుటుంబ సమేతంగా భోగి -సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న సంప్రదాయ వస్త్ర పంపిణీ కార్యక్రమాన్ని ఈ ఏడాదీ ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన తెలుగు సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక అయిన సంక్రాంతి పండుగ వేళ, గ్రామ ప్రజల ముఖాల్లో చిరునవ్వులు పూయించాలనే సదుద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోంది చిన్నారుల నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ పండుగ ఆనందం పంచడమే మా కుటుంబ లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. వారి ఆత్మీయత, ఆశీర్వాదమే నాకు ప్రజాసేవలో ముందుకు నడిపించే శక్తి. ప్రజల సంక్షేమమే పరమ లక్ష్యంగా, ఎచ్చెర్ల నియోజకవర్గ అభివృద్ధికి అంకితభావంతో నిరంతరం పనిచేస్తానని ఈ సందర్భంగా మరోసారి హామీ ఇస్తున్నాను అని అన్నారు. ఈ శుభ సందర్భంలో ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రజలందరికీ హృదయపూర్వక భోగి - సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పండుగ వెలుగులు ప్రతి ఇంట్లో ఆనందాన్ని నింపాలని కోరుకుంటున్నాను అని అన్నారు.

## ఘనంగా శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ పునః ప్రారంభోత్సవ వేడుకలు

**- తారువలో వైభవంగా ఆధ్యాత్మిక శోభ - స్వామివారిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు - భారీ స్థాయిలో అన్న సమారాధన కార్యక్రమం**



**దేవరాపల్లి, జనవరి 14, మేజర్‌న్యూస్:** మండలంలోని తారువలో శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ పునఃప్రారంభోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. తెల్లవార జాము నుంచి నూతన ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ముందుగా మాజీ డిప్యూటీ సిఎం బూడి ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులు, ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మన్, వైఎస్సార్సీపీ మహిళా విభాగం జోన్-1 వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లె అనురాధ తదితర గ్రామ పెద్దలు భక్తాంజనేయ స్వామి వారిని దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అలాగే గ్రామస్తులతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన భారీ అన్నసమారాధనకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు, ప్రజాప్రతినిధులు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. స్థానిక రాయాలయం ఆవరణలో నిర్వహించిన మహిళలు, చిన్నారుల కోలాట ప్రదర్శనలు భక్తజనాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. వెరసి గ్రామంలో శ్రీరామ నామం, హనుమాన్ నామస్మరణం మారుమ్రోగింది. దీంతో తారువ గ్రామంలో భోగి పర్వదినాన ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

## సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే...



**నరసన్నపేట, జనవరి 14, మేజర్‌న్యూస్:** నియోజకవర్గ ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలియజేశారు. సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా, రైతు జీవితంతో విడదీయరాని పండుగగా సంక్రాంతి నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలందరూ సామరస్య భావంతో ఆనందంగా పండగను నిర్వహించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందరికీ ఉపయోగకరమైన పాలనందిస్తుందని, అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా ముందుకు వెళుతుందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రానికి అవసరమైన నిధులు, ప్రాజెక్టులు సాధిస్తూ రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వ పెద్దలు ముందుకు తీసుకెళ్తున్నారని అన్నారు. ఈ సంక్రాతి పండుగ రాష్ట్ర రైతులకు మంచి ఫలితాలు తీసుకురావాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, ఆరోగ్యం, సమృద్ధి వెల్లివిరియాలని ఆకాంక్షించారు. భోగి పండుగ వేడుకల్లో పాల్గొన్నారు.

## జానీ మెమోరియల్ క్రికెట్ టోర్నీ విజేతగా “ఎం.సి.సి” నరసన్నపేట..



**నరసన్నపేట, జనవరి 14, మేజర్‌న్యూస్:** నరసన్నపేట జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం నుండి నిర్వహిస్తున్న “జానీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటు విజేతగా నరసన్నపేట మార్నింగ్ క్రికెట్ క్లబ్ నిలిచింది. రన్నర్ గా బ్రదర్స్ లెవెన్ చల్లవానిపేట జట్టు నిలిచినట్లు నిర్వాహకులు, వైఎంసిఏ సెక్రటరీ గొద్దు చిట్టిబాబు తెలియజేశారు. మొదట బ్యాటింగ్ చేపట్టిన బ్రదర్స్ లెవెన్ చల్లవానిపేట జట్టు నిర్ణీత 8 ఓవర్లో 48 పరుగులు సాధించింది. లక్ష సాధన తో బరిలోకి దిగిన మార్నింగ్ క్రికెట్ క్లబ్ ఏడు ఓవర్లలో 49 రకాల సాధించి విన్నర్ గా నిలిచింది. విన్నర్ టీంకు ట్రోఫీను, రన్నర్ టీం కు బహుమతులను అందజేశారు. బెస్ట్ ఆల్ రౌండర్ గా చలపాక ఉమా ఎంపిక చేసి బహుమతిని అందజేసినట్లు వై ఎం సి ఏ కార్యదర్శి చిట్టి బాబు తెలియజేశారు. బహుమతులను సంపతిరావు వెంకటలక్ష్మి అందించారు. ఈ పోటీల నిర్వహణలో కోచ్ శ్రీనివాస్, పి ఈ టి గోపి, నక్క రాము, శివాజీ, గొద్దు సాయి, వారణాసి కిషోర్, అజయ్ పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాల్లో పేదల కు వస్త్రాలు పంపిణీ



**కొత్తూరు, జనవరి 14, మేజర్‌న్యూస్:** కొత్తూరు మండలం మెట్టూరు గూడ గిరిజన గ్రామంలో వైసీపీ నేత కోపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్య నారాయణ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ప్రతీ సంవత్సరం వలే ఈ ఏడాది కూడ నిరుపేదలైన వారికి చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ ఏడాది మెట్టూరు గూడ గిరిజనులకు వాటిని అందజేశారు. చింతాడ దాతృత్వానికి మెట్టూరు గూడ గిరిజనులు కృతజ్ఞతలు తెలియ జేశారు. చింతాడ చేసిన దాతృత్వానికి ఆరోగ్యం గా ఉండాలని ఆశీర్వదించారు.

## కోడిపందాలు, జూదంపై పోలీసుల ఉక్కుపాదం

**- తొమ్మిది మంది అరెస్ట్, నగదు, కోళ్ల స్వాధీనం**



**అనకాపల్లి, జనవరి 14, మేజర్‌న్యూస్:** సంక్రాంతి పండుగ వేళ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలపై అనకాపల్లి రూరల్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. బుధవారం అనకాపల్లి రూరల్ సీఐ జి.అశోక్ కుమార్, ఏఎస్సై సత్యనారాయణ తమ సిబ్బందితో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ముందస్తు సమాచారంతో పోలీసులు వెంకుపాలెం, సుందరయ్యపేట, మొండిపాలెం గ్రామ శివార్లలో మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పట్టుబడిన వివరాలు ఇలా ఉన్నాయి.వెంకుపాలెం గ్రామం శివారుల్లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.2,900/- నగదు స్వాధీనం చేసుకున్నారు. సుందరయ్య పేట గ్రామంలో నిర్వహించిన దాడిలో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రెండు పందెం కోళ్లు, రూ.2,100/- నగదు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా కోళ్లకు కత్తులు కట్టే వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకోవడమైనది. మొండిపాలెం గ్రామ శివారులో నిర్వహించిన దాడిలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి రెండు పందెం కోళ్లు, రూ.1,000/- నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండల పరిధిలో ఎక్కడైనా జూదం, కోడిపందాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిరంతరం నిఘా ఉంటుందని స్పష్టం చేశారు.

## అవయవదానంతో మరేందరికో ఆదర్శం

**- సుశీలమ్మ నేత్ర, శరీర అవయవదానం**



అనకాపల్లి, జనవరి 14, మేజర్ న్యూస్: అఖిలభారత శరీర అవయవ దాతల సంఘం సీనియర్ సభ్యురాలు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వాసిరెడ్డి సుశీలమ్మ (వయస్సు: 91 సంవత్సరాలు) బుధవారం అనగా 14వ తేదీన అనారోగ్య కారణాల వల్ల అనకాపల్లి ఉషా ప్రైమ్ హాస్పిటల్‌లో మృతిచెందారు. అనంతరం అమె కోడలైన జిల్లా ఖజానాధికారి వి.ఎల్. సుభాషిణి అత్త సుశీలమ్మ అంతిమ కోరిక మేరకు కళ్లను ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్ వారికి, పార్ధేవదేహాన్ని ఆంధ్ర మెడికల్ కాలేజీ వారికి దానం ఇవ్వటం జరిగిందని అన్నారు. సుశీలమ్మ భర్త కీర్తిశేషులు వాసిరెడ్డి నారాయణరావు కాలేజీ లెక్చరర్ కూడా అనుకోని పరిస్థితులలో మరణించడంతో ఆయన అవయవాలను జీవన్దాన్ విభాగం వారికి అందజేయడం జరిగిందని, నేడు సుశీలమ్మ మరనించటంతో అనకాపల్లిలో గల సావిత్రి బాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నంబూరు నరేష్, అడ్డూరి శ్రీనివాస్, రిటైర్డ్ అధ్యాపకుల సంఘం ప్రతినిధులు గ్రంధి గాంధీ, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు జగన్నాథం ఇంకా అనేకమంది శరీరధాత సంఘ సభ్యులు, శ్రేయోభిలాషులు ఆమె పార్థివ దేహాన్ని దర్శించుకుని నివాళులర్పించారు. సుశీలమ్మ కోరిక ప్రకారం ఆమె కోడలు వి.ఎల్ సుభాషిని అనకాపల్లి జిల్లా ట్రెజరీ అధికారి, కుటుంబ సభ్యులు తీసుకున్న మహోన్నత నిర్ణయంగా ఆమె కళ్లను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి, అలాగే ఆమె శరీరాన్ని ఆంధ్ర మెడికల్ కాలేజ్‌కు దానం చేశారు. ఈ గొప్ప దానంతో ఇద్దరు అంధులకు చూపు లభించడంతో పాటు, వైద్య విద్యార్థులకు విలువైన వైద్య జ్ఞానం అందే అవకాశం కలిగిందని పలువురు సంఘ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలోఅనకాపల్లి జిల్లా ఖజానాధికారి వి.ఎల్. సుభాషిణి, ఆమె కుటుంబ సభ్యులతో పాటు విశాఖ జిల్లా శరీర, అవయవ దాతల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గంధం సాయి, డా.ఎస్.రవీంద్ర కిశోర్ (ప్రొఫెసర్ ఒ హెచ్ఓడి),డా. సిరీషా (అసిస్టెంట్ ప్రొఫెసర్), డా. జెన్నీ పల్లవి (పోస్ట్ గ్రాడ్యుయేట్), -- సంబంధిత విభాగం వైద్యులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అవయవ దానం వంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని, ఇలాంటి నిర్ణయాలు మరింత మంది తీసుకోవాలని ఈ సందర్భంగా పాల్గొన్నవారు ఆకాంక్షించారు.

## జన సైనికుడికి ఆర్థిక సహాయం



**రావికమతం, జనవరి 14, మేజర్‌న్యూస్:** మండలంలో గొంప గ్రామానికి చెందిన జన సైనికుడు పిల్లా ఏడుకొండల కుటుంబానికి సహచర జనసైనికులు బుధవారం ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన ఏడుకొండలు ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తూ జనసేన పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా కొనసాగుతున్నారు. గత నెల 27న ప్రమాదవశాత్తు మరణించారు. అతి చిన్న వయసులో మరణించడంతో అతని భార్య శిరీష పిల్లలు ఆర్థికంగా ఇబ్బంది ఎదుర్కొంటున్నారని గ్రామానికి చెందిన జనసేన కార్యకర్తలు గుర్తించారు. ఈ మేరకు చందాలు వేసుకుని 24 వేల రూపాయల 600 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. జనసేన పార్టీలో సభ్యత్వం ఉన్నప్పటికీ రెన్యువల్ చేసుకోకపోవడంతో పార్టీ నుంచి ఎటువంటి ఆర్థిక సహాయం అందలేదు. దీంతో సహచర కార్యకర్తలే ఆర్థిక సహాయం అందజేశారు.

## పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ



**సంతబొమ్మాళి, జనవరి14, మేజర్‌న్యూస్:** పండగ సంతోషం కేవలం ధనికులకే పరిమితం కాకూడదని పేదల ఇండ్లలో సంక్రాంతి వెలుగులు నిండాలని,పండగ పూట కడుపునిండా భోజనం ఉండాలనే సదుద్దేశంతో 15 నిరుపేద కుటుంబాలకు నౌపడ పంచాయతీలో గల నిరుపేద కుటుంబాలకు సుమారు 1000 రూపాయల విలువచేసే నిత్యవసర సరుకుల కిట్లను దుస్తులు ను స్పందన, పాలపోలమ్మ ఆలయ కమిటీ నౌపడ సభ్యులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్పందన, పాలపోలమ్మ ఆలయ కమిటీ సభ్యులు నడిమింటి నాగరాజు, పిలక రాజా, సాహుకారి నరసింగరావు, శంకరరావు, లోపింటి జయకృష్ణరెడ్డి మాస్టర్, మహంతి వేంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పేదల హక్కు

**- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనరస**



**అరకులోయ, జనవరి14, మేజర్‌న్యూస్:** అరకులోయ మండలంలోని పెదలబుడు మేజరు పంచాయతీకి చెందిన శరభగుడ గిరిజన గ్రామంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజుగార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ)(విబిజిఆర్ అండ్ ఎఎంజి) చట్టం ప్రతులను సిపిఎం నాయకులు,ఉపాధి హామీ పథకం కూలీలు బుధవారం దగ్ధం చేశారు.సిపిఎం మండలశాఖ నాయకుడు మగ్గన్న నేతృత్వంలో కొత్త చట్టం జీవో కాపీలను కాల్చి బూడిద చేశారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్)ను రద్దు చేసి దాని స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్) జీరాంజీ చట్టం తీసుకురావడం పట్ల ఆగ్రహం చెందిన ఉపాధి హామీ పథకం గిరిజన కూలీలు సిపిఎం నాయకుల సహకారంతో ఆప్రతులను మంటల పాలు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట. అప్పలనరస మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం చట్టంలో పెను మార్పు చేర్పులు చేసి కొత్త చట్టం తీసుకు వచ్చి ఉపాధి హామీ పథకం కార్మికుల హక్కులపై దాడి చేసిందని ఆరోపించారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎంజీఎన్ఆర్ఇజిఎస్ ను రద్దు చేసి దాని స్థానంలో నూతన చట్టాన్ని తీసుకురావడం దారుణమని ఆయన పేర్కొన్నారు.ఈ సరికొత్త చట్టం కేంద్ర నియంత్రణ పెంచడంతోపాటు రాష్ట్రాలపై ఆర్థిక భారం మోపుతుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. పనిదినాల పెంపు పేరుతో చట్టాన్ని మార్చినట్టు చెబుతున్నప్పటికీ వాస్తవంగా 50 పనిదినాలు కూడా లభించడం లేదని,కనీస వేతనం రూ.304 ఉండాల్సి ఉండగా,రూ.220 కూడా రావడం లేదన్నారు.చట్టాన్ని మార్చాల్సిన అవసరం ఏమిటని,చట్టంలోని లోపాలను సరిదిద్దాల్సింది పోయి రద్దు చేయడం అన్యాయమని ఆయన వాపోయారు.ఆదివాసీలకు ఉపాధి హామీ పథకం అర్ధాకలి నుంచి కాపాడిందని,అయితే కార్మికులు పోరాడి సాధించిన హక్కులను రద్దు చేయడంలో అర్థం లేదన్నారు.రాష్ట్రంలో జీరాంజీ చట్టం అమలైతే సంవత్సరానికి సుమారు 4 వేల కోట్ల రూపాయల భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడుతుందని,ఇప్పటికే రెవెన్యూ లోటు తీవ్రంగా ఉందని అప్పులపై నడుస్తున్న రాష్ట్రానికి ఇంత భారం మోపడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రభుత్వ చర్యలు ఆకలి చావులను ప్రోత్సాహిస్తున్నాయని,ఈ మేరకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఉపాధి హామీ పథకం కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు "ఇంటింటికీ ఉపాధి" పేరిట విస్తృత స్థాయిలో ప్రచారం చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.ప్రతి ఇంటికీ కరపత్రాలు అందజేసి, అధికారులకు కొత్త చట్టం వల్ల జరిగే నష్టాలను వివరించి న్యాయం చేయాలని కోరుతామన్నారు.అప్పటికి కూడా ప్రభుత్వం స్పందించకపోతే జాతీయ స్థాయిలో ఆందోళనలు చేపడుతామని ఆయన హెచ్చరించారు.వ్యవసాయ కార్మికులు,పేద రైతులు, చేతివృత్తిదారులు వాస్తవాలను గుర్తించి సిపిఎం చేపడుతున్న ఈ మహా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ఉపాధి కార్మికులతో సభలు, సమావేశాలు నిర్వహిస్తామని పాచిపెంట.అప్పలనరస తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు. బాలదేవ్,మండల సిపిఎం నాయకులు జగన్నాథం,హరి , రాము,గోపాల్,సహదేవ్, ఆనంద్,ప్రసాద్, ఆనంద్,పరశురాం,దేవా, మోహన్ గణేష్,గోపి, తదితరులు పాల్గొన్నారు.

వంద మిలియన్ డాలర్ల ఏఐ రెడీ సార్వభౌమ క్లౌడ్ పెట్టుబడికి జేఎల్ఎల్‌ను సలహాదారుగా నియమించిన భారత్ క్లౌడ్

విశాఖపట్నం, జనవరి 14, 2026: భారతదేశంలోని ప్రధాన నగరాలు, ఎంపిక చేసిన అంతర్జాతీయ ప్రదేశాలలో ఏఐ - రెడీ సావరిన్ క్లౌడ్ మౌలిక సదుపాయాల నిర్మాణాన్ని సులభతరం చేయడానికి జేఎల్ఎల్‌ని సలహా భాగస్వామిగా భారత్‌క్లౌడ్ నియమించింది. బోర్డు ఆమోదాలు, ఫైనాన్సింగ్ ఏర్పాట్లు, నియంత్రణ అనుమతులు, ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు లోబడి, రాబోయే ఐదేళ్లలో 100 మిలియన్ల డాలర్ల వరకు పెట్టుబడి పెట్టాలని భారత్‌క్లౌడ్ యోచిస్తోంది. ఈ ఏర్పాటులో భాగంగా జెఎల్ఎల్ ప్రత్యేక సలహా భాగస్వామిగా వ్యవహరిస్తుంది. కోలొకేషన్ సైట్ గుర్తింపు, డిజైన్ కన్సల్టెన్సీ, పోర్ట్ ఫోలియో ఆప్టిమైజేషన్‌లో భారత్‌క్లౌడ్‌కు మద్దతు ఇస్తుంది. ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ ఎన్సీఆర్, కోల్‌కతా, పుణె వంటి నగరాల్లో వైజాగ్, అహ్మదాబాద్, జైపూర్, కోయంబత్తూర్, కొచ్చి, చండీగఢ్, భోపాల్‌తో సహా ద్వితీయ, తృతీయ శ్రేణి ప్రాంతాల్లో ప్రపంచ స్థాయి ఎడ్జ్ క్లౌడ్ మౌలిక సదుపాయాలను అందించాలని ఈ కంపెనీలు కలిసి లక్ష్యంగా పెట్టుకున్నాయి. డిజిటల్ గవర్నెన్స్, ప్రైవేట్ రంగ సహకారాన్ని ప్రారంభించడానికి భారతదేశం తన 5జి, ఐఓటీ, ఏఐ -రెడీ క్లౌడ్ మౌలిక సదుపా యాలను వేగవంతం చేస్తున్నందున, భారత్‌క్లౌడ్ గణనీయమైన పురోగతిని సాధిస్తోంది. ప్రముఖ గ్లోబల్ ఇంటర్‌కనెక్షన్ ప్లాట్ ఫామ్ అయిన ఐజు-జ×శ ఇండియాతో తన మునుపటి భాగస్వామ్యాన్ని నిర్మించుకుంటూ, భారత్‌క్లౌడ్ ఇప్పుడు క్లౌడ్ సెంటర్ అభివృద్ధి కోసం జేఎల్ఎల్ తో తన అనుబంధాన్ని బలోపేతం చేస్తోంది. ఈ సహకారం, పటిష్ఠరీతిలో పంపిణీ చేయబడిన క్లౌడ్ పర్యావరణ వ్యవస్థను స్థాపించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఎంటర్‌ప్రైజ్ ఎడ్జ్ కంప్యూటింగ్ కోసం ఏఐ, ఐఓటీ, 5జి టెక్నాలజీల సజావైన ఏకీకరణను అనుమతించే కీలకమైన ఆర్కెస్ట్రాటర్‌గా భారత్‌క్లౌడ్ ను ఉంచుతుంది.

# అపజయాలను విజయాలుగా మలుచుకోవాలి

**– నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత భాగ్చి – సిపి సాక్షిగా ఉపాధి కల్పించమని అడిగిన యువకుడు గొంతు నొక్కే ప్రయత్నం!!**






భీమిలి, జనవరి 14,మేజర్ న్యూస్: క్రీడాకారులు అపజయాలకు కృంగిపోకుండా, అపజయాలను విజయాలుగా మలచుకోవడానికి నిరంతరాయంగా కృషి చేయాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత భాగ్చి పేర్కొన్నారు. విశాఖ జిల్లా భీమునిపట్నం మండలం పాత మూలకుద్దులో గత 21 రోజులుగా దివిస్ లేబొరేటరీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత భాగ్చి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.బుదవారం చిప్పాడ కూల్ థంపర్స్ ,కొత్త మూలక ుద్దు జైంట్ మూవర్స్ జట్ల మధ్య జరిగిన చివరి మ్యాచ్ ను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత భాగ్చి ఆసక్తిగా వీక్షించారు. ఈ పోటీలలో దివీస్ ఛాలెంజర్స్ క్రికెట్ ట్రోఫీని చిప్పాడ గ్రామానికి చెందిన జట్టు కైవసం చేసుకుంది.దివిస్ లేబరేటరీస్ ఆర్థిక సహాయంతో గత కొన్నేళ్లుగా పరిసర ప్రాంతాల యువకులకు క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న విషయం విధితమే.పాత మూలకుద్దు క్రీడా మైదానంలో బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో జట్టుపై చిప్పాడ కూల్ థంపర్స్ జట్టు విజయం సాధించింది. సుమారు 21 రోజుల పాటు జరిగిన ఈ మెగా టోర్నీలో భీమిలి, భోగాపురం పరిసర మండలాలకు చెందిన 13 పంచాయతీల నుండి 31 గ్రామాలకు చెందిన 32 జట్లు తలపడ్డాయి. మొత్తం 63 మ్యాచ్ లు జరగాయి. ఈ పోటీలను 48 లీగ్, 15 నాక్ అవుట్ మ్యాచ్ లుగా విభజించారు. తిలకించారు.అనంతరం జరిగిన బహుమతుల ప్రధానోత్సవం సభలో క్రీడాకారులను ఉద్దేశించి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత భాగ్చి స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు.క్రీడా జట్ల స్ఫూర్తి అభినందనీయమని తెలిపారు. క్రీడాకారులు మరింత నైపుణ్యాలను పెంపొందించుకొని ఐపీఎల్ స్థాయి, ప్రపంచ స్థాయిలో క్రికెట్ ఆడి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.అపజయం పొందిన క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు కొనసాగాలని తెలిపారు. రాబోయే రోజుల్లో మహిళలకు కూడా ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించాలని దివిస్ యాజమాన్యానికి సూచించారు. తదనంతరం గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ తృతీయ,చతుర్ధ స్థానాలలో విజయం సాధించిన క్రికెట్ జట్లకు ప్రత్యేకమైన ట్రోఫీలు, జ్ఞాపికలతో పాటు 1,06,000/- రూపాయల నగదు ప్రోత్సాహకాలు అందించారు. దివిస్ యాజమాన్యంతో పాటు 32 జట్ల సారధి,సహాయక సారధులు ముఖ్య అతిథి డాక్టర్ శంఖబ్రత భాగ్చి ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ వై.ఎస్ కోటేశ్వరరావు, డీజిఎం పి జగదీష్ కుమార్, డీజీఎం గోపీనాథ్, సిఎస్ఆర్ మేనేజర్ డి సురేష్ కుమార్, సిఎస్ఆర్ సిబ్బంది మరియు క్రీడాకారులు క్రీడాభిమానులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. సిపి సాక్షిగా ఉపాధి కల్పించమని అడిగిన యువకుడు గొంతు నొక్కే ప్రయత్నం!! సాక్ష్యాత్తు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత భాగ్చి సాక్షి గా ఓ యువకుడి గొంతు నొక్కే ప్రయత్నం జరిగింది. స్థానిక యువత కు ఉపాధి కల్పించండి మహా ప్రభో అంటూ మూలకుద్దు కు చెందిన కొయ్య రమేష్ తన గళం విప్పాడు. క్రికెట్ మ్యాచ్ సందర్భంగా పోలీస్ కమిషనర్ ప్రసంగం జరుగుతుండగా మాకు జరుగుతున్న అన్యాయం ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదంటూ వాపోయాడు. స్థానిక దివిస్ కంపెనీ లో ఉద్యోగాలు విషయం లో యువత కు జరుగుతున్న అన్యాయాన్ని సీపీ కి వివరించాడు. ఓ పక్క కంపెనీ ప్రతినిధులు తనను ఈడ్చుకు తీర్చుకుపోతున్నప్పటికీ తన బాణీ కొనసాగించాడు. సుమారు 32పంచాయతీ ల యువకుల సమక్షంలో ఈ దారుణం జరగటం విశేషం. దివిస్ కంపెనీలో స్థానికంగా ఉన్న యువకులకు ఉద్యోగులు కావాలంటే స్థానిక నేతల రికమండేషన్ కావాలని సంస్థ చెబుతుందని, అలా అని నేతల దగ్గరికి వెళితే లక్షల రూపాయలు డిమాండ్ చేసే పరిస్థితి నెలకొందని రమేష్ విమర్శిస్తున్నాడు. లక్షల రూపాయలు వెచ్చించి ఉద్యోగాలు తెచ్చుకునే స్తోమత లేక, ఇలా ప్రశ్నిస్తున్న యువకుల గొంతు నొక్కే ప్రయత్నాలు మానుకోవాలని, కనీసం సిపి దృష్టి పెట్టి స్థానికంగా ఉన్న యువతకు దివిస్ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పించాలే చొరవ తీసుకోవాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత భాగ్చి ను రమేష్ వేడుకుంటున్నాడు.

# నర్సీపట్నంలో ఘనంగా ముగిసిన సంక్రాంతి కబడ్డీ పోటీలు

**– విజేతగా నిలిచిన సిద్ధి హనుమాన్ 'డి' జట్టు – బహుమతులు ప్రదానం చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు**

**– నర్సీపట్నం ను క్రీడాహబ్‌గా మారుస్తాం: స్పీకర్ అయ్యన్న**



**నర్సీపట్నం, జనవరి 14, మేజర్‌న్యూస్:** సంక్రాంతి సంబరాల్లో భాగంగా నర్సీపట్నంలో గత మూడు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి కబడ్డీ పోటీలు సోమవారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. స్థానిక వెలమవీధి కమిటీ ఆధ్వర్యంలో, కీ.శే. రుత్తల లచ్చపాత్రుడు గారి జ్ఞాపకార్థం పోలీస్ బ్యారెక్స్ మైదానంలో ఈ పోటీలను ఏర్పాటు చేశారు. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి లాలం కాశినాయుడు, కౌన్సిలర్ చింతకాయల రాజేష్‌తో కలిసి ఆసక్తిగా తిలకించారు. తుది పోరులో నర్సీపట్నం సిద్ధి హనుమాన్ 'ఎ' మరియు 'డి' జట్లు హోరాహోరీగా తలపడగా, ఆద్యంతం ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో సిద్ధి హనుమాన్ 'డి' జట్టు విజయం సాధించింది. అనంతరం విజేతలకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతిగా రూ. 20,000, ద్వితీయ బహుమతిగా రూ. 15,000లను జట్లకు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, క్రీడాకారుల్లో స్ఫూర్తిని నింపేలా వచ్చే మే నెలలో రాష్ట్రస్థాయిలో పురుషుల, మహిళల కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నట్లు ప్రకటించారు. నర్సీపట్నాన్ని క్రీడా ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, షటిల్ కోర్టులను పలుచోట్ల ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పోటీలను విజయవంతం చేసిన నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం జనసేన ఇంచార్జ్ సూర్యచంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ జి.వి. వెంకటరమణ, కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ రుత్తల కృష్ణ, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి లాలం మురళి, పట్టణ సీఐ గఫూర్, పలువురు కౌన్సిలర్లు, వెలమవీధి కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, క్రీడాకారులు, పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ తీర్థంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొణతాల



**అనకాపల్లి ప్రతినిధి, జనవరి 14, మేజర్‌న్యూస్:** కశింకోట మండలం, తీడ గ్రామంలో భోగి పండుగ, ఎన్టీఆర్ తీర్థ మహోత్సవం సందర్భంగా మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. ఎన్టీఆర్ తీర్థం సందర్భంగా స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళలు అర్పించారు. తీడ గ్రామంలో కూటమి నాయకులతో, ప్రజలతో కలిసి ఈ తీర్థం సందర్భంగా కూటమి శ్రేణులు, ప్రజలతో కలిసి భోగి పండుగలో, ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు మహిళలు పాల్గొన్నారు.

## భోగి సంబరాల పాల్గొన్న జనసేన పార్టీ ఇంచార్జ్

**– సంక్రాంతి సంబరాలు సందర్భంగా అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ రామ్కి**



**అనకాపల్లి ప్రతినిధి, జనవరి 14, మేజర్‌న్యూస్:** జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్కి సారథ్యంలో జనసేన పార్టీ కార్యాలయంలో భోగి పండుగను అత్యంత ఘనంగా ప్రారంభించి నిర్వహించారు. రాంకీ మాట్లాడుతూ అనకాపల్లి నియోజవర్గ ప్రజలందరికీ భోగి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి ఇంట్లో భోగభాగ్యలు తేవాలని ప్రతి ఇంట్లో సుఖశాంతులతో, జీవితంలో వెలుగులు నింపాలని ఆశిస్తూ మన ప్రియతమ నాయకులు మాజీ మంత్రివర్యులు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో అనకాపల్లి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలియజేస్తూ భోగి,సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంక్రాంతి సంబరాల్లో అనకాపల్లి నియోజకవర్గ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పాల్తేరు గ్రామంలో యువకులకు క్రికెట్ వాలీబాల్ కిట్లు పంపిణీ



**పాయకరావుపేట, జనవరి 14, మేజర్‌న్యూస్:** పాయకరావుపేట మండలం పాల్తేరు గ్రామంలో యువకులకు ప్లేయింగ్ కిట్లు పంపిణీ జరిగింది. దేవవరపు లోవరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు సమకూర్చిన క్రికెట్ వాలీబాల్ కిట్లను గ్రామ పెద్దలు యువకులకు అందజేశారు. క్రీడలలో మంచి ప్రావీణ్యాన్ని సంపాదించి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని తెలిపారు.

## అయితంపూడి మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి ఆకులు హెల్పింగ్ ఫౌండేషన్ విరాళం



**బుచ్చయ్యపేట, జనవరి 14, మేజర్‌న్యూస్:** మండలంలో అయితంపూడి గ్రామంలో గ్రామ దేవత శ్రీ మరిడిమాంబ అమ్మవారి ఆలయం నిర్మాణం జరుగుతుంది. ఈ ఆలయ నిర్మాణానికి ఆకులు హెల్పింగ్ ఫౌండేషన్ అధినేత ఆకుల నాగేశ్వరరావు రూ.5000/- రూపాయలు ఆలయ నిర్మాణం కోసం బుధవారం గ్రామంలో గ్రామ సర్పంచ్ పెద్దాడ నాయుడు కు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పెద్దాడ నాయుడుని మరియు ముచ్చకర్ల వెంకటరావు ను ఆకుల నాగేశ్వరరావు సాలువాతో సత్కరించారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ మీరు మీ గ్రామ ప్రజలందరూ మీ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. మా ఆకుల హెల్పింగ్ ఫౌండేషన్ తరపున ఎటువంటి సేవా కార్యక్రమాలు కైనా నేను ముందుకు వస్తానని గ్రామంలో తెలిపారు. అలాగే ఈ మరిడి మంబ అమ్మవారి ఆలయ నిర్మాణానికి జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు, ఎల్బీపీ అగ్రహారం మాజీ సర్పంచ్ తామరాన దాసు రూ.5016/-, సుంకర సత్యనారాయణ (కాంట్రాక్ట్ సత్తిబాబు) బుచ్చయ్య పేట రూ.10,016/- దిబ్బిడి ఉప సర్పంచ్ చిన్ని పైడిరాజు రూ.5016/-, డొంకిన కృష్ణ రూ.5016/- గుమ్మాలపాడు, గెంజి నాగేశ్వరరావు తండ్రి చిన అప్పారావు రూ.5016/- రావికమతం, కోమాట నాగేశ్వరరావు తట్టభంద రూ.5016/-, కొల్లి కసింనాయుడు బుచ్చయ్యపేట రూ.5016/- అలాగే ఇదేవిధంగా చాలా మంది అమ్మవారి ఆలయానికి దాతలు సహాయ సహకారాలు అందించారు. ఇలా అందించిన వారందరికీ గ్రామ సర్పంచు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు దాతలు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యోగ ,ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం పండుగ కానుక

**అచ్చుతాపురం, జనవరి 14, మేజర్‌న్యూస్:** మోటూరు త్రినాధ స్వామి ఏపీ సిపిఎస్ఈఏ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిలి రాష్ట్రంలో గల ఉద్యోగ ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుపరుస్తూ ఉద్యోగ ఉపాధ్యాయులకు పండగ నాడు సంతోషాన్ని ఇచ్చిందని ఏపీ సి.పి.ఎస్.ఈ.ఏ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మోటూరు త్రినాధ స్వామి అన్నారు 2018 వ సంవత్సరం నుండి ఉద్యోగ ఉపాధ్యాయులకు డిఏ కరువు భత్యం బకాయిలు ఉన్నాయి. వాటిలో 30 నెలల (2018జులై నుండి 2020 డిసెంబర్ )కాలానికి సంబంధించిన డి ఏ బకాయిలను సుమారు 1100 కోట్ల రూపాయలను నేడు కూటమి ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల ఖాతాల్లో జమచేసి ఉద్యోగులకు నిజమైన పండుగను అందించిందని ఇది కదా స్నేహ పూరిత ప్రభుత్వం అని ఆయన అన్నారు ఉద్యోగులకు పండగ నాడు సంతోషాన్ని ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ కి ప్రత్యేక కృతజ్ఞతలు ఉద్యోగ ఉపాధ్యాయుల తరపున తెలుపుతున్నట్లు ఆయన అన్నారు.

## అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

### - వాకపల్లిలో ఉత్సాహంగా కోలాట పోటీలు



**దేవరాపల్లి, జనవరి 14, మేజర్‌న్యూస్:** మండలంలోని అన్ని గ్రామాలలో సంక్రాంతి శోభ సంతరించుకుంది. భోగి పండుగను ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. మూడు రోజులు పాటు ముచ్చటగా జరిగే ఈ సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఆయా గ్రామాల ప్రజలు అన్ని ఏర్పాట్లను చేశారు. మండలంలోని వాకపల్లి గ్రామంలో శ్రీరాముల తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం సంక్రాంతి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉత్సాహంగా కోలాట పోటీలను నిర్వహించారు. ఈ కోలాటం పోటీల్లో 15 మహిళా బృందాలు పాల్గొని అందరినీ అలరించారు. ఈ పోటీలో గెలుపొందిన బృందాలకు భారీ నగదు బహుమతులను గ్రామస్తులు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 16,17, 18 తేదీల్లో గ్రామంలో శ్రీరాముల తీర్థ ఉత్సవాలు జరుగుతాయని ఈ కార్యక్రమంలో భాగంగా 15న మహిళలకు ముగ్గులు పోటీలు, 16 నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి వాలీబాల్, కబడ్డీ (మేట్) పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బుగత వెంకటరమణ, ఎంపీటీసీ గొరపల్లి భాస్కరరావు, మాజీ సర్పంచ్ బుదిరెడ్ల అప్పారావు, జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు బుగత నాగేశ్వరరావు, దొగ్గ నానాజీ, మామిడి గణేష్, బుగత కాశీ, ద్వారపరెడ్డి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

## ముచ్చటైన పల్లె పండుగలు భోగి, సంక్రాంతి, కనుమ

### - గ్రామీణ పల్లెల్లో సంబరాల సందడి

### - తెలుగువారి సాంప్రదాయ ప్రతీక తీర్థాలు



**దేవరాపల్లి, జనవరి 14, మేజర్‌న్యూస్:** సాంప్రదాయానికి అర్థం చెప్పే పండుగ. తెలుగువారికి పెద్ద పండగ.. ఎక్కడున్నా అందరూ ఒక్క చోటికి చేరి చేసుకునే పండుగ.. సంక్రాంతి పండుగ. సందడిని తెస్తూ అంబరాన్నంటే విధంగా సంబరాలు చేసుకో మని చెప్పే పండుగ సంక్రాంతి. పంటతల్లి ఇంటికొచ్చే పండుగ.. పదిమంది పంచుకునే ఫలితం. భూమి తల్లి ఇచ్చే భోగభాగ్యాలు.. సంక్రాంతి తెస్తుంది ధాన్యపురాశులు. ఇదీ మూడురోజుల పాటు ముచ్చటగా సందడిగా జరుపుకొనే సంక్రాంతి పండుగ సందర్భం. సంక్రాంతి పండుగకు నెలరోజుల ముందే ఇళ్లల్లో హడావిడి మొదల వుతుంది. మూడురోజుల పండుగను ఆస్వాదించడానికి ఎదురు చూపులు చూస్తారు. సాంప్రదాయాలకు నెలవైన పండుగ. తెలుగువారి సంస్కృతికి అద్దం పట్టే పండుగ. ఏ పండుగకు ఎలాగున్నా.. ఈ పండుగలో సంప్రదాయానికే ప్రాధాన్యత నిస్తారు. భోగి మొదలు ముక్క నుమ వరకు ఇంట్లో సందడే సందడి. కొత్త అల్లుళ్లు.. కొంటె మరదలు కోడి పందాలు.. పిండి వంటలు.. సరదా ఆటలుడి సాంప్రదాయ పనులుడెఅన్నీ సంక్రాంతిలో భాగమే. ఇవన్నీ ఒకెత్తైతే డూడూ బసవన్నలు, హరిదాసుల రాకలు ఊరికి దేవుళ్ల రూపంలో అతిథులొచ్చినట్లు గా తెలుగువారు భావించే సమయం.

## మాడుగుల చేరుకున్న సత్యసాయి మకర జ్యోతి

### - లోక కల్యాణార్థం దేశమంతా పర్యటన



**వి మాడుగుల, జనవరి 14, మేజర్‌న్యూస్:** భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి సత జయంతి ఉత్సవాల సందర్భంగా లోక కళ్యాణార్థం సత్య సాయి సేవ సంస్థలు ఆధ్వర్యంలో మకర జ్యోతి సందర్శన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత ఏడాది నవంబర్ 26న ఈ మకర జ్యోతి పుట్టపర్తి నుంచి ప్రారంభమై దేశవ్యాప్తంగా గల నాలుగు జోన్లలో ఈ జ్యోతిని ప్రజల సందర్శనార్థం బాబా మహిమనిత్వాలు తెలిపేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ ఆడదే నవంబర్ 23 నాటికి ఈ మకర జ్యోతి తిరిగి పుట్టపర్తి చేరుకుంటుంది. ఈ సందర్భంగా బుధవారం ఉదయం అల్లూరు జిల్లా నుంచి అనకాపల్లి జిల్లాకు ఈ మకర జ్యోతి చేరుకుంది. దీంతో మాడుగులలో జిల్లా సత్య సేవ సంస్థ అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు, చోడవరం చోడవరం జోన్ ఇంచార్జి లోవరాజు, మాడుగుల సమితి కన్వీనర్ శ్రీనివాసరావు , మందిర ఇన్చార్జి రాజు కొండ, సాయి సేవాదళ్ భక్తులు తదితరులు ఈ అఖండ జ్యోతి కి మాడుగుల బస్టాండ్ ఆవరణలో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా మాడుగుల మదమాంబ కాలనీలో గల బాబా మందిరానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు మకర జ్యోతి ఇన్చార్జి అయిన సుబ్బారావు మాట్లాడుతూ స్వామి శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ మకర జ్యోతి పర్యటన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సంక్రాంతి వేల మకర జ్యోతి సందర్శన ద్వారా అందరికీ మంచి జరగాలని అఖండ జనవాళికి మేలు జరగాలని, అందరికీ బాబా ఆశీస్సులు అందాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నేడు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో బాబా భక్తి మండలాలు ఏర్పాటు అయ్యాయని అనుక్షణం బాబా కీర్తనలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ ఏడాది నవంబర్ వరకు ఈ మకర జ్యోతి ప్రజ సందర్శనార్థం అన్ని సమితిలో ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు,జోన్ కన్వీనర్ లోవరాజు, సమితి కన్వీనర్ శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. ఈనెల 20వ తేదీ వరకు అనకాపల్లి జిల్లాలో ఈ మకర జ్యోతి పర్యటన ఉంటదని జిల్లా అధ్యక్షుడు తెలిపారు.

## సముద్రంలో గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం లభ్యం



**అచ్యుతాపురం, జనవరి 14 , మేజర్‌న్యూస్:** పూడిమడక సముద్రంలో ఆదివారం జరిగిన పడవ ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుడు గనగళ్ల సత్తియ్య మృతదేహం సోమవారం కొత్తపట్నం తీరంలో లభ్యమైంది. సముద్ర అలల తీవ్ర తాకిడికి వేటకు వెళ్లిన పడవ బోల్తా పడటంతో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పడవలో ఉన్న ఆరుగురు మత్స్యకారులు ప్రాణాపాయ స్థితిలో పడవను ఆశ్రయించి అతి కష్టంగా బయటపడగా, గనగళ్ల సత్తియ్య సముద్రంలో గల్లంతయ్యారు. ఘటన అనంతరం చేపట్టిన గాలింపు చర్యల్లో ఆయన మృతదేహం కొత్తపట్నం తీరానికి కొట్టుకొచ్చింది. సత్తియ్య మృతదేహం లభ్యమైన విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగి పోయారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మత్స్యకార సంఘాల నేతలు, గ్రామస్తులు సత్తియ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ, ప్రమాదంలో మృతి చెందిన సత్తియ్య కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా మత్స్యకారులకు తగిన భద్రతా చర్యలు, సహాయ చర్యలు చేపట్టాలని కోరారు.

# నక్కపల్లిలో ముగ్గుల పోటీలు

– మంత్రి అనిత చేతుల మీదుగా బహుమతుల ప్రదానం



**నక్కపల్లి, జనవరి 14, మేజర్‌న్యూస్:** హోం మంత్రి అనిత ఆధ్వర్యంలో, సంక్రాంతి సంబరాల్లో భాగంగా నక్కపల్లి మండలంలోని మంత్రి అనిత నివాసం వద్ద పండగ వాతావరణంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటిల్లో సుమారు 100 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ ముగ్గుల పోటీలను మంత్రి అనిత వీక్షించి, పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ జ్ఞాపకాలను అందజేశారు. అలాగే భరతనాట్యం, కూచిపూడి, కోలాటం ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులను ఘనంగా సత్కరించారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను మంత్రి అనిత అందజేశారు. పాయకరావుపేట, నక్కపల్లి, యస్.రాయవరం, కోటవురట్ల మండలాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రతి మండలం నుంచి ఒక మహిళకు చొప్పున రూ.10,000 నగదు బహుమతులు అందజేశారు. బహుమతుల వివరాలు మొదటి బహుమతి పాయకరావుపేటకు చెందిన కంద పరమేశలక్ష్మికి రూ.25,000 నగదు మరియు జ్ఞాపకాన్ని మంత్రి అందజేశారు. రెండో బహుమతి బి.కొత్తపల్లి గ్రామానికి చెందిన కామిరెడ్డి రమణమ్మకు రూ.20,000 నగదు అందజేశారు. మూడో బహుమతి గునుపూడి గ్రామానికి చెందిన పిల్లి రమణకుమారికి రూ.15,000 నగదు అందజేశారు. మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి కూడా నగదు బహుమతులు అందజేశారు. నక్కపల్లి మండలం వడ్డీమట్ట గ్రామానికి చెందిన లాలం కుమారికి రూ.10,000, యస్.రాయవరం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన జల్లా జ్యోతికి రూ.10,000, పాయకరావుపేట మండలం గోపాలపట్నం గ్రామానికి చెందిన నాగనందినికి రూ.10,000 కోటవురట్ల మండలం బి.కే.పల్లి గ్రామానికి చెందిన కశింకోటకు రూ.10,000 నగదు బహుమతులు మంత్రి అనిత అందజేశారు.ఈ కార్యక్రమము లో కూటమి నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్,గెడ్డం బుజ్జి,గింజల లక్ష్మణరావు,కురందాసు నూకరాజు, కొప్పిసెట్టి బుజ్జి,పద్దు,దార్ల కృష్ణ,లింగం నాయుడు, వెలగా శ్రీను, శ్రీకాంత్, వెంకటరాజు,అడవి రాజు తధితరులు పోల్గొన్నారు.

# జనసేన పార్టీ కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు

: పాల్గొన్న ఎమ్మెల్యే కొణతాల



అనకాపల్లి ప్రతిని ధి ,జనవరి 14 ,మేజర్ న్యూస్: సంక్రాంతి సంబరాలు సందర్భంగా ఈరోజు అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రిఅనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సంబరాలు భాగంగా మాట్లాడుతూ మాట్లాడుతూ అనకాపల్లి నియోజవర్గ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రతి ఇంట్లో భోగభాగ్యలు తో నిండాలని, ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతంగా, సుఖశాంతులతో, జీవితంలో వెలుగులు నింపాలని, పిల్లా పాపలతో మీ కుటుంబ అందరూ బాగుండాలని ఈ ప్రజా ప్రభుత్వం లో ప్రశాంతంగా నాణ్యత వాతావరణంలో అన్ని వర్గాలు ప్రజలు అందరూ క్షేమంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన ఆధ్వర్యంలో 16న ఎడ్లబండి పోటీలు




**నర్సీపట్నం, జనవరి 14, మేజర్‌న్యూస్:** నాతవరం మండలం దారగంగవరంలో ఈ నెల 16న జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఎడ్లబండి పోటీలు నిర్వహించనున్నట్లు జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర తెలిపారు. బుధవారం ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ, జనసేన నాయకుడు ప్రగడ కృష్ణబాబు నేతృత్వంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 16వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.12 వేలు, రెండవ బహుమతి రూ.10 వేలు, మూడవ బహుమతి రూ.8 వేలు, నాల్గో బహుమతి రూ.6 వేలు, ఐదవ బహుమతి రూ.4 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్న ఆయన, ఆ సంప్రదాయాలను కాపాడే ఉద్దేశంతో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఎడ్లబండి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జనసేన ఉపాధ్యక్షులు వూడి చక్రవర్తి, కార్యదర్శులు అల్లాడ సురేష్, పంచాడ హరినాథ్, మండల జనసేన పార్టీ అధ్యక్షులు వెలగల వెంకటరమణ, నర్సీపట్నం వైస్ ఎంపీపీ ఇన్నం రమణ, జనసేన నాయకులు భాస్కరరావు, గుడివాడ కృష్ణ, శివలంక సత్యనారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షులు సూర్యశేఖర్, కూటమి నాయకులు కాసారపు నూకరాజు, అప్పన విజయ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అయితంపూడి లో సంక్రాంతి సంబరాలు



**బుచ్చయ్యపేట, జనవరి 14, మేజర్‌న్యూస్:** మండలంలో అయితంపూడి గ్రామంలో సంక్రాంతి పండుగ ఘనంగా జరుపుకుంటున్నారు. బుధవారం భోగి పండుగ రోజున గ్రామంలో కుర్రవాళ్ళందరూ భోగి స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి భోగి మంటలు వేసుకున్నారు. గ్రామంలో చదువుకుంటున్న విద్యార్థులు, ఉద్యోగం చేసుకుంటున్నా ఉద్యోగులు అందరూ సంక్రాంతి పండగకి స్వగ్రామానికి రావడంతో కుర్రవాళ్ళందరూ కలిసి మెలిసి ఆనందంగా గడిపి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అలాగే గ్రామంలో మేలుకొలుపు మహిళా బృందం వాళ్లు గ్రామంలో సీతారాముల వారు ఉత్సవ విగ్రహాలు ఊరేగింపు నిర్వచించారు. అనంతరం మధ్యాహ్నం అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే గ్రామం లో అయితీరెడ్డి వారి తాడుపేద్ది సేవా గరిడి సింహాద్రి అప్పన్న సేవ కొలుపు కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. రాత్రి గ్రామంలో వెంకటరమణమూర్తి బాబు పాట ఏర్పాటు చేశారు. వెంకటరమణమూర్తి బాబు పాట వారి పాటని పెద్దలు, చిన్నలు, మహిళలు అందరూ కలిసి ఆనందంగా సంక్రాంతి పండుగ జరుపుకుంటున్నారు.

# ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని

## భోగిమంటల్లో జిరాంజీ జీవో కాపీలు దగ్ధం, ప్రజా సంఘాలు



**అచ్చుతాపురం, జనవరి 14, మేజర్‌న్యూస్:** ఉపాధి హామీ పథకం పై కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పద్ధతులు రద్దుచేసి ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఎర్రవరం, తిమ్మరాజుపేట, మోసయ్యపేట గ్రామాల్లో ఈరోజు భోగిమంటల్లో జి రామ్ జి పథకం జీవో కాఫీలు దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు గంగిరెడ్డి నారాయణమ్మ ,రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిఐటియు మండల కన్వీనర్ కె సోము నాయుడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును మార్చి వికసిత భారత్ జి రామ్ జి గా మార్చింది దీనివలన ఉపాధి కూలీలకు ఉపయోగం లేదని జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని యధాతంగా కొనసాగించాలని పని కోరే హక్కు గ్రామసభకు అధికారులు గతంలో వలె కొనసాగించాలని ఉపాధి హామీ మార్పులు చేయాలనుకుంటే ప్రజలతో విస్తృత చర్చలు 200 రోజులు పని 600 రూపాయలు కూలి వంటి ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కన్వీనర్ ఆర్ లక్ష్మి ఉపాధి హామీ శ్రామికులు కిల్లి లక్ష్మి, గుదేపార్వతి, రెడ్డి సత్యవతి, జనపరెడ్డి సత్యనారాయణ, నాగులపల్లి చిన్నమ్మలు, దేవుడమ్మ, మురళి, లక్ష్మి, దేవుడు, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# యువతలో చైతన్యం కోసమే ‘విజిబుల్ పోలీసింగ్ణ క్రీడలు

– జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



అనకాపల్లి (నాతవరం), జనవరి 14, మేజర్ న్యూస్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నివారణే ధ్యేయంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘విజిబుల్ పోలీసింగ్ణ క్రీడా పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో మాధవనగరం, నాతవరం, గంగవరం గ్రామాల్లో ‘విజిబుల్ పోలీసింగ్ణ కార్యక్రమంలో భాగంగా ఈ పోటీలను నిర్వహించారు. స్థానిక యువత కోసం వాలీబాల్, క్రికెట్ టోర్నమెంట్‌లను నిర్వహించారు. పండుగ సమయాల్లో యువత చెడు మార్గాల వైపు మళ్లకుండా, క్రీడల ద్వారా క్రమశిక్షణ, సోదరభావాన్ని పెంపొందించడం, అలాగే గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా నిఘా ఉంచడం తదితరవి నిర్వహించారు. నర్సీపట్నం రూరల్ ఇన్ స్పెక్టర్ రేవతమ్మ, ఎస్సై వై.తారకేశ్వరరావు, పోలీస్ సిబ్బంది గ్రామ పెద్దల సహకారంతో ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించారు. ?ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పోలీసులు ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని, శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని కోరారు. యువత క్రీడల్లో రాణించడం ద్వారా మానసిక ఉల్లాసాన్ని, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు. గ్రామ పెద్దలు ఈ చొరవను అభినందిస్తూ, పోలీసుల విజిబుల్ పోలీసింగ్ వల్ల ప్రజల్లో భద్రతా భావం పెరిగిందని హర్షం వ్యక్తం చేశారు.

## జాతర శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు



**మధురవాడ, జనవరి 14, మేజర్‌న్యూస్:** విశాఖపట్నం, మధురవాడ జాతర శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రామాలు నిర్వహిస్తున్నారు.



ఈ సంస్కృతి క కార్యక్రమాలలో మీనాక్షి డాన్స్ ఇన్స్టిట్యూట్ చిన్నారులచే నిర్వహించారు. ఇందులో చిన్నారులు జానపద నృత్యములు ప్రదర్శించారు. చిన్నారులు చేసిన జానపద నృత్యములు సందర్శకులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు. వినాయక కౌతాం, ఘల్లు ఘల్లు, ప్రాణవాలయం, రఘుకుల తిలక, మహాగణపతి, రాజాం కొండమీద, ముకుంద ముకుంద, ఐగిరినందిని గీతాలకు నృత్య ప్రదర్శన చేసారు. ఈ గీతాలకు బిందు శ్రీ, యోగిని, లక్ష్మి ప్రియా,కుసుమ, సంకీర్తన, ప్రతుషా,కల్పనా, శరణ్య అనే చిన్నారులు నృత్య ప్రదర్శన చేసారు. ఈ గీతాలకు డి. మీనా నృత్య దర్శకత్యం వహించారు. గురువారం సంక్రాతి పండుగ రోజు శ్రీ సిద్యేంద్ర యోగి నాట్యా లయం వారి శాస్ట్రీయ మరియు జానపద నృత్య ప్రదర్శన నిర్వహిస్తున్నట్లుశిల్పారామం పరిపాలన అధికారి రమేష్ రెడ్డి వెల్లడించారు.

## రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు

### వోడూరి ప్రసాద రావు మృతి తీరని లోటు

**(విశాఖ క్రైం : మేజర్ న్యూస్)**



రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడు, కమాండెంట్ రిటైర్డ్ వోడూరి ప్రసాద రావు మృతి తీరని లోటని పలువురు పోలీసు అధికారులు పేర్కొన్నారు.ఆయన చాలా చురుకైన సామాజిక కార్యకర్త అని, గొప్ప మనసున్న అధికారి, ఆయన తన ఆర్థిక స్థితికి మించి పేదలకు, అనాథలకు,వికలాంగులకు సేవ చేశారని కొనియాడారు.పోలీస్ శాఖ పిలుపు మేరకు ఆయన నిరాశ్రయుల మృతదేహాల అంత్యక్రియలకు హాజరయ్యేవారని తెలిపారు.ఆయన గోశాలలోని ఆవులకు, పశువుల మేతను క్రమం తప్పకుండా సరఫరా చేసేవారని వెల్లడించారు. కోవిడ్ -19 సమయంలో ఇన్‌పేషెంట్ సభ్యులకు ఆయన చేసిన సాహసోపేతమైన, చురుకైన సేవలు ప్రశంసనీయమని చెప్పారు. ఎప్పటికీ ఆయన సేవలు గుర్తుండిపోతాయని అన్నారు.ఆయన మృతి రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘానికి తీవ్ర నష్టమని పేర్కొన్నారు.రిటైర్డ్ పోలీస్ అధికారులు విశాఖపట్నం యూనిట్, బీచ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆయన అంత్యక్రియలకు హాజరై, దివంగత వోడూరి ప్రసాదరావుకి పుష్పగుచ్ఛాలు అర్పించారు.ఏపీ స్టేట్ అసోసియేషన్ అధ్యక్షుడు డిజిపి రిటైర్డ్ ఎం మాలకొండయ్య , ఐజిపి రిటైర్డ్ కె.లక్ష్మణ్ మోహన్, విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి వోడూరి ప్రసాద రావు కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.



# మస్కట్ చేరుకున్న ఐఎన్ఎస్‌వీ కౌండిన్య

**- 5,000 ఏళ్ల భారత్-ఒమాన్ సముద్ర సంబంధాలకు పునరుజ్జీవనం**

**- మస్కట్‌లోని పోర్ట్ సుల్తాన్ ఖబూస్ వద్ద సిబ్బందిని స్వాగతించిన కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్**

**విశాఖపట్నం, జనవరి 14, మేజర్‌న్యూస్:** భారత నౌకాదళానికి చెందిన సాంప్రదాయ పద్ధతిలో నిర్మించిన నౌక ఐఎన్ఎస్‌వీ కౌండిన్య, పోర్బందర్ నుంచి తన తొలి సముద్ర ప్రయాణాన్ని విజయవంతంగా పూర్తిచేసి మస్కట్ చేరుకుంది. ఇది భారత్--ఒమాన్ దేశాల మధ్య 5,000 సంవత్సరాల నాటి సముద్ర వారసత్వానికి ప్రతీకగా నిలిచింది. ఈ నౌకతో పాటు సిబ్బందిని కేంద్ర పోర్టులు, నౌకా రవాణా ఉ జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్ మస్కట్‌లోని పోర్ట్ సుల్తాన్ ఖబూస్ వద్ద ఘనంగా స్వాగతించారు.సాంప్రదాయంగా కుట్టిన పలకలతో నిర్మించిన ఈ పడవ ప్రయాణం, భారత్--ఒమాన్ దేశాల మధ్య ఉన్న లోతైన సముద్ర, సాంస్కృతిక మరియు నాగరిక సంబంధాలను మరోసారి గుర్తుచేస్తోంది. సముద్రాలు రెండు దేశాల మధ్య శతాబ్దాలుగా అనుసంధాన మార్గాలుగా నిలిచి, వాణిజ్యంతో పాటు సాంస్కృతిక పరస్పర సంబంధాలను పెంపొందించాయి. ఇరు దేశాలు దౌత్య సంబంధాల 70వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ సమయంలో ఈ యాత్రకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది.ఈ సందర్భంగా మంత్రి శర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ, “ఇది





కేవలం ఒక సముద్ర ప్రయాణం కాదు, ఇది రెండు దేశాల మధ్య ఉన్న ప్రాచీన నాగరిక బంధానికి ప్రతీక. ఈ కుట్టిన పడవ మస్కట్ చేరడం భారత్--ఒమాన్ స్నేహానికి చారిత్రక గుర్తు. ఈ సంబంధం వాణిజ్యంతో బలపడింది, పరస్పర గౌరవంతో మరింత పటిష్టమైంది. ఐఎన్ఎస్‌వీ కౌండిన్య గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీజీ దూరదృష్టికి నిదర్శనం అని అన్నారు. ప్రఖ్యాత భారత సముద్రయాత్రికుడు కౌండిన్య పేరుతో నామకరణం చేసిన ఈ నౌక, భారతదేశపు స్వదేశీ సముద్ర విజ్ఞానం, శిల్పకళ మరియు సుస్థిర నౌక నిర్మాణ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. పోర్టులో నిర్వహించిన స్వాగత కార్యక్రమంలో ఒమాన్ వారసత్వం ఉ పర్యాటక శాఖ అండర్‌సెక్రటరీ హిస్ ఎక్సలెన్సీ అజ్జాన్ అల్ బుసైది, భారత నౌకాదళం, ఒమాన్ రాయల్ నేవీ, రాయల్ ఒమాన్ పోలీస్ కోస్ట్ గార్డ్ మరియు ఇతర శాఖల సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్, ఒమాన్ రవాణా, సమాచార సాంకేతిక శాఖ మంత్రి హిస్ ఎక్సలెన్సీ ఇంజి. సయీద్ బిన్ హమూద్ బిన్ సయీద్ అల్ మవాలితో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెండు దేశాల మధ్య సముద్ర రంగ సహకారాన్ని విస్తరించడంపై చర్చించారు.

# ఆ సాంఘిక కార్యకలాపాలకు పెందుర్తి పోలీసులు చెక్

- **పెందుర్తి పోలీసుల వరుస దాడులు**
- **మూడు ప్రాంతాల్లో మెరుపు దాడులు**
- **కోడి పందేలు,పేకాట రాయళ్లు తో కలిపి 16 మంది అరెస్ట్**
- **రూ.25,150 నగదు,కోడిలు స్వాధీనం**




**పెందుర్తి, జనవరి 14, మేజర్‌న్యూస్:** పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ జూద కార్యకలాపాలను పూర్తిగా అరికట్టే దిశగా పెందుర్తి ఇన్‌స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఉక్కు పాదం మోపారు. విశ్వసనీయ సమాచారం మేరకు చేపట్టిన ఆకస్మిక దాడుల్లో జూదం, కోడిపందాల్లో పాల్గొన్న మొత్తం 16 మందిని అదుపులోకి తీసుకుని, రూ.25,150 నగదు మరియు కోడి లను స్వాధీనం చేసుకున్నారు.పండుగలు, ప్రత్యేక సందర్భాలను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమంగా జూద కార్యకలాపాలకు పాల్పడుతున్నారని గుర్తించిన పోలీసులు, ప్రజల శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా ఈ దాడులను నిర్వహించారు. ఎలాంటి ముందస్తు సమాచారం లీక్ కాకుండా, పూర్తిగా గోప్యంగా ఆపరేషన్‌ను అమలు చేయడం గమనార్హం.



**కోడిపందాలపై దాడి:** కృష్ణరాయపురం ప్రాంతంలో అక్రమంగా కోడిపందాలు నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కోడులు మరియు రూ.600/- బెట్టింగ్ నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఏపీ గేమింగ్ చట్టం సెక్షన్ 9(అఅ) కింద కేసు నమోదు చేశారు.

**పేకాటపై కఠిన చర్యలు:** బంటా కాలనీ ప్రాంతంలో పేకాట (కొత్తముక్కట) ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకుని, వారి వద్ద నుంచి రూ.3,500/- నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై ఏపీ గేమింగ్ చట్టం సెక్షన్ 9(అ) కింద కేసు నమోదు చేయడమైనది.అదే విధంగా, సింహపురి కాలనీలోని మామిడి తోట సమీపంలోని ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న పది మంది వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.21,050/- నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు కూడా ఏపీ గేమింగ్ చట్టం సెక్షన్ 9(అ) కింద నమోదు చేశారు.అక్రమ జూద కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని పోలీసులు స్పష్టం చేశారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటువంటి అక్రమాలకు పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక నిఘా, నిరంతర దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు.ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.